
'ప్రతి రైతూ పట్టణ ప్రాంత వ్యక్తితో సమానంగా ఆదాయం పొందాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+20 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 138

గురువారం 8-8-2019




**రుణాలు ఇక పండగే!**
గృహ, వాహన, కార్పొరేట్ రుణాలు మరింత చౌక
– బిజినెస్‌లో



**ఇక వన్డే సమరం**
నేడు వెస్టిండీస్‌తో టీమిండియా తొలి మ్యాచ్
– స్పోర్ట్స్‌లో


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




## రాష్ట్రానికి అండగా నిలవండి

- కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విన్నపం
- కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, గడ్కరీలతో సమావేశం
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతులను మర్యాదపూర్వకంగా కలిసిన సీఎం

బుధవారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

- వివరాలు 2లో

# పాక్ అక్కసు

**భారత రాయబారి బహిష్కరణ.. పాక్ రాయబారి వెనక్కు**

- ద్వైపాక్షిక సంబంధాలు తెంచుకుంటున్నట్లు ప్రకటన.. వాణిజ్యం నిలిపివేత
- ఆగస్టు 14ను 'సంఘీభావ దినం'గా పాటిస్తామన్న పాక్ ప్రధాని ఇమ్రాన్
- కశ్మీర్‌పై భారత్ నిర్ణయాన్ని ఐరాస దృష్టికి తీసుకెళతామన్న పాక్
- షోపియాన్, శ్రీనగర్‌లో పర్యటించిన ఎన్ఎస్ఏ అజిత్ దోవల్



భారత్.. ఆర్టికల్ 370 రద్దుపై పాక్ తీవ్రంగా స్పందించింది. అక్కసు వెళ్లగక్కుతూ ప్రతీకార చర్యలకు దిగింది. పాక్‌లో పనిచేస్తున్న భారత రాయబారి అజయ్ బిసారియాను అక్కడి నుంచి బహిష్కరించింది. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలన్నింటిని తెంచుకుంటున్నట్లు ప్రకటించింది. జమ్మూకశ్మీర్ విషయంలో భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి దృష్టికి తీసుకెళతామని పేర్కొంది. తమ గగనతలాన్ని సెప్టెంబర్ 5 వరకూ పాక్షికంగా మూసేస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయంలో తాము చైనాతోనూ సంప్రదింపులు జరపనున్నట్లు వెల్లడించింది. పీవోకేలో భారత్ దుశ్చర్యలకు దిగితే దీటుగా తిప్పికొట్టాలని సైన్యానికి ఆదేశాలిచ్చింది. భారత స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15ను 'బ్లాక్ డే'గా జరుపుకుంటామని పేర్కొంది.

- వివరాలు 5లో

## నేడు ప్రధాని మోదీ ప్రసంగం!

**'కశ్మీర్'పై దేశ ప్రజలకు వివరణ**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. ఆర్టికల్ 370లోని జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే నిబంధనల రద్దు, రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లదాఖ్‌లుగా విభజన తదితర నిర్ణయాలకు దారితీసిన కారణాలను ప్రజలకు వివరించనున్నారు.

## 370 రద్దుపై అధికారిక ఉత్తర్వులు

## నివురుగప్పిన నిప్పులా కశ్మీర్

- డేగ కళ్లతో పహారాకాస్తున్న భద్రతాబలగాలు
- కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్న కశ్మీరీ పండిట్లు



- వివరాలు 5లో

## సుష్మకు కన్నీటి వీడ్కోలు



సుష్మా స్వరాజ్ పార్థివదేహం వద్ద ప్రణామం చేస్తున్న ప్రధాని మోదీ

- ఢిల్లీలోని లోధి రోడ్డులో ఉన్న శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి
- భౌతిక కాయానికి రాష్ట్రపతి కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు
- కన్నీరు పెట్టుకున్న ప్రధాని
- అంత్యక్రియలకు హాజరైన వేలాది మంది
- ప్రభుత్వ లాంఛనాలతో తుది వీడ్కోలు

- వివరాలు 2లో



## మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఉప ఎన్నిక నోటిఫికేషన్

- జారీ చేసిన ఎన్నికల సంఘం
- 14వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- 16న నామినేషన్ల పరిశీలన
- ఉపసంహరణకు గడువు 19వ తేదీ.. అవసరమైతే 26న పోలింగ్

- వివరాలు 2లో






ఇదం జగత్



నిజమే! 370 రద్దుతో మన పార్టీలో కూడా సమస్యలొస్తున్నాయ్ సార్!

# వదలని వరద

**గోదావరిలో పోటెత్తుతున్న ప్రవాహం**
**ప్రమాదంలో పాత పోలవరం నెక్లెస్ బండ్**
**పరవళ్లు తొక్కుతున్న కృష్ణా**
**పొంగుతున్న వంశధార, నాగావళి**

సాక్షి నెట్‌వర్క్: గోదావరి మళ్లీ ఉగ్రరూపం దాలుస్తోంది. ఉప నదులైన శబరి, ఇంద్రావతితోపాటు సీలేరు, కొండవాగుల నుంచి భారీగా వరద నీరు చేరుతోంది. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద బుధవారం ఉదయం మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించినా సాయంత్రం మళ్లీ జారీ చేశారు. 10,45,342 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. ఆనకట్ట వద్ద బుధవారం రాత్రి 8 గంటలకు 12.20 అడుగుల నీటిమట్టం నమోదైంది. భద్రాచలం వద్ద నీటిమట్టం సాయంత్రం 5 గంటలకు 41.10 అడుగులకు చేరుకుంది. వరద మరింత పెరిగితే పశ్చిమ గోదావరి జిల్లా పాత పోలవరం గ్రామాన్ని ఆనుకుని ఉన్న నెక్లెస్ బండ్‌కు గండి పడే అవకాశం ఉంది. పోలవరం మండలంలోని 19 గ్రామాలకు 10 రోజులుగా



బుధవారం విజయనగరం జిల్లా తోటపల్లి బ్యారేజి వద్ద పరవళ్లు తొక్కుతున్న నాగావళి

బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. తూర్పు గోదావరి జిల్లాలోని ఏజెన్సీ, లంక గ్రామాలు ముంపులోనే ఉన్నాయి. కపిలేశ్వరపురం, పి.గన్నవరం, కొత్తపేట, రావులపాలెం, అల్లవరం, ముమ్మిడివరం, కాజులూరు, రాజమహేంద్రవరం రూరల్ మండలాల్లో సుమారు 17 వేల ఎకరాల్లో వాణిజ్య పంటలు నీటమునిగి దెబ్బతిన్నాయి. రాజోలు నియోజకవర్గంలో వెయ్యికిపైగా గృహాలు జల దిగ్బంధంలో

మిగతా 4వ పేజీలో ▶

## తీరం దాటిన తీవ్ర వాయుగుండం

- నేటి సాయంత్రానికి బలహీనపడుతుందన్న వాతావరణ విభాగం
- నేడు, రేపు ఉత్తరాంధ్రలో వర్షాలు

4లో

# రేపే భారీ పెట్టుబడుల సదస్సు

**35 దేశాల నుంచి ప్రతినిధులు హాజరు**

- పలు కీలక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం
- విదేశాల్లో పెట్టుబడుల ప్రోత్సాహకాల కార్యాలయాలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీ పెట్టుబడుల సదస్సు విజయవాడలో శుక్రవారం జరగనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన డిప్లొమాటిక్ ఔట్‌రీచ్ పేరుతో జరిగే ఈ సదస్సులో దక్షిణ కొరియా, యూకే, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో


మిగతా 2వ పేజీలో ▶




## క్లుప్తంగా...

### దేశ మహిళలందరికీ సుష్మా స్ఫూర్తిదాయకం

**ట్విట్టర్‌లో సీఎం వైఎస్ జగన్**


YS Jagan Mohan Reddy
@ysjagan
Shocked by the sudden demise of #SushmaSwaraj ji. A national stalwart and a towering personality who was loved across party lines. As an able administrator and an epitome of bravery & kindness, she inspired women of this country. My Condolences to her family.

**సాక్షి, అమరావతి:** మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత సుష్మా స్వరాజ్ మృతికి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సంతాపం తెలిపారు. 'సుష్మా స్వరాజ్ హఠాన్మరణం నన్ను దిగ్భ్రాంతికి గురి చేసింది. జాతీయ స్థాయిలో ఆమె సత్తా గల ఓ గొప్ప నాయకురాలు. ఆమెను పార్టీలకు అతీతంగా అందరూ అభిమానించారు. ఒక సమర్థ పరిపాలకురాలిగా ఆమె సాహసానికి, దయాగుణానికి మారు పేరుగా నిలిచారు. యావత్ దేశంలోని మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. సుష్మా కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేసున్నాను' అని సీఎం జగన్ ట్వీట్ చేశారు.

### 10వ తేదీ నుంచి ఎంసెట్ రెండో విడత కౌన్సెలింగ్

**సాక్షి, అమరావతి:** ఏపీ ఎంసెట్–2019 రెండో విడత కౌన్సెలింగ్ ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు అడ్మిషన్ల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ మంగళవారం రాత్రి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 10వ తేదీ నుంచి 12 వరకు ఆన్‌లైన్లో పరిశీలన పూర్తికాని ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. వీరు ఆయా హెల్ప్‌లైన్ కేంద్రాల్లో పరిశీలన చేసుకోవాలి. అనంతరం అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. ఈనెల 14న సీట్లను కేటాయిస్తారు.

### 3 ఎమ్మెల్సీ స్థానాలకు ఉప ఎన్నిక నోటిఫికేషన్

**సాక్షి, అమరావతి:** ఎమ్మెల్యే కోటాలోని మూడు ఎమ్మెల్సీ స్థానాల ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. ఈ మేరకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఎమ్మెల్సీలుగా ఉన్న ముగ్గురు సభ్యులు (కరణం బలరామ కృష్ణమూర్తి, ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని), కోలగట్ల వీరభద్రస్వామి) ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలవడంతో తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. దీంతో ఈ ఉప ఎన్నిక అవసరమైంది. ఈసీ జారీ చేసిన నోటిఫికేషన్‌ను అనుసరించి వివరాలిలా ఉన్నాయి..

- బుధవారం నుంచి ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ఈ నెల 14తో ముగుస్తుంది.
- 16న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది.
- ఈ నెల 19వ తేదీలోపు నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చు.
- ఈ స్థానాలకు అవసరమైతే ఈ నెల 26వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకూ పోలింగ్ నిర్వహిస్తారు. సాయంత్రం 5.00 నుంచి ఓట్ల లెక్కింపు.
- ఈ ఎన్నికలకు రిటర్నింగ్ ఆఫీసరుగా పి.బాలకృష్ణమాచార్యులు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసరుగా పి.వి.సుబ్బారెడ్డి వ్యవహరిస్తారు.

### రేపే భారీ పెట్టుబడుల సదస్సు

▶ మొదటి పేజీ తరువాయి

సహా 35 దేశాల ప్రతినిధులు పాల్గొననున్నారు. పరస్పరం ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను పెంపొందించుకునే దిశగా పలు ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. ముఖ్యంగా ఫార్మాస్యూటికల్, ఆటోమొబైల్, స్టీల్, టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ వంటి ప్రధాన రంగాల్లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అవకాశాలను ఆయా దేశాల ప్రతినిధులకు వివరించడం ద్వారా భారీగా పెట్టుబడులను ఆకర్షించాలన్నదే ఈ సదస్సు ఉద్దేశమని సీఎం కార్యాలయ(సీఎంవో) వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ పథకాలు, విధానాలను ఈ సదస్సు ద్వారా ప్రపంచ దేశాలకు తెలియచేయనున్నట్లు పేర్కొంటున్నాయి. అంతే కాకుండా ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మరింత పటిష్టం చేసుకోవడానికి వీలుగా ఆయా దేశాలను ఇక్కడ చాంబర్ ఆఫ్ కామర్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరనున్నారు. పెట్టుబడుల సదస్సు సందర్భంగా వివిధ దేశాల ప్రతినిధులతో సీఎం వైఎస్ జగన్ భేటీ అవుతారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరనున్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సదస్సు ఏర్పాట్లను మంత్రులు, ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

**విదేశాల్లో కార్యాలయాలు**

పెట్టుబడులను ఆకర్షించడానికి దేశ విదేశాల్లో పెట్టుబడుల ప్రోత్సాహక కార్యాలయాలను ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా దేశంలోని బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, ముంబై వంటి ప్రధాన నగరాల్లో బిజినెస్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. అలాగే టోక్యో, సియోల్ వంటి ఎంపిక చేసిన విదేశీ రాజధానుల్లో కార్యాలయాలు నెలకొల్పనున్నారు. సీఐఐ, ఫిక్కీ వంటి సంస్థల సహకారంతో పెట్టుబడుదారులతో సంప్రదింపులు జరుపుతారు. అంతర్జాతీయంగా పలు రంగాల్లో పేరున్న ప్రముఖులను పిలిచి, ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి సర్కారు ప్రణాళికలు రూపొందిస్తోంది.


రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


ఢిల్లీలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును కలిసిన వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బాలశౌరి, విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి

## రాష్ట్రపతితో సీఎం జగన్ సమావేశం

**సాక్షి, న్యూఢిల్లీ:** రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన రాష్ట్రపతిని కలవడం ఇదే తొలిసారి. ఉదయం 10.30 నుంచి 11.00 గంటల వరకు సాగిన ఈ సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి, లోక్‌సభ పక్ష నేత పీవీ మిథున్‌రెడ్డి కూడా ఉన్నారు.

**ఉప రాష్ట్రపతితోనూ భేటీ**

ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడితో సీఎం వైఎస్ జగన్ బుధవారం భేటీ అయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి, లోక్‌సభా పక్ష నేత పీవీ మిథున్‌రెడ్డి, ఎంపీలు బాలశౌరి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డిలు సీఎంతో పాటు ఉపరాష్ట్రపతిని కలిశారు. ఈ సమావేశం అనంతరం ఉప రాష్ట్రపతి ట్వీట్ చేస్తూ 'ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రోజు ఉదయం నన్ను కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించాం. ఏపీ సమగ్రాభివృద్ధికి మనం ఉమ్మడి కృషి చేయాలని ఆయనతో చెప్పాను. తెలుగు ప్రజలు ఏ సాయం కోరినా చేసేందుకు సంతోషిస్తాను' అని పేర్కొన్నారు.

# రాష్ట్రానికి అండగా నిలవండి

- నవరత్నాలు, అభివృద్ధి ప్రాజెక్టులకు ఉదారంగా సాయం అందించండి
- ప్రత్యేక హోదా ఇచ్చి విభజన హామీలను నెరవేర్చండి
- కేంద్ర ప్రభుత్వానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విన్నపం
- కేంద్రమంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, గడ్కరీలతో సమావేశం
- రాత్రి 10 గంటల నుంచి 11 వరకు గంటపాటు అమిత్ షాతో జగన్ భేటీ
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిని కలిసిన ముఖ్యమంత్రి


కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌తో సమావేశమైన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి జ్ఞాపికను అందజేస్తున్న వైఎస్ జగన్. చిత్రంలో ఎంపీ రఘురామ కృష్ణంరాజు

**సాక్షి, న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌కు చేయూతనందిస్తూ 'నవరత్నాలు' సహా వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టులకు ఉదారంగా సాయం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీ పర్యటన చేపట్టిన ముఖ్యమంత్రి జగన్ రెండో రోజు బుధవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడులను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉపరితల రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో సమావేశమై రాష్ట్రానికి అండగా నిలవాలని కోరారు. ఉదయం 9 గంటలకు ఉప రాష్ట్రపతిని, 10.30 గంటలకు రాష్ట్రపతిని కలుసుకున్న ముఖ్యమంత్రి మధ్యాహ్నం 12.30 నుంచి గంట పాటు నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. సాయంత్రం 4.30 నుంచి 5.30 వరకు ఆర్థిక మంత్రితో సమావేశమయ్యారు. రాత్రి 10 గంటల సమయంలో హోంమంత్రి అమిత్ షాను కలిశారు. 11 గంటల వరకు దాదాపు గంటపాటు ఈ సమావేశం కొనసాగింది. హామీలను నెరవేర్చాలని, విభజనతో నష్టపోయిన రాష్ట్రానికి అండగా నిలవాలని అమిత్‌షాను అభ్యర్థించారు. నవరత్నాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు భారీ కార్యక్రమాలను చేపట్టామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించిన ముఖ్యమంత్రి ఆయా కార్యక్రమాలకు సాయం చేయాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరారు. రెవెన్యూ లోటు భర్తీతోపాటు వెనుకబడిన జిల్లాలకు నిధులిచ్చి ఉదారంగా సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్త రహదారుల నిర్మాణం, నిర్వహణకు చేయూతనివ్వాలని, అమరావతి – అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి పూర్తిస్థాయిలో కేంద్రం గ్రాంట్లు ఇవ్వాలని నితిన్ గడ్కరీని కోరారు. ముఖ్యమంత్రి వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి, లోక్‌సభాపక్ష నేత పీవీ మిథున్‌రెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బాలశౌరి, రఘురామకృష్ణంరాజు, లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ బీశెట్టి వెంకట సత్యవతి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు తదితరులున్నారు.

**అమిత్ షాతో గంటపాటు వైఎస్ జగన్ భేటీ**

కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం రాత్రి 10 గంటల నుంచి 11 గంటల వరకు సమావేశమయ్యారు. అమిత్ షాను మంగళవారం మధ్యాహ్నమే కలవాల్సి ఉన్నా పార్లమెంట్‌లో జమ్మూ కశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ బిల్లుపై చర్చ, ఓటింగ్ ప్రక్రియ కారణంగా వీలు పడలేదు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఈ సమావేశం జరిగింది. విభజన హామీల అమలుకు హోంశాఖ నోడల్ వ్యవస్థగా ఉన్నందున విభజన హామీలన్నీ అమలయ్యేలా చూడాలని హోం మంత్రికి విన్నవించారు.

**ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి పూర్తి గ్రాంటు ఇవ్వాలి**

రాష్ట్రంలో పలు రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించాలని కోరిన ముఖ్యమంత్రి జగన్ ఆ వివరాలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి అందజేశారు. రహదారుల నిర్వహణ, నిర్మాణం కోసం గ్రాంట్లు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి – అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును కేంద్రమే భరించాలని కోరారు. తీవ్ర ఆర్థిక కష్టాలతో ఉన్న రాష్ట్రానికి కేంద్ర సహాయం ఎంతో అవసరమని నివేదించారు. విజయవాడ బెంజ్ సర్కిల్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి సంబంధించి నిధుల విడుదల అంశాన్ని కూడా గడ్కరీ దృష్టికి ముఖ్యమంత్రి తెచ్చారు.

**నవరత్నాలకు సాయం అందించండి...**

రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను పెంచడానికి 'నవరత్నాలు' ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టామని, దీనికి తగిన రీతిలో సాయం చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. ప్రతిపాదిత వాటర్ గ్రిడ్‌కు తగినన్ని నిధులు మంజూరు చేయాలని, రెవెన్యూ లోటు కూడా భర్తీ చేయాలని విన్నవించారు. పోలవరం ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయాల్సి ఉందని, దీనికోసం ఇప్పటివరకు చేసిన వ్యయాన్ని చెల్లించాలని, మిగిలిన మొత్తాన్ని సకాలంలో ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం ఇవ్వాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి ఆకాంక్షలకు అనుగుణంగా సముచిత రీతిలో సాయం చేయాలని ముఖ్యమంత్రి విన్నవించారు.

### సీఎం వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటన పొడిగింపు

**సాక్షి, అమరావతి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన గురువారం కూడా కొనసాగుతుండడంతో పులివెందుల, పెనుగొండ పర్యటనలు రద్దయ్యాయి. కియా కొత్త కారు విడుదలకు సీఎంకు బదులుగా పలువురు మంత్రులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగాన్ని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చదివి వినిపిస్తారు. కియా ఎండీ సహా దక్షిణ కొరియా రాయబారి కార్యక్రమంలో పాల్గొననున్నారు.

### ఆర్థిక మంత్రికి విన్నపాలు ఇవీ..

- రాష్ట్ర విభజన వల్ల ఏపీ తీవ్రంగా నష్టపోయింది. 2014–15లో రూ. 97 వేల కోట్లుగా ఉన్న అప్పులు ఐదేళ్లలో రూ. 2.58 లక్షల కోట్లకు చేరాయి. వెనుకబడ్డ జిల్లాల కోసం ఆరేళ్లలో రూ. 2,100 కోట్లు రావాల్సి ఉండగా రూ. 1,050 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. కేబీకే ప్యాకేజీ తరహాలో కేంద్రం నుంచి గ్రాంట్లు ఇచ్చి రాష్ట్రాన్ని ఆదుకోవాలి.
- ఏపీలో వాటర్ గ్రిడ్ ద్వారా ఇంటింటికీ రక్షిత తాగునీటి సరఫరా పథకానికి రూ.60 వేల కోట్లు ఖర్చు అవుతుంది. కేంద్రం తగిన రీతిలో దీనికి సహాయం అందించాలి.
- రాష్ట్రం పారిశ్రామికంగా, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రత్యేక హోదా అత్యంత అవసరం. ఏపీకి పారిశ్రామిక రాయితీలు, పదేళ్లపాటు జీఎస్టీ, ఆదాయపుపన్ను నుంచి మినహాయింపులు కల్పించాలి.
- పెట్టుబడి సాయం కింద రాష్ట్రంలో ప్రతి రైతుకుటుంబానికి వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏడాదికి రూ.12,500 చొప్పున అందజేస్తాం. 16 లక్షల మంది కౌలు రైతులకూ వర్తింపజేసే ఈ పథకానికి కేంద్రం తగిన విధంగా సహాయం చేయాలి. అన్నదాతలను ఆదుకునేందుకు ధరల స్థిరీకరణకు రూ. 3 వేల కోట్లు, ప్రకృతి వైపరీత్యాల నిధి కింద రూ. 2 వేల కోట్లు కేటాయించాం.
- అమ్మఒడి, 40 వేల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రతి పేద విద్యార్థికీ ఏటా రూ. 20 వేల చొప్పున బోర్డింగ్, హాస్టల్ ఖర్చుల కింద పంపిణీ చేసే కార్యక్రమాలు చేపడుతున్నాం. వీటికి కేంద్రం తగిన సహాయం చేయాలి.
- రూ. 5 లక్షల లోపు ఆదాయం ఉన్న ప్రతి ఒక్కరికీ వైద్య చికిత్స వ్యయం రూ.వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ వర్తింపజేసేలా పథకాన్ని సిద్ధం చేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని యూనివర్సల్ హెల్త్‌కేర్ దిశగా ప్రయాణం ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతున్నాం.
- రాష్ట్రంలో వచ్చే ఉగాది నాటికి 25 లక్షల మందికి ఇళ్ల స్థలాలు అందజేస్తాం. ఇందుకు కేంద్రం కూడా సహాయం అందించాలి.
- రాష్ట్రంలో డ్వాక్రా సంఘాల అప్పులు గత నాలుగేళ్లలో రూ. 14 వేల కోట్ల నుంచి రూ. 28 వేల కోట్లకు చేరాయి. వడ్డీ బరువు మోయలేక, రుణాలు చెల్లించలేక అక్కచెల్లెమ్మలు అల్లాడుతున్నారు. వైఎస్సార్ ఆసరా కింద నాలుగు విడతల్లో వారి చేతికే డబ్బులు ఇస్తాం. దీనిద్వారా దాదాపు 89 లక్షల మంది రుణ విముక్తులవుతారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 45 ఏళ్లు దాటిన మహిళలకు నాలుగేళ్లపాటు ఏడాదికి రూ. 19 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తాం. దీనికి తగిన రీతిలో కేంద్రం సాయం అందించాలి.
- వీటితోపాటు ప్రధానికి ఇప్పటికే అందజేసిన వినతిపత్రంలోని మరికొన్ని అంశాలను కూడా ముఖ్యమంత్రి తాజాగా అందజేసిన వినతిపత్రంలో పొందుపరిచారు.


సుష్మా స్వరాజ్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, సెల్యూట్ చేస్తున్న సుష్మ కుమార్తె బన్సూరీ, భర్త స్వరాజ్ కౌశల్


సుష్మా స్వరాజ్ అంత్యక్రియలకు హాజరైన ప్రధాని మోదీ, ఎల్‌కే అద్వానీ, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్రమంత్రులు అమిత్‌షా, గడ్కరి తదితరులు

### అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తె

సుష్మా స్వరాజ్ అంత్యక్రియలను ఆమె కుమార్తె బన్సూరీ నిర్వహించారు. స్వరాజ్ భౌతిక కాయాన్ని విద్యుత్ దహనవాటికలోని ప్లాట్‌ఫాంపై ఉంచిన అనంతరం, ఆ ప్లాట్‌ఫాం చుట్టూ బన్సూరీ నీటి కుండతో మూడు సార్లు తిరిగారు. కుండను జారవిడిచి పగులగొట్టారు. ప్లాట్‌ఫాం చుట్టూ బన్సూరీ తిరుగుతున్నప్పుడు ఆమె తండ్రి కూడా తోడుగా ఉన్నారు. వారిద్దరినీ మోదీ ఓదారుస్తూ కనిపించారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించిన బన్సూరీ, తన తండ్రితోపాటు సుప్రీం కోర్టులో లాయర్‌గా పనిచేస్తున్నారు.

# సుష్మకు కన్నీటి వీడ్కోలు

- లోధి రోడ్డులోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి
- భౌతిక కాయానికి రాష్ట్రపతి, ప్రధాని నివాళులు
- నివాళి అర్పిస్తూ కన్నీరు పెట్టుకున్న ప్రధాని మోదీ
- అంత్యక్రియలకు వేలాది మంది హాజరు


సుష్మా స్వరాజ్ పార్థివదేహం

**న్యూఢిల్లీ:** సహచరులు, మిత్రులు, అభిమానుల అశ్రునయనాల మధ్య బీజేపీ సీనియర్ నాయకురాలు, విదేశాంగ శాఖ మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ (67) అంత్యక్రియలు బుధవారం ఢిల్లీలో ప్రభుత్వ లాంఛనాలతో ముగిశాయి. లోధి రోడ్డులోని శ్మశానంలో ఉన్న విద్యుత్ దహనవాటికలో అంత్యక్రియలు జరిగాయి. త్రివర్ణ పతాకంతో చుట్టిన ఆమె భౌతిక కాయాన్ని మధ్యాహ్నం బీజేపీ కేంద్ర కార్యాలయం నుంచి శ్మశానానికి తరలించారు. గుండెపోటు కారణంగా సుష్మ మంగళవారం రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో మరణించారు. ప్రధాని నరేంద్ర మోదీ, భూటాన్ ప్రధాని షెరింగ్ తాబ్గే, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, పార్టీ సీనియర్ నాయకుడు ఎల్‌కే అద్వాణీ, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రముఖ రాజకీయ నాయకులు, సుష్మ కుటుంబ సభ్యులు, స్నేహితులు, ప్రజలు సహా వేలాది మంది సుష్మ అంత్యక్రియలకు హాజరై, విషణ్ణ వదనాలతో తుది వీడ్కోలు చెప్పారు. సుష్మ ఇంటి వద్ద ఆమె భౌతిక కాయానికి నివాళి అర్పిస్తూ మోదీ కంటతడి పెట్టారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు జంతర్ మంతర్‌లోని సుష్మ ఇంటి వద్ద, మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు బీజేపీ కార్యాలయంలోనూ సుష్మ భౌతిక కాయాన్ని ప్రజలు, నాయకుల సందర్శనార్థం ఉంచారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి శ్మశానవాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు ముగించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మోదీ, అమిత్ షా, అద్వాణీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ తదితర అనేక మంది నేతలు సుష్మ ఇంటికి వెళ్లి, భౌతిక కాయానికి నివాళులర్పించారు. నోబెల్ పురస్కార గ్రహీత కైలాశ్ సత్యార్థి, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా, ఎస్పీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్, బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి, కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, గులాం నబీ ఆజాద్, సీపీఎం నాయకురాలు బృందా కారత్, తృణమూల్ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్, యోగా గురువు బాబా రాందేవ్, బీజేపీ నాయకురాలు హేమ మాలిని తదితరులు సుష్మ ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. పలు రాష్ట్రాల సీఎంలు, ఇతర నాయకులు కూడా సుష్మ మృతికి ట్విట్టర్‌లో సంతాపం తెలిపారు.

**కన్నీరు పెట్టుకున్న అద్వాణీ**

సుష్మకు గురువుగా పేరుగాంచిన ఎల్‌కే అద్వాణీ, సుష్మ భౌతిక కాయం వద్దకు రాగానే కంటతడి పెట్టారు. ఆమె గురించి అద్వాణీ గుర్తు చేసుకుంటూ, 'నా ప్రతీ పుట్టిన రోజున నాకు ఎంతో ఇష్టమైన చాకొలెట్ కేక్‌ను సుష్మ తీసుకొచ్చేది. నేను నా బృందంలోకి చేర్చుకున్న నిబద్ధత కలిగిన యువ కార్యకర్త ఆమె. కాలక్రమంలో ఆమె మా పార్టీలో గొప్ప పేరున్న, ప్రఖ్యాత నాయకురాలిగా ఎదిగింది. పార్టీలోని, బయటి మహిళలకు ఆమె ఆదర్శప్రాయురాలు. ఏవైనా సంఘటనలను గుర్తుకు తెచ్చుకోవడంలో ఆమెకున్న జ్ఞాపక శక్తిని చూసి నేను ఎన్నోసార్లు ఆశ్చర్యపోయాను' అని చెప్పారు. కాగా, సుష్మ మరణంతో ఏర్పడిన లోటును పూడ్చటం చాలా కష్టమని అమిత్ షా అన్నారు. 'ఆమెను ప్రేమించే కోట్లాది మంది ప్రజలకు ఇది దుర్దినం. నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆమె ఐదేళ్ల కాలం పనిచేసి, భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా గౌరవం తీసుకొచ్చారు' అని ఆయన పేర్కొన్నారు.

**రాఖీ కట్టడానికి నా చెల్లెలు లేదు: వెంకయ్య**

దయ, ధైర్యం, ప్రేమ, మంచితనాలకు సుష్మా స్వరాజ్ మారుపేరు అని రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు కొనియాడారు. ఆమె అకాల మరణం విచారకరమనీ, దేశం ఓ గొప్ప పాలనాదక్షురాలిని, సమర్థవంతమైన పార్లమెంటేరియన్‌ని, ప్రజల గొంతుకగా నిలిచిన నిజమైన నాయకురాలిని కోల్పోయిందని ఆయన పేర్కొన్నారు. సుష్మకు రాజ్యసభ బుధవారం ఘనమైన నివాళి అర్పించింది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఆ సమయంలో సభలో ఉన్నారు. సభ సమావేశమైన వెంటనే సుష్మ మరణం గురించి ఓ నోట్‌ను వెంకయ్య చదివి సభ్యులకు తెలియజెప్పారు. దేశం అత్యున్నతంగా ఉండాలని ఆమె ఎప్పుడూ కోరుకునేదని అన్నారు. సుష్మ మరణం తనకు వ్యక్తిగతంగా లోటు అని వెంకయ్య చెబుతూ, ఆ గొప్ప నాయకురాలు చెప్పిన మాటలు, చేసిన పనులు ప్రజా జీవితంలో ఉన్న వారందరికీ స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. 'ఆమె నన్ను ఎప్పుడూ అన్నా అని పిలిచేది. మా ఇంట్లో జరిగే కుటుంబ, సంప్రదాయ వేడుకలకు అన్నింటికీ హాజరయ్యేది. ప్రతి రాఖీ పండుగకూ నా చేతికి రాఖీ కట్టేది. ఈ సారి నాకు ఆ గౌరవం దక్కదు. ఆమె మరణంతో నా జీవితంలో ఎంతో విలువైన చెల్లెల్ని నేను కోల్పోయాను' అని వెంకయ్య ఉద్వేగంతో చెప్పారు.

### సంబంధాల బలోపేతానికి ఎంతో కృషి చేశారు: చైనా

సుష్మా స్వరాజ్ మృతికి చైనా బుధవారం సంతాపం తెలిపింది. ఇండియా–చైనా ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో విదేశాంగ మంత్రిగా సుష్మ పాత్రను చైనా గుర్తుచేసుకుంది. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్ ఓ ప్రకటన విడుదల చేస్తూ, 'మేడం సుష్మా స్వరాజ్ ఇండియాలో సీనియర్ రాజకీయ నాయకురాలు. ఆమె మరణం పట్ల మేం సంతాపం తెలుపుతున్నాం. సుష్మ కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి. సుష్మ విదేశాంగ మంత్రిగా ఉండగా అనేకసార్లు ఆమె చైనాలో పర్యటించారు. చైనా–ఇండియా సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు' అని తెలిపారు. సుష్మా స్వరాజ్ చివరిసారిగా చైనాకు ఈ ఏడాది ఫిబ్రవరిలో వెళ్లి, ఆర్ఐసీ (రష్యా, ఇండియా, చైనా) విదేశాంగ మంత్రుల భేటీలో పాల్గొని వచ్చారు.

## క్లుప్తంగా...

### మూడు రోజుల ఢిల్లీ పర్యటనకు గవర్నర్

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ బుధవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. మూడు రోజుల ఢిల్లీ పర్యటనలో ఆయన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలతో భేటీ కానున్నారు. ఆయనతో పాటు గవర్నర్ కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా ఇతర అధికారులు ఢిల్లీ వెళ్లారు. ఆయన శనివారం తిరిగి విజయవాడ చేరుకోనున్నారు.

### ఈ నెల నుంచే ఆశాలకు రూ. 10 వేల వేతనం

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 42 వేల మందికి పైగా ఆశా (అక్రిడేటెడ్ సోషియల్ హెల్త్ యాక్టివిస్ట్) వర్కర్లకు పెరిగిన రూ. 10 వేల గౌరవ వేతనం ఈ నెల నుంచే అమలులోకి రానుంది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులిచ్చారు.

### మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజీనామా

**సాక్షి, అమరావతి:** ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికి నన్నపనేని రాజకుమారి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆమె లేఖను బుధవారం గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు అందజేశారు.

### రఘునాథబాబు బాధ్యతల స్వీకరణ



**కొరిటెపాడు(గుంటూరు):** భారత పొగాకు బోర్డు చైర్మన్‌గా యడ్లపాటి రఘునాథబాబు బుధవారం గుంటూరులోని బోర్డు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జీటీ రోడ్డులోని గుంటూరు కన్వెన్షన్ హాలులో ఆత్మీయ సమావేశం జరిగింది. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

### పెన్సిల్ చెక్కే బ్లేడ్‌తో చంపేశాడు

**చల్లపల్లి (అవనిగడ్డ):** రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన బీసీ హాస్టల్ విద్యార్థి దాసరి ఆదిత్య (8) హత్య కేసును పోలీసులు ఛేదించారు. కృష్ణాజిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు బుధవారం చల్లపల్లి సీఐ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. హత్యకు పాల్పడిన విద్యార్థి గుంటూరు జిల్లా చెరుకుపల్లి సమీపంలోని గూడవల్లికి చెందిన వాడని, నాలుగు హాస్టల్స్ మారి మూడు వారాల కిందట చల్లపల్లి హాస్టల్‌లో చేరాడని తెలిపారు. ఆ విద్యార్థి ఇటీవల హాస్టల్ ఆవరణలో బట్టలు ఉతుక్కుంటున్న సమయంలో ఆ నీళ్ల పక్కనే బట్టలు ఉతుక్కుంటున్న ఆదిత్యపై పడ్డాయని, దీంతో ఆదిత్య కోపంగా దూషించాడని, తన తల్లిని ప్రస్తావిస్తూ తిట్టడంతో అది మనసులో ఉంచుకొని ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటాడని ఎస్పీ వివరించారు. సోమవారం రాత్రి పెన్సిల్ చెక్కే బ్లేడ్‌ను జేబులో ఉంచుకుని ఆదిత్యను మూత్ర విసర్జనకు వెళదామని నిద్ర లేపాడని, హాస్టల్ టెర్రస్ పైకి తీసుకెళ్లి కింద పడేసి కాలితో తొక్కి పెట్టి, జేబులో ఉన్న చిన్నపాటి బ్లేడుతో రెండుసార్లు గొంతు కోసి హత్యకు పాల్పడ్డాడన్నారు.కాగా, హత్య చేసిన బాలుడి తండ్రి ఐదారు కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తండ్రి నేర ప్రవృత్తే బాలుడికి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు.

### ఏడు కార్లు ఢీ.. ఆరుగురి మృతి

- తమిళనాడులో ఘటన



**సాక్షి, చెన్నై:** ఏడు కార్లు ఒక దాని తర్వాత మరొకటి ఢీకొని ఆరుగురు దుర్మరణం చెందగా..నలుగురు పిల్లలు సహా 15 మందికి తీవ్ర గాయాలయిన ఘటన తమిళనాడులో చోటు చేసుకుంది. పుదుకోట్టైకు చెందిన చిదంబరం తిరుచ్చి–రామేశ్వరం జాతీయ రహదారిలోని నార్తామలై వద్ద బుధవారం సాయంత్రం ఓ కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొంది. ఈ రెండు కార్లు ఢీకొన్న సమయంలో అదే దారిలో అతి వేగంగా దూసుకొస్తున్న మరో ఐదు కార్లు ఒక దాని తర్వాత మరొకటి బలంగా ఢీకొన్నాయి. దీంతో ఘటనాస్థలంలోనే నలుగురు మరణించగా, మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందారు. నలుగురు పిల్లలు సహా 15 మంది తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పుదుకోట్టై పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాల్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుల వివరాలను సేకరిస్తున్నారు.

# వదలని వరద





చింతూరు శివారులో నీట మునిగిన ఇళ్లు, వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు



కొవ్వూరులోని వంతెన వద్ద గోదావరి పరవళ్లు

▶ మొదటి పేజీ తరువాయి

చిక్కుకున్నాయి. అల్లవరం మండలంలో 40 ఇళ్లు, పల్లిపాలెంలో 60 ఇళ్లు నీట మునిగాయి. కె.గంగవరం మండలం కోటిపల్లిలో 250 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. దేవీపట్నం మండలంలో 4,500 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి.

**శ్రీశైలానికి భారీ వరద**

కృష్ణానదిలో వరద ఉద్ధృతి పెరిగింది. శ్రీశైలం జలాశయంలోకి బుధవారం సాయంత్రం 6 గంటలకు 2,81,388 క్యూసెక్కులు చేరగా కుడి, ఎడమ విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా నాగార్జున సాగర్‌కు.. కల్వకుర్తి ఎత్తిపోతల, హంద్రీ–నీవా, పోతిరెడ్డిపాడు ద్వారా 81,458 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 155 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. మరో 61 టీఎంసీలు చేరితే జలాశయం పూర్తిగా నిండుతుంది. ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి దిగువకు 4.50 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్టు కర్ణాటక సర్కార్ బుధవారం తెలిపింది. భీమా నదిపై ఉజ్జయిని జలాశయం నిండిపోవడంతో గేట్లు ఎత్తేసి 1.75 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహం 4.50 లక్షల నుంచి 5 లక్షల క్యూసెక్కులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తుంగభద్ర నదిలో వరద ఉద్ధృతి పెరిగింది.

**ఉగ్రరూపం దాల్చిన వంశధార, నాగావళి**

వంశధార, నాగావళి నదులు ఉగ్రరూపం దాల్చాయి. తీర గ్రామాలను వంశధార ముంచెత్తింది. తోటపల్లి బ్యారేజిలో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. జియ్యమ్మవలస మండలం బాసంగిలో 30 ఇళ్లు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీవాణి బాధితుల్ని పరామర్శించారు. శ్రీకాకుళం జిల్లాకు వరద ముప్పు పొంచి ఉంది. వసప, నివగాం మాతల రహదారిపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

**ముంపు గ్రామాల్లో మంత్రుల పర్యటన**

దేవీపట్నం ముంపు గ్రామాల్లో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యేలు నాగులపల్లి ధనలక్ష్మి, జక్కంపూడి రాజా, తెల్లం బాలరాజు, పార్టీ నేత అనంత ఉదయభాస్కర్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ రేఖారాణి, కలెక్టర్ మురళీధర్‌రెడ్డి, ఎస్పీ నయీం అస్మీ, ఐటీడీఏ పీఓ నిషాంత్‌కుమార్ బుధవారం పర్యటించారు.

### తీరం దాటిన వాయుగుండం

**సాక్షి, విశాఖపట్నం:** ఉత్తర బంగాళాఖాతంలో సోమవారం ఏర్పడిన వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారి పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా తీరం సమీపంలో బాలాసోర్ వద్ద బుధవారం మధ్యాహ్నం 1.30–2.30 గంటల మధ్య తీరాన్ని దాటింది. ప్రస్తుతం ఉత్తర కోస్తా, పశ్చిమ బెంగాల్ పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉంది. పశ్చిమ వాయువ్య దిశగా ప్రయాణించి గురువారం మధ్యాహ్నం లేదా సాయంత్రానికి క్రమంగా బలహీనపడి వాయుగుండంగా మారనుందని ఐఎండీ పేర్కొంది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం వెల్లడించింది.

## శిశు మరణాల నియంత్రణకు ఏం చర్యలు తీసుకున్నారు?

- వైద్య శాఖను ప్రశ్నించిన ఫుడ్ కమిషన్
- సుమోటోగా 'సాక్షి' వార్త

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర వ్యాప్తంగా వివిధ బోధనా సుపత్రుల్లో జరుగుతున్న శిశు మరణాలకు కారణాలు చెప్పాలని, ఎందుకు శిశువులు మృతి చెందుతున్నారో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించింది. 2019 జనవరి 22న సాక్షి దినపత్రికలో 'శిశు మృత్యు ఘోష' శీర్షికన వచ్చిన వార్తను ఫుడ్ కమిషన్ సుమోటోగా స్వీకరించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 8 మాసాల్లో 7,850 మంది శిశువులు మృతి చెందారని, ఆస్పత్రుల వారీగా శిశువుల మృతుల వివరాలు ఆ కథనంలో సమగ్రంగా ఇచ్చారని పేర్కొంది. 28 రోజుల్లోపు వయసు చిన్నారులే 3,664 మంది ఉన్నారని, ఓవైపు శిశు మరణాలు తగ్గించాలని ప్రభుత్వం ఆదేశిస్తుంటే ఇంత తీవ్రస్థాయిలో చిన్నారులు మృతి చెందడమేంటని నిలదీసింది. సమగ్ర శిశు అభివృద్ధి సంస్థతో పాటు గర్భిణులకు పౌష్టికాహారం అందించే ఏజెన్సీలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించింది. న్యూట్రిషన్ ఫుడ్ స్టాండర్డ్ యాక్ట్ 2013 సరిగా అమలు కావడం లేదని కమిషన్ పేర్కొంది. మాతా శిశు మరణాల నియంత్రణకు ఏం చర్యలు తీసుకున్నారో వివరించాలని ఫుడ్ కమిషన్ ఆరోగ్య శాఖను ఆదేశించింది. దీనిపై గురువారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించనుంది.

## స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో ఏర్పాటయ్యే పరిశ్రమల్లో 75 శాతం మంది స్థానికులకే ఉద్యోగాలను కల్పించాలని సీఎం వైఎస్ జగన్ తీసుకొచ్చిన చట్టానికి అనుగుణంగా స్థానిక యువతలో నైపుణ్యాన్ని పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. 13 మంది సభ్యులతో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జేఎస్వీ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఈ కార్పొరేషన్ చైర్మన్‌ను ప్రభుత్వం ఎప్పటికప్పుడు నియమిస్తుంది. చైర్మన్‌తో పాటు స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ విభాగం కార్యదర్శులు, ఎపీఈఈడీఏపీ సీఈవో, ఎంప్లాయిమెంట్, శిక్షణ, సాంకేతిక విద్య, కళాశాల విద్య శాఖల కమిషనర్ లేదా డైరెక్టర్లతో పాటు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు జీఎంఆర్, డాక్టర్ రెడ్డీస్, మైఖెల్ సుసాన్ డెల్ ఫౌండేషన్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లకు చెందిన వ్యక్తులు భాగస్వామ్య డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు. వీరితో పాటు ఈ రంగంలో అనుభవం ఉన్న విశాఖ హెచ్‌పీసీఎల్‌కు చెందిన స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ సీఈవో, కార్యదర్శి, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఆర్‌సీఎం రెడ్డిని ప్రభుత్వం నామినేట్ చేసింది.



### ఏపీఎస్‌డీసీ చైర్మన్‌గా చల్లా బాధ్యతల స్వీకరణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌డీసీ) చైర్మన్‌గా చల్లా మధుసూదన్ రెడ్డి బుధవారం ఆ సంస్థ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయనకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా సంబంధాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని, రాష్ట్ర మంత్రులు బొత్స, ఆదిమూలపు సురేష్, గుమ్మనూరు జయరాం, వెలంపల్లి, ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈవో డాక్టర్ అర్జా శ్రీకాంత్‌తో పాటు ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, మల్లాది విష్ణు, కాసు మహేష్ రెడ్డి, ముస్తఫా, ఆళ్ల రామకృష్ణారెడ్డి, రక్షణనిధి, మాజీ ఎంపీ సి.రామచంద్రయ్య, ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి తదతరులు శుభాకాంక్షలు తెలిపారు.

## పకడ్బందీగా 'అమ్మఒడి'

విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

**సాక్షి, అమరావతి:** 'అమ్మఒడి' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా, పకడ్బందీగా అమలు చేయనుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. పేదరికం వల్ల పిల్లలు విద్యకు దూరం కారాదని అన్నారు. పలు ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయని, ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంస్కరణలతో విద్యా వ్యవస్థ బలపడుతుందని చెప్పారు. మంత్రి ఆదిమూలపు బుధవారం విజయవాడలో ఉపాధ్యాయ, పట్టభద్ర ఎమ్మెల్సీలు, అధికారులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. పాఠశాల, ఇంటర్ విద్యకు సంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని గుర్తుచేశారు. విద్యా వ్యవస్థలో సమస్యల పరిష్కారానికి రెగ్యులేటరీ, మానిటరింగ్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, కత్తి నర్సింహారెడ్డి, కె.ఎస్.లక్ష్మణరావు, ఎ.ఎస్.రామకృష్ణ, రామసూర్యారావు, రఘువర్మ, ఐ.వెంకటేశ్వరరావు, పీవీఎన్ మాధవ్‌తో మంత్రి ఆదిమూలపు సురేష్ పలు అంశాలపై చర్చించారు.

## సెప్టెంబర్‌లో పర్యాటకంపై సదస్సు

పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్

**సాక్షి, అమరావతి:** విశాఖలో సెప్టెంబర్‌లో పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, యువజన సర్వీసుల శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ తెలిపారు. పర్యాటకుల భద్రతకు విశాఖపట్నంలో పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బుధవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యంతో కలిసి మంత్రి టూరిజం, స్పోర్ట్స్, యువజన సర్వీసులు అంశాలపై సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2019 ఏడాదికి మంగళంపల్లి బాలమురళీకృష్ణ అవార్డును ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు బాంబే జయశ్రీకి 10న విజయవాడలో అందజేయనున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో కొత్త శిల్పారామాలకు పీపీపీ పద్ధతిలో భూమిని కేటాయిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలు నిర్వహించే యోచనలో ఉన్నామన్నారు.



పర్యాటకశాఖ అధికారులతో మంత్రి అవంతి సమీక్ష

## నీళ్లు తాగారు... ఓట్లేయలేదు: చంద్రబాబు

**సాక్షి, అమరావతి:** గత ఎన్నికల్లో టీడీపీ ఘోర ఓటమిని చంద్రబాబు ఇంకా జీర్ణించుకోలేక పోతున్నారు. సమయమొచ్చినప్పుడల్లా ప్రజలను అవహేళన చేస్తూ మాట్లాడుతున్నారు. తప్పంతా ప్రజలదేనన్నట్లు ఆక్రోశం వెళ్లగక్కటం పరిపాటిగా మారింది. తమను ఓడించారనే కారణంతో ప్రజలను నోటికొచ్చినట్లు నిందిస్తున్నారు. గుంటూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన వేమూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలోకూడా అదే ధోరణితో మాట్లాడారు. తాను ఎంతో కష్టపడి పట్టిసీమను కట్టి తాగడానికి నీళ్లిచ్చానని, వాటిని తాగారు కానీ తనకు ఓటేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో తాను ఎందుకు ఓడిపోయానో ఇప్పటికీ అర్థం కావడంలేదని చెప్పుకొచ్చారు.

# జూడాల ఆందోళన ఉద్రిక్తం

- **ఎన్ఎంసీ బిల్లుకు వ్యతిరేకంగా విజయవాడలో జాతీయ రహదారి దిగ్బంధం**
- అనుమతి లేదు.. విరమించాలని కోరిన పోలీసులు
- ట్రాఫిక్ పెరిగిపోవడంతో జూడాలు స్టేషన్‌కు తరలింపు
- జూడాపై డీసీపీ దురుసు ప్రవర్తనతో వివాదం
- క్షమాపణ చెప్పాలంటూ ప్రభుత్వాస్పత్రి ఆవరణలో నిరసన



జూడాలపై చెయ్యి చేసుకుంటున్న డీసీపీ



జూడాలను బూట్ కాలితో తన్నుతున్న టీటీడీ వీజీవో అశోక్‌కుమార్ గౌడ్

**లబ్బీపేట (విజయవాడ తూర్పు)/సాక్షి, అమరావతి/తిరుపతి తుడా:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)ను రద్దు చేయాలని కోరుతూ విజయవాడలో జూనియర్ వైద్యులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. ఆరు రోజులుగా ప్రభుత్వాస్పత్రి, వైద్య కళాశాల ప్రాంగణంలో నిరసనలు తెలుపుతున్న జూడాలు బుధవారం జాతీయ రహదారిపైకి వచ్చి మహానాడు రోడ్డు జంక్షన్‌ను దిగ్బంధం చేశారు. వారి ఆందోళన అర్థగంటకు పైగా సాగడంతో నాలుగు వైపులా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు ట్రాఫిక్ సమస్య దృష్ట్యా ఆందోళన విరమించాలని కోరారు. అందుకు జూడాలు నిరాకరించడంతో బలవంతంగా వాహనాల్లో ఎక్కించి భవానీపురం, వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లకు తరలించారు. ఆ క్రమంలో ఓ జూడాపై డీసీపీ హర్షవర్ధన్ దురుసుగా ప్రవర్తిస్తూ చేయి చేసుకోవడం వివాదాస్పదంగా మారింది.

**ఐఎంఏ ప్రతినిధుల సంప్రదింపులు**

ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ టీవీ రమణమూర్తి, డాక్టర్ మనోజ్ తదితరులు వన్‌టౌన్, భవానీపురం పోలీసుస్టేషన్‌లకు వెళ్లి జూడాలను వదిలి వేయాలని కోరారు. వారి భవిష్యత్‌తో కూడిన అంశం కావడంతో ఆందోళన చేస్తున్నారని తెలిపారు. ట్రాఫిక్ సమస్య సృష్టించాలని కానీ, ప్రజలను ఇబ్బంది పెట్టే ఉద్దేశం వారికి లేదని చెప్పడంతో కొద్దిసేపటి తర్వాత జూడాలను పోలీసులు వదిలివేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రికి చేరుకున్న జూడాలు.. తమ పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసు అధికారి క్షమాపణ చెప్పాలంటూ నిరసన దీక్షకు దిగారు.

**మంత్రి, కార్యదర్శులకు వినతిపత్రాలు**

ఎన్ఎంసీని రద్దు చేసి, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో కూడిన వినతిపత్రాలను జూనియర్ వైద్యుల సంఘ ప్రతినిధులు సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల కాళీకృష్ణప్రసాద్, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డికి సమర్పించారు.

**అలిపిరి వద్ద ఆందోళన.. రసాభాస**

ఎన్ఎంసీ బిల్లుకు వ్యతిరేకంగా తిరుపతిలో జూడాలు చేపట్టిన ఆందోళన రసాభాసగా మారింది. భక్తులు తిరుమలకు వెళ్లే అలిపిరి మార్గంలో రాస్తారోకో నిర్వహించడంతో మూడు గంటల పాటు రాకపోకలు ఆగిపోయాయి. దీంతో పోలీసులు, టీటీడీ సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ అధికారులు అక్కడకు చేరుకుని జూడాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఓ వైపు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో సహనం నశించి భక్తులు వైద్య విద్యార్థులతో గొడవకు దిగారు. ఈ క్రమంలో టీటీడీ విజిలెన్స్ అధికారి అశోక్‌కుమార్ గౌడ్ వైద్య విద్యార్థిపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు కాలితో తన్నడంతో ఒక్కసారిగా జూడాల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆ అధికారి చర్యలకు నిరసనగా మరోసారి ఆందోళనకు దిగారు. ఎంతకీ వినకపోవడంతో వారిని అరెస్టు చేసి ఎమ్మార్‌పల్లిలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌కు తరలించారు.

## క్విట్ కోడెల.. సేవ్ సత్తెనపల్లి

కొత్త ఇన్‌చార్జిని నియమించాలని అసమ్మతి వర్గం డిమాండ్

**సత్తెనపల్లి:** శాసనసభ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావుపై సొంతపార్టీ టీడీపీలోనే అసమ్మతి ఎగసిపడింది. కోడెల కుటుంబం గత ఐదేళ్లపాటు సాగించిన అరాచకాలపై గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ నేతలే గొంతెత్తారు. ఆయన కుటుంబం అరాచకాలపై విసిగి వేసారిపోయామని, సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొత్త వ్యక్తిని నియమించాలంటూ గుంటూరులోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలోనే ఆందోళనకు దిగారు. ముప్పాళ్ళ మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు తదితరుల నాయకత్వంలో అసమ్మతి వర్గీయులు బుధవారం తొలుత సత్తెనపల్లి పట్టణంలోని పాతబస్టాండ్‌లో ఉన్న టీడీపీ కార్యాలయం వద్ద కోడెలకు వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన చేపట్టారు. అనంతరం 200 మందికిపైగా అసమ్మతి నాయకులు, కార్యకర్తలు గుంటూరులోని రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వెళ్లారు. క్విట్ కోడెల.. సేవ్ సత్తెనపల్లి అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. నూతన ఇన్‌చార్జిని నియమించేవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆ సమయంలో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుతోపాటు కోడెల శివప్రసాదరావు సైతం రాష్ట్ర కార్యాలయంలోనే ఉండడం గమనార్హం. తర్వాత చంద్రబాబు కార్యాలయం నుంచి వెళ్లిపోయే సమయంలో కాన్వాయ్ వద్ద అసమ్మతి నాయకులు ఆయన్ను కలవగా.. 'నాకు అన్నీ తెలుసు. నేను చూసుకుంటా' అంటూ వెళ్లిపోయారు.



ఆందోళన చేస్తున్న టీడీపీ అసమ్మతి వర్గం

## విద్యార్థులను వలంటీర్లుగా నియమించొద్దు

పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ గిరిజాశంకర్

**సాక్షి, అమరావతి:** కాలేజీలకు వెళ్లి చదువుకుంటున్న విద్యార్థులను గ్రామ వలంటీర్లుగా నియమిస్తే వెంటనే వారిని తొలగించాలని పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ గిరిజాశంకర్ బుధవారం అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఏదైనా ప్రైవేట్ ఉద్యోగాల్లో పనిచేస్తున్న వారిని ఎంపిక చేస్తే తొలగించాలని ఆదేశించారు. రోజూ కాలేజీలకు వెళ్లేవారు, ఇతర ప్రైవేట్ ఉద్యోగాలు చేసేవారు బాధ్యతలను సమర్థవంతంగా, చిత్తశుద్ధితో నిర్వర్తించే అవకాశం ఉండదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డీపీవోలు, జెడ్పీ సీఈవోలు ఈ మేరకు ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 1,92,831 మంది వాలంటీర్ల ఎంపికకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. బుధవారం మధ్యాహ్నానికి 1,76,720 మందికి నియామక ఉత్తర్వులు అందజేసినట్టు పంచాయతీరాజ్ శాఖ అధికారులు తెలిపారు. మిగిలిన వారికీ నియామక ఉత్తర్వులు అందజేస్తామని చెప్పారు.

## సెప్టెంబర్ 26న ఫలితాలు.. 29న పోస్టింగులు

- సచివాలయ ఉద్యోగాల రాతపరీక్షలకు 7,022 కేంద్రాలు
- 16 లక్షల మందికి పైగా దరఖాస్తు

**సాక్షి, అమరావతి:** గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసేందుకు 1,26,728 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే రాత పరీక్షల ఫలితాలను సెప్టెంబర్ 26న ప్రకటించాలని, 29న పోస్టింగ్‌లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాతపరీక్ష నిర్వహణకు 7,022 రాతపరీక్ష కేంద్రాలను అధికారులు గుర్తించారు. వీటిలో ఒకే సమయంలో 17 లక్షల మందికి రాతపరీక్ష నిర్వహించే వీలుంటుంది. బుధవారం సాయంత్రం వరకు ఉద్యోగాలకు 16,46,146 మంది దరఖాస్తు చేసుకున్నారు. మరో మూడు రోజులు గడువు ఉండడంతో ఈ సంఖ్య 20 లక్షలకు చేరుకుంటుందని అధికారుల అంచనా. ఇందుకు అనుగుణంగా అవసరమైన ప్రాంతాల్లో మరికొన్ని కేంద్రాలను గుర్తిస్తారు. ఈ ఉద్యోగాలకు సెప్టెంబరు 1, 7, 8 తేదీల్లో రాతపరీక్ష నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. పూర్తి ఆబ్జెక్టివ్ తరహాలో జరిగే రాతపరీక్షకు సంబంధించి జవాబుల ప్రాథమిక 'కీ'ని పరీక్ష జరిగిన రోజునే విడుదల చేస్తారు. ప్రాథమిక 'కీ'పై అభ్యంతరాల పరిశీలనానంతరం రాతపరీక్ష జరిగిన నాలుగు రోజుల తర్వాత ఫైనల్ కీని విడుదల చేస్తారు. రాతపరీక్ష మెరిట్ జాబితా 16న ప్రకటించిన తర్వాత, 20వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేపడతారు. 26న ఫలితాలను ప్రకటించాలని ప్రభుత్వం ఖరారు చేసింది. జిల్లా యూనిట్‌గా వివిధ వర్గాలకు కేటాయించిన రిజర్వేషన్ల ప్రకారం రోస్టర్ పద్ధతిన అభ్యర్థుల ఎంపిక పూర్తి చేస్తారు. అక్టోబర్ 2 నుంచి విధుల్లో చేరాల్సి ఉంటుంది. రాతపరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్లను ఆగస్టు 12వ తేదీ తర్వాత నుంచి ఎప్పుడైనా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. రాష్ట్ర చరిత్రలోనే గతంలో ఎన్నడూ లేని తీరున రికార్డుస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ చేసిన నేపథ్యంలో నిర్ణీత అక్టోబరు రెండవ తేదీ కల్లా ఈ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడానికి ఒక ప్రణాళికను సైతం సిద్ధం చేసింది. ఇదిలా ఉండగా, జిల్లా కేంద్రాలతో పాటు రెవిన్యూ డివిజన్ కేంద్రాలు ఉండే పట్టణాలలో సైతం రాత పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

## కేజీబీవీ ఇంటర్ తరగతుల కేటాయింపు జీవోకు సవరణలు

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి 140 కేజీబీవీల్లో ఇంటర్ తరగతులు ప్రారంభించేలా గతంలో ఇచ్చిన జీఓ 37లో కొన్ని మార్పులు చేస్తూ ప్రభుత్వం సవరణ జీవో 51ను బుధవారం విడుదల చేసింది. విజయనగరం జిల్లాలోని రెండు కేజీబీవీల్లో ఇంటర్ తరగతులను ప్రారంభించాలని గత జీవోలో పేర్కొనగా తాజా సవరణ జీవోలో వాటిని ప్రకాశం జిల్లాకు మార్పు చేసింది. అలాగే, మరో 4 కేజీబీవీల్లో ఇంటర్ తరగతుల మంజూరులోనూ మార్పులు చేసింది. విజయనగరం జిల్లాలో చీపురుపల్లి కేజీబీవీకి బదులు ఎల్.కోట పేరును చేర్చింది. ఇదే జిల్లాలోని విజయనగరం, గజపతినగరం కేజీబీవీల్లో ఇంటర్ తరగతులను ప్రారంభించాలని ఇంతకు ముందు నిర్ణయించగా వాటిని ప్రకాశం జిల్లా డోర్నాల, త్రిపురాంతకం కేజీబీవీలకు మార్పు చేసింది. విశాఖపట్నం జిల్లా దేవరాపల్లికి బదులు రాంబిల్లి, హుకుంపేటకు బదులు గొలుగొండ కేజీబీవీలకు ఇంటర్ తరగతులను ప్రారంభించనుంది. కర్నూలు కేజీబీవీలో తాజాగా మైనార్టీలకు కేటాయిస్తూ ఉత్తర్వులను సవరించింది.

## మాది అక్రమ నిర్మాణమే

- హైకోర్టులో అంగీకరించిన ఆంధ్రజ్యోతి యాజమాన్యం
- మధ్యంతర ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరణ

**సాక్షి, అమరావతి:** తూర్పుగోదావరి జిల్లా, పాలచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో తాము నిర్మించిన భవనం అక్రమ నిర్మాణమేనని ఆంధ్రజ్యోతి యాజమాన్యం బుధవారం హైకోర్టులో అంగీకరించింది. దీని క్రమబద్ధీకరణ కోసం బీపీఎస్ కింద పెట్టుకున్న దరఖాస్తును అధికారులు తిరస్కరించారని పిటిషనర్ ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి అనూష తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. నిర్మాణాన్ని కూల్చివేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని హైకోర్టును పదే పదే కోరారు. హైకోర్టు అందుకు నిరాకరించింది. ఈ నిర్మాణం కూల్చివేతపై ఇప్పటికే స్టే ఉందని, మరోసారి స్టే ఇవ్వాల్సిన అవసరం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొంగర విజయలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

**అనుమతే తీసుకోలేదు...**

ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) కాసా జగన్మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ అనుమతి తీసుకోకుండానే భవనాన్ని నిర్మించారని, నిర్మాణం పూర్తయిన తరువాత అనుమతి కోసం దరఖాస్తు చేశారన్నారు. గడువు తేదీ ముగిసిన తరువాత దరఖాస్తు సమర్పించారని తెలిపారు. ఆగస్టు 31, 2018 నాటికి నిర్మాణాలు పూర్తయిన భవనాలకే బీపీఎస్ వర్తిస్తుందని వివరించారు. పిటిషనర్ 2018 డిసెంబర్ 29న భవన నిర్మాణానికి దరఖాస్తు సమర్పించారన్నారు. అలాంటప్పుడు ఆగస్టులో భవన నిర్మాణం పూర్తయిందని ఎలా చెబుతారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటి వరకు పిటిషనర్ నాలుగు వ్యాజ్యాలు దాఖలు చేశారని, ఒక దానికొకటి పరస్పర విరుద్ధంగా ఉన్నాయని చెప్పారు. వారు ప్రమాణ పూర్వకంగా దాఖలు చేసిన ఈ వ్యాజ్యాలను పరిగణనలోకి తీసుకున్నా ఆ భవనం అక్రమ నిర్మాణమే అవుతుందన్నారు.

# ద్వైపాక్షిక సంబంధాలకు బ్రేక్!

- జమ్మూకశ్మీర్ విషయంలో భారత నిర్ణయంపై పాకిస్తాన్ ప్రతీకారచర్య
- భారత రాయబారి బిసారియా బహిష్కరణ.. పాక్ రాయబారి వెనక్కు
- ద్వైపాక్షిక సంబంధాలు తెంచుకుంటున్నట్లు ప్రకటన.. వాణిజ్యం నిలిపివేత
- షోపియాన్, శ్రీనగర్‌లో పర్యటించిన ఎన్‌ఎస్‌ఏ అజిత్ దోవల్

**సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ/శ్రీనగర్/షోపియాన్/ఇస్లామాబాద్:** జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు, స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ని కేంద్రం రద్దుచేయడంపై పాకిస్తాన్ ప్రతీకార చర్యలకు దిగింది. పాక్‌లో పనిచేస్తున్న భారత రాయబారి అజయ్ బిసారియాను దేశం నుంచి బహిష్కరించింది. అలాగే భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలన్నింటినీ తెంచుకుంటున్నట్లు ప్రకటించింది. దీంతో పాటు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని నిలిపివేయాలని నిర్ణయించింది. ఇస్లామాబాద్‌లో ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అధ్యక్షతన బుధవారం జరిగిన జాతీయ భద్రతా కమిటీ(ఎన్‌ఎస్‌సీ) సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ భేటీకి ఇమ్రాన్‌తో పాటు పాక్ విదేశాంగ, హోం మంత్రులు, ఆర్థిక సలహాదారు, త్రివిధ దళాధిపతులు, ఐఎస్‌ఐ చీఫ్, కశ్మీర్ వ్యవహారాల మంత్రి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. కాగా, అజయ్ బిసారియా ఎన్నిరోజుల్లోగా దేశం విడిచిపెట్టిపోవాలో పాక్ స్పష్టత ఇవ్వలేదు.

**భద్రతామండలిని ఆశ్రయిస్తాం**

ఎన్‌ఎస్‌సీ సమావేశం అనంతరం పాక్ విదేశాంగ మంత్రి షా మెహమూద్ ఖురేషీ మీడియాతో మాట్లాడుతూ..'మా దౌత్యాధికారులు ఇకపై ఢిల్లీలో(భారత్) ఉండబోరు. అలాగే పాక్‌లో భారత రాయబారి అజయ్ బిసారియాను వెనక్కి పంపాలని నిర్ణయించాం. జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడగొడుతూ, ఆర్టికల్ 370ను రద్దుచేస్తూ భారత్ ఏకపక్షంగా చట్టవిరుద్ధమైన నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో భారత్‌తో కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందాలు, ఇతర ముఖ్యమైన విషయాల్లో కుదిరిన పరస్పర అవగాహన, ప్రోటోకాల్స్‌ను సమీక్షిస్తాం. అంతేకాదు.. జమ్మూకశ్మీర్ విషయంలో భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి దృష్టికి తీసుకెళతాం' అని తెలిపారు. తమ గగనతలాన్ని సెప్టెంబర్ 5 వరకూ పాక్షికంగా మూసేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ విషయంలో తాము చైనాతోనూ సంప్రదింపులు జరుపుతామని చెప్పారు. ప్రస్తుతం భారత రాయబారి అజయ్ బిసారియా ఇస్లామాబాద్‌లో పనిచేస్తుండగా, భారత్‌లో పాక్ రాయబారి మొయిన్–ఉల్–హక్ ఇంకా బాధ్యతలు స్వీకరించలేదు.


ఇస్లామాబాద్‌లో పాక్ జాతీయ భద్రతా కమిటీ సమావేశంలో ఆ దేశ ప్రధాని ఇమ్రాన్ ఖాన్

**ఆగస్టు 15.. 'బ్లాక్ డే'**

భారత్‌పై అంతర్జాతీయంగా ఒత్తిడి పెంచేందుకు పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులోభాగంగా జమ్మూకశ్మీర్‌లో మానవహక్కుల ఉల్లంఘనను ప్రపంచదేశాల దృష్టికి తీసుకెళ్లేందుకు అన్ని దౌత్యమార్గాలను వినియోగించుకోవాలని ఆదేశించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో భారత్ ఎలాంటి దుశ్చర్యకు దిగినా దీటుగా తిప్పికొట్టేందుకు వీలుగా మరింత అప్రమత్తంగా ఉండాలని పాక్ సైన్యానికి సూచించారు. పాక్ స్వాతంత్య్ర దినోత్సవమైన ఆగస్టు 14ను కశ్మీరీలకు సంఘీభావ దినంగా జరుపుకోవాలని ఎన్‌ఎస్‌సీ భేటీలో నిర్ణయించినట్లు ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. అలాగే భారత స్వాతంత్య్ర దినోత్సవమైన ఆగస్టు 15ను 'బ్లాక్ డే'గా జరుపుకుంటామని ప్రకటించారు. మరోవైపు భారత్ చర్యలను తాము ఖండిస్తున్నామనీ, కశ్మీరీలకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని పాక్ పార్లమెంటు ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది.

**ఐక్యరాజ్యసమితి ఆందోళన**

జమ్మూకశ్మీర్ విషయంలో భారత్ తీసుకున్న చర్యలపై తాము ఆందోళన చెందుతున్నామని ఐక్యరాజ్యసమితి తెలిపింది. దీనివల్ల రాష్ట్రంలో మానవహక్కుల ఉల్లంఘనలు మరింత తీవ్రమవుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇరుపక్షాలు చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఐరాస ప్రధాన కార్యదర్శి గ్యుటెరస్ కోరుకుంటున్నట్లు ఆయన అధికార ప్రతినిధి స్టెఫేన్ డుజర్రిక్ తెలిపారు. మరోవైపు భారత్–పాక్ మధ్య మిలటరీ ఉద్రిక్తత తలెత్తకుండా సత్వరం చర్చలు జరపాల్సిన అవసరముందని అమెరికా అభిప్రాయపడింది. 'ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులను మెరుగపర్చేందుకు, అన్నిపక్షాలు చర్చలు జరపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భారత్–పాకిస్తాన్‌ల మధ్య చర్చలు ప్రారంభమవ్వాలనీ, ఉద్రిక్తతలు తగ్గాలని అమెరికా కోరుకుంటోంది' అని వైట్‌హౌస్‌లోని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు విషయంలో భారత ప్రభుత్వం తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని స్పష్టం చేశారు.




## భారత్‌కు మద్దతుగా పాక్‌లో బ్యానర్లు

**ఇస్లామాబాద్:** అత్యంత కట్టుదిట్టమైన భద్రత గల రెడ్‌జోన్‌తో సహా పాకిస్తాన్ రాజధానిలోని పలు ప్రాంతాల్లో భారత్‌కు మద్దతుగా బ్యానర్లు దర్శనమిచ్చాయి. జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ఆ బ్యానర్లలో పేర్కొన్నారు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు వాటిని తొలగించారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. అలాగే పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్ దేశాలతో కూడిన 'అఖండ భారత్' మ్యాప్‌ను బ్యానర్లలో ప్రదర్శించారు. 'ఈరోజు జమ్మూకశ్మీర్‌ను తీసుకున్నారు. రేపు బలూచిస్తాన్.. ఆ తర్వాత పీవోకేను స్వాధీనం చేసుకుంటారు. అఖండ హిందుస్తాన్ కలను దేశ ప్రధాని సాకారం చేస్తారన్న పూర్తి నమ్మకం నాకుంది' అని శివసేన నేత సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలను కూడా ఆ బ్యానర్లలో పేర్కొన్నారు.

## బలగాల అధీనంలో మసీదులు

జమ్మూకశ్మీర్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా బలగాలు డేగకళ్లతో పహారా కాస్తున్నాయి. ప్రజలను వేర్పాటువాదులు మైక్‌ల ద్వారా రెచ్చగొట్టకుండా శ్రీనగర్, దానిచుట్టుపక్కల ప్రాంతాల్లో చాలా మసీదులను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ సందర్భంగా ఎలాంటి అల్లర్లు జరగకుండా మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ సహా 560 మందిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, కశ్మీర్‌లోయలో భద్రతాబలగాలు–ఆందోళనకారులకు మధ్య జరిగిన ఘర్షణ పలువురికి బుల్లెట్ గాయాలు కాగా, ఓ యువకుడు పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో జీలంనదిలో దూకడంతో ప్రాణాలు కోల్పోయాడు. జమ్మూకశ్మీర్ మాజీ సీఎం మెహబూబా ముఫ్తీని ఓ జైలు గదిలో ఒంటరిగా బంధించినట్లు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా అధికారులు నిషేధాజ్ఞలు ఎత్తివేస్తారా? లేక కొనసాగిస్తారా? అనే విషయంలో ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు.


జమ్మూ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు

## కశ్మీరీలతో దోవల్ ముచ్చట్లు

జమ్మూకశ్మీర్‌లో హైటెన్షన్ కొనసాగుతున్న నేపథ్యంలో జాతీయ భద్రతా సలహాదారు(ఎన్‌ఎస్‌ఏ) అజిత్ దోవల్ బుధవారం షోపియాన్, శ్రీనగర్‌లో పర్యటించారు. పోలీస్, ఆర్మీ ఉన్నతాధికారులతో సమావేశమై శాంతిభద్రతలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఉగ్రవాది బుర్హాన్‌వనీ స్వస్థలం షోపియాన్‌లో దోవల్ స్థానికులతో కలిసి సంప్రదాయ కశ్మీరీ వంటకం 'వజ్‌వాన్'ను రుచిచూశారు. స్థానిక ప్రజలతో ఈ సందర్భంగా దోవల్ మాట్లాడుతూ..'పరిస్థితి ఎలా ఉంది? ప్రజలు ఏమనుకుంటున్నారు?' అని అడిగారు. దీంతో ఓ స్థానికుడు అంతా బాగుందని జవాబిచ్చారు. వెంటనే దోవల్ స్పందిస్తూ..'అవును.. సమస్యలన్నీ సమసిపోతాయి. అందరూ ప్రశాంతంగా బతకాలి. దేవుడు ఏది చేసినా మనమంచికే. మీ భద్రత, సంక్షేమం మా బాధ్యత. మీ భవిష్యత్ తరాల అభివృద్ధి, సంక్షేమం కోసమే మేం ఆలోచిస్తున్నాం' అని తెలిపారు. అనంతరం సీఆర్పీఎఫ్ బలగాలను కలుసుకున్న దోవల్..'వామపక్ష తీవ్రవాదం నుంచి కశ్మీర్‌లో ఉగ్రవాదం వరకూ సీఆర్పీఎఫ్ బలగాలపై నిశ్చింతగా ఆధారపడగలనని భారత్ నమ్ముతోంది' అని వ్యాఖ్యానించారు.


షోపియాన్‌లో స్థానికులతో మాట్లాడుతున్న అజిత్ దోవల్


ఇటీవల శిలాజాల్లో కనుగొన్న ప్రపంచంలోనే అత్యంత భారీ చిలుక ఊహాచిత్రమిది. 1.9కోట్ల ఏళ్ల క్రితం జీవించిన ఈ చిలుక బరువు 7 కేజీలు. ఎత్తు ఒక మీటరు. న్యూజిలాండ్‌లో దీని శిలాజాన్ని కనుగొన్నారు

## '370' రద్దుపై ఉత్తర్వులు

**సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్న రాజ్యాంగంలోని 370వ అధికరణం రద్దయినట్లు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రకటించారు. ఈ అంశానికి సంబంధించిన తీర్మానాన్ని పార్లమెంటు ఉభయసభలు ఆమోదించిన అనంతరం, మంగళవారం రాత్రి రాష్ట్రపతి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. '2019 ఆగస్టు 6 నుంచి ఆర్టికల్ 370లోని అన్ని నిబంధనలూ రద్దవుతున్నాయి. ఇక నుంచి రాజ్యాంగంలోని అన్ని నిబంధనలూ యథాతథంగా జమ్మూకశ్మీర్‌లోనూ అమలవుతాయి. ఇందుకు వ్యతిరేకంగా భారత రాజ్యాంగంలో లేదా జమ్మూ కశ్మీర్ రాజ్యాంగంలో ఏవైనా నిబంధనలు ఉన్నా, లేక జమ్మూ కశ్మీర్‌లో భారత రాజ్యాంగం అమలవ్వకుండా ఏవైనా చట్టాలు, పత్రాలు, తీర్పులు, అత్యవసరాదేశాలు నోటిఫికేషన్లు తదితరాలు ఏమి ఉన్నా సరే.. అవన్నీ చెల్లవు' అని కోవింద్ తెలిపారు.

## 303 కేజీల నకిలీ గోల్డ్

**యశవంతపుర:** ఓ స్విమ్మింగ్ పూల్ కింద దాచి ఉంచిన 303 కేజీల నకిలీ బంగారు కడ్డీలను సిట్ బృందం సభ్యులు బుధవారం బెంగళూరులో స్వాధీనం చేసుకున్నారు. వేల కోట్ల విలువైన ఐఎంఏ గ్రూప్ పోంజీ స్కామ్‌ను సిట్ బృందం దర్యాప్తు చేస్తున్న విషయం తెల్సిందే. ఐఎంఏ గ్రూప్ అధిపతి మొహమ్మద్ మన్సూర్ ఖాన్‌కు చెందిన బెంగళూరులోని ఓ భవంతి ఆరో అంతస్తులో డీసీపీ గిరీశ్ ఆధ్వర్యంలో సిట్ బృందం సోదాలు చేసింది. ఆ అంతస్తులోని స్విమ్మింగ్‌పూల్ కింద గతంలో మన్సూర్ దాచిన 5,880 నకిలీ బంగారం కడ్డీలను సిట్ బృందం స్వాధీనం చేసుకుంది. తన గ్రూప్‌లో భారీగా పెట్టుబడులు పెట్టండంటూ ఈ నకిలీ బంగారం కడ్డీలు చూపించి ఇన్వెస్టర్లను మన్సూర్ మోసం చేసేవాడని సిట్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

## 'రాముడు అయోధ్యలో జన్మించాడనడానికి సాక్ష్యం'

**న్యూఢిల్లీ:** భక్తుల అచంచల విశ్వాసమే రాముడు అయోధ్యలో జన్మించాడనడానికి సాక్ష్యమని 'రామ్ లల్లా విరాజమాన్'అనే హిందూ సంస్థ సుప్రీంకోర్టుకు తెలిపింది. రాముడు అయోధ్యలోనే జన్మించాడని చెప్పేందుకు మీ వద్ద ఆధారాలు ఉన్నాయా అన్న ధర్మాసనం ప్రశ్నకు ఈ మేరకు బదులిచ్చింది. కేసు రోజువారీ విచారణలో భాగంగా బుధవారం సుప్రీంకోర్టులో హిందూ సంస్థలు తమ వాదనలు వినిపించాయి. శతాబ్దాల క్రితం జరిగిన ఘటనకు ఆధారాలు ఎలా చూపించగలమని రామ్ లల్లా తరపు న్యాయవాది వాదించారు.

# మన్మోహన్‌తో కవిత్వ యుద్ధం

2009–14 మధ్య (15వ లోక్‌సభ) కాలంలో కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ అధికారంలో ఉండగా, బీజేపీ ప్రతిపక్షంలో ఉంది. అప్పుడు ప్రధానిగా మన్మోహన్, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా సుష్మా స్వరాజ్ ఉన్న సమయంలో వారిరువురి మధ్య పలు కవితా యుద్ధాలు చేటుచేసుకున్నాయి. అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధాలతో 15వ లోక్‌సభ సమావేశాల్లో అనేకసార్లు అసహ్యకర పరిస్థితులు తలెత్తాయి. అయితే కొన్నిసార్లు మన్మోహన్, సుష్మలు.. ఒకరిపై ఒకరు కవితాత్మకంగా చేసుకున్న విమర్శలు సభ్యులను ఉల్లాసపరిచాయి. వారిద్దరి హాస్య చతురత అందరికీ గుర్తుండేలా చేశాయి. ఓ సారి మన్మోహన్ మాట్లాడుతూ, మీర్జా ఘాలిబ్ రాసిన ప్రఖ్యాత కవితను చదివారు. 'హమ్ కో ఉన్ సే వఫా కీ హై ఉమ్మీద్, జో నహీన్ జాన్‌తే వఫా క్యా హై' (విశ్వాసం అనే పదానికి అర్థం కూడా తెలియని మనుషుల దగ్గరి నుంచి మేం విశ్వాసాన్ని ఆశిస్తున్నాం) అని మన్మోహన్ అనగా, సుష్మ దీనికి స్పందిస్తూ, బషీర్ బద్ర్ కవితతో సమాధానం ఇచ్చారు. 'కుచ్ తో మజ్‌బూరియా రహీ హోంగీ, యూం హీ కోయీ బేవఫా నహీ హోతా' (కొన్ని తప్పనిసరి పరిస్థితులు ఉండుండాలి. ఏ కారణమూ లేకుండా ఊరికే ఎవ్వరూ నమ్మిన వారిని మోసం చేయరు) అని సుష్మ బదులిచ్చారు. ఆ వెంటనే మన్మోహన్‌ను ఉద్దేశించి సుష్మ మరో కవిత చదువుతూ 'తుమ్హే వఫా యాద్ నహీ, హమే జఫా యాద్ నహీ; జిందగీ ఔర్ మౌత్ కే తో దో హీ తరణే హై, ఏక్ తుమ్హే యాద్ నహీ, ఏక్ హమే యాద్ నహీ' (నా విశ్వాసాన్ని మీరు గుర్తుంచుకోరు. మీకు విశ్వాసం లేకపోవడాన్ని నేను గుర్తుంచుకోను. జీవితంలో రెండే పాటలు ఉన్నాయి. ఒకటి మీరు గుర్తుంచుకోరు. ఇంకోటి నాకు గుర్తుండదు) అని చెప్పడంతో సభ్యులంతా ప్రశంసించారు. ఇలాంటి సందర్భాలు 15వ లోక్‌సభలో ఎన్నో ఉన్నాయి.

**వచ్చి మీ రూపాయి తీసుకోండి**

సుష్మా స్వరాజ్ మంగళవారం రాత్రి తనకు చేసిన ఫోన్ కాల్‌ను, మాట్లాడిన మాటల్ని గుర్తుచేసుకొని సాల్వే కంట తడి పెట్టారు. అప్పటివరకు నవ్వుతూ మాట్లాడిన ఆమె అంతలోనే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోతారని ఎవరూ ఊహించలేకపోయారని అన్నారు. గుండెపోటుకు అరగంట ముందు, మంగళవారం రాత్రి 8:50 గంటల ప్రాంతం లో సుష్మా హరీష్‌కి కాల్ చేసి మాట్లాడారు. . 'మా ఇద్దరి మధ్య జరిగిన సంభాషణ చాలా ఉద్వేగపూరితమైనది. ఒక్క రూపాయి నేను నీకు ఇవ్వాల్సి ఉంది. వెంటనే వచ్చి తీసుకోండి' అని ఆమె చెప్పారని ఆయన అన్నారు. ''నిజంగానే ఆ రూపాయి ఎంతో విలువైనది. ఎందుకంటే అది ఒక లాయర్‌గా నాకు ఆమె చెల్లించే ఫీజు. అందుకే తప్పకుండా వచ్చి తీసుకుంటా' అని నేను చెప్పాను. ' సరే బుధవారం సాయంత్రం 6 గంటలకల్లా వచ్చి ఆ రూపాయి తీసుకోండి' అని ఆమె చెప్పారు. 'నేను సరే' అనడంతో ఆమె ఫోన్ పెట్టేశారు. సుష్మాతో అవే చివరి మాటలవుతాయని ఊహించలేకపోయానని సాల్వే గద్గద స్వరంతో చెప్పారు.



**ఆ రూపాయి కథేంటంటే..**

పాక్ జైల్లో ఉన్న కుల్‌భూషణ్ జాధవ్ కేసును అంతర్జాతీయ కోర్టులో సాల్వే వాదించారు. అందుకు ఆయన భారత ప్రభుత్వం దగ్గర కేవలం ఒక్క రూపాయి మాత్రమే ఫీజు తీసుకుంటానని చెప్పారు. ఈ కేసులో ఆయన గెలవడంతో జాదవ్ ఉరి ఆగింది. భారత్ తరఫున సాల్వేను నియమించినప్పుడు విదేశాంగ మంత్రిగా సుష్మా స్వరాజ్ ఉన్నారు.

## రోజుకో రంగు చీర

సుష్మా స్వరాజ్‌కు ఓ వైవిధ్యమైన అలవాటు ఉంది. వారంలో ఏ రోజు ఏ రంగు చీర కట్టుకోవాలనే దానిపై ఆమె కొన్ని నిబంధనలను పెట్టుకున్నారు. ప్రతి సోమవారం ముత్యపు తెలుపు రంగు లేదా క్రీమ్ కలర్ చీరలు, మంగళవారాల్లో ఎరుపు, కాషాయం లేదా దొండపండు రంగు చీరలు, బుధవారాల్లో ఆకుపచ్చ రంగు, గురువారాల్లో పసుపుపచ్చ రంగు, శుక్రవారాల్లో బూడిద లేదా వంగపూత రంగు, శనివారాల్లో నీలం లేదా నలుపు రంగు చీరలను ఆమె ధరించేవారు. ఆదివారం ఏ రంగు దుస్తులు వేసుకోవాలనేదానిపై ప్రత్యేకమైన నిబంధనలేమీ ఉండేవి కావు. దాదాపు గత రెండు దశాబ్దాల పాటు ఆమె ఈ అలవాటును పాటించారు. ఇలా రోజుకో రంగు చీర ధరించేందుకు జ్యోతిష్యం లేదా మూఢనమ్మకాలు కారణం కాదనీ, కేవలం అది తన అలవాటని సుష్మ గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. కాగా, బీజేపీ ఎంపీ ఎస్ఎస్ అహ్లువాలియాకు కూడా ఇలాంటి అలవాటే ఉంది. సిక్కు అయిన ఆయన, రోజుకో రంగు తలపాగాను ధరిస్తారు.

# నివురుగప్పిన నిప్పులా కశ్మీర్

- డేగ కళ్లతో బలగాల పహారా
- కేంద్రం నిర్ణయంపై పండిట్ల హర్షం

**(జమ్మూకశ్మీర్ నుంచి సాక్షి ఇన్ పుట్ ఎడిటర్ ఇస్మాయిలుద్దిన్)**

శ్రీనగర్‌లో ప్రస్తుతం ఎటుచూసినా సాయుధ బలగాలే ఉన్నాయి. బయటివారి సంగతి పక్కనపెడితే స్థానికులు కూడా ఇంట్లోంచి అడుగుతీసి బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. అడుగడుగునా సీఆర్పీఎఫ్ బలగాలు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాయి. ఎక్కడకు, ఎందుకు వెళుతున్నారు? అనే సీఆర్పీఎఫ్ జవాన్ల ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానాలు ఇస్తేనే ముందుకెళ్లేందుకు అనుమతిస్తున్నారు. శ్రీనగర్–జమ్మూ మధ్య 260 కి.మీ దూరాన్ని సాధారణ పరిస్థితుల్లో 6–7 గంటల్లో దాటేయొచ్చు. కానీ ప్రస్తుతం ప్రతీ కిలోమీటర్‌కు ఓ సీఆర్పీఎఫ్ పోస్ట్(మొత్తం 260 పోస్టుల)ను ఏర్పాటుచేశారు. ప్రతీ వాహనానికి వారు ఓ ప్రత్యేక నంబర్ కేటాయిస్తున్నారు. అదుంటేనే బండి ముందుకు కదులుతుంది. జమ్మూకశ్మీర్‌కు సంబంధించి కేంద్రం తీసుకున్న ఆర్టికల్ 370 రద్దు గురించి చాలామంది కశ్మీరీలకు తెలియదు. ఇందుకు కమ్యూనికేషన్ల వ్యవస్థ మొత్తం స్తంభించిపోవడమే కారణం. అయితే ఆర్టికల్ 370 రద్దు గురించి తెలిసిన కొందరు కశ్మీరీలు మాత్రం కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై పెదవి విరిచారు. తమ జీవితాలకు సంబంధించిన కీలక నిర్ణయం తీసుకునే సందర్భంగా తమకు కనీస సమాచారం ఇవ్వలేదనీ, విశ్వాసంలోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



**కశ్మీరీల్లో భయాందోళన..**

ఆర్టికల్ 370తో తమ జీవితాలు మారిపోతాయనే వాదనను స్థానిక కశ్మీరీలు తిరస్కరిస్తున్నారు. 'సగటు కశ్మీరీ కుటుంబం ఉన్నంతలో హుందాగా బతికేందుకు ప్రాధాన్యత ఇస్తుంది. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లడాన్ని, కూలిపని చేయడాన్ని కశ్మీరీలు నామోషీగా భావిస్తారు. సుగంధ ద్రవ్యాలు, యాపిల్ సాగు, కళాత్మక పనులు, చేతి వృత్తుల విషయంలో కశ్మీరీలకు మంచి నైపుణ్యముంది. దీంతో సొంతంగా నిలదొక్కుకోవాలన్న తపన వీరిలో చాలా అధికం. అయితే కేంద్రం ఆర్టికల్ 370ని రద్దుచేయడంతో తమ పరిస్థితి తలకిందులవుతుందని వారంతా ఆందోళన చెందుతున్నారు. స్థానికేతరులు కశ్మీర్‌లో స్థిరపడ్డా, లేదంటే కేంద్రం నిర్ణయంతో ఉగ్రవాదం తిరిగి పుంజుకున్నా తాము ఉపాధిని కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కశ్మీర్ పండిట్లు మాత్రం కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. ఏళ్లుగా తాముపడిన కష్టాలకు ఇక ఓ ముగింపు దొరికిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**నిర్మాణ పనుల్లో తెలుగు వారు**

కశ్మీర్‌లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో పలువురు తెలుగువాళ్లు పాల్గొంటున్నారు. ఇతర రాష్ట్రాలవారిని కశ్మీరీలు గౌరవిస్తారనీ, ఆతిథ్యం విషయంలో ఎవరైనా వారి తర్వాతేనని తెలుగువాళ్లు చెప్పారు. మరోవైపు వచ్చే సోమవారం బక్రీద్, అనంతరం ఆగస్టు 15 వస్తుండటంతో అప్పటివరకూ ఆంక్షలు కొనసాగే అవకాశముందని ఆర్మీ అధికారులు భావిస్తున్నారు.

# నేడు ప్రధాని ప్రసంగం!

**'కశ్మీర్' నిర్ణయాలపై దేశ ప్రజలకు వివరణ**

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. ఆర్టికల్ 370లోని జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే నిబంధనల రద్దు, రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లదాఖ్‌లుగా విభజించి, రెండింటినీ కేంద్రపాలిత ప్రాంతాలుగా చేయడం.. తదితర నిర్ణయాలకు దారితీసిన కారణాలను ఆ ప్రసంగంలో ఆయన దేశ ప్రజలకు వివరించనున్నారు. ఇంతకు ముందు మార్చి 27న చివరగా దేశప్రజలనుద్దేశించి ప్రధాని ప్రసంగించారు. ఉపగ్రహ నాశక క్షిపణి వ్యవస్థను భారత్ సముపార్జించడంపై ఆ ప్రసంగంలో ఆయన స్పందించారు. గతంలోనూ నోట్ల రద్దు నిర్ణయాన్ని కూడా ఆయన ఇలాగే జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలోనే ప్రకటించిన విషయాన్ని గుర్తు చేస్తూ.. ఈ ప్రసంగంలోనూ సంచలన విషయాలనేమైనా ఆయన ప్రకటించే అవకాశముందని కూడా పలువురు భావిస్తున్నారు. కాగా, ప్రతీ ఏడు ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని ప్రసంగించే ఆనవాయితీ ఉన్న నేపథ్యంలో.. అంతకుముందు కొన్ని రోజుల ముందే ప్రధాని మోదీ ప్రత్యేకంగా ఈ ఆకస్మిక నిర్ణయం తీసుకోవడం ఆసక్తి రేకెత్తిస్తోంది. కాగా, కశ్మీర్ బిల్లును రాజ్యసభ ఆమోదించిన రోజు హోంమంత్రి అమిత్ షా చేతిలోని కాగితాల్లో బుధవారమే జాతినుద్దేశించి ప్రధాని ప్రసంగిస్తారని రాసి ఉన్న విషయం గమనార్హం. అమిత్ షా చేతిలో ఆ కాగితాలున్న ఫొటోలు వైరల్ కూడా అయ్యాయి. అయితే, బీజేపీ సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్ హఠాన్మరణం కారణంగా ఆ ప్రసంగాన్ని గురువారానికి వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది.



## పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు - 2019 సభ కొనసాగిందిలా..

| | 17వ లోక్‌సభ మొదటి సమావేశాలు | 249వ రాజ్యసభ సమావేశాలు |
|---|---|---|
| సెషన్ పూర్తికాలం | జూన్ 17-ఆగస్టు 6 | జూన్ 20-ఆగస్టు7 |
| సభ జరిగిన రోజులు | 37 | 35 |
| సభ కొనసాగిన సమయం | 280 గంటలు | 195 గంటలు |
| వాయిదాలు, ఇతర కారణాలతో వృథా అయిన సమయం | 0 | 19.12 గంటలు |
| అదనపు సమయం | 70.42 గంటలు | దాదాపు 28 గంటలు |
| సభ సఫలమైన శాతం | 125 | 104.92 |
| మౌఖిక సమాధానాలు లభించిన నక్షత్రం గుర్తు ప్రశ్నలు | 183 | 151 |
| ఆమోదం పొందిన బిల్లులు | 35 | 32 |



# కాబూల్‌లో భారీ బాంబు పేలుడు

**14 మంది మృతి, 145 మందికి గాయాలు**

**కాబూల్:** అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్‌లో బుధవారం భారీ బాంబు పేలుడు సంభవించింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు దగ్గర్లోనే ఈ దాడి చోటుచేసుకుంది. ఈ దాడికి తమదే బాధ్యత అని తాలిబన్ ఉగ్రవాదులు ప్రకటించారు. కారు బాంబుతో దాడి జరిగిందని ప్రభుత్వం చెప్పినప్పటికీ, తాలిబన్ మాత్రం ట్రక్ బాంబ్‌తో ఈ పేలుడు జరిపినట్లు ప్రకటించారు. ఈ దాడిలో 14 మంది అక్కడికక్కడే మృతి చెందగా, 145 మంది గాయపడ్డారు. అమెరికా సైన్యాలు అఫ్గాన్ విడిచి వెళ్లేందుకు, దోహాలో తాలిబన్లకు, యూఎస్ బలగాలకు మధ్య ఎనిమిదో దఫా చర్చలు జరుగుతుండగానే ఈ దాడి జరగడం గమనార్హం.

స్థానిక కాలమానం ప్రకారం రద్దీగా ఉండే ఉదయం 9 గంటల సమయంలో పేలుడు సంభవించింది. బాంబు పేలుడు శబ్దం పశ్చిమ కాబూల్ అంతా మారు మోగింది. పేలుడు అనంతరం చాలా మంది మహిళలు తమ భర్తల కోసం, పిల్లల కోసం ఏడుస్తూ కనిపించారంటూ స్థానిక జర్నలిస్ట్ జకేరియా హసాని తెలిపారు. పేలుడు ధాటికి కిలోమీటరు పరిధిలోని దాదాపు 20 దుకాణాల గాజు కిటికీలు పగిలిపోయానని దుకాణదారుడు అహ్మద్ సాలేహ్ తెలిపారు. గాయపడిన 145 మందిలో దాదాపు 92 మంది సాధారణ పౌరులు ఉన్నారని ప్రభుత్వం తెలిపింది. ఈ దాడితో మరణించిన, గాయపడిన వారి సంఖ్య ఒక్క నెలలోనే దాదాపు 1500కు చేరింది. ఈ దాడికి ముందుగా కాబూల్‌లో ఐఎస్ ఉగ్రవాదులు తలదాచుకుంటున్న ఇళ్లను అఫ్గాన్ బలగాలు ధ్వంసం చేశాయి.

సాక్షి
గురువారం, ఆగస్టు, 8

# గుర్తుండిపోయే నేత!

కొందరు తమకొచ్చిన పదవులకుండే ప్రాముఖ్యత వల్ల వెలిగిపోతారు. కానీ చాలా తక్కువమంది చేపట్టిన పదవి ఏదైనా దానిపై తమదైన ముద్ర వేస్తారు. ఆ పదవికే వన్నె తెస్తారు. మంగళవారం రాత్రి కన్నుమూసిన సుష్మాస్వరాజ్ 42 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో చాలా తరచుగా తన విశిష్టతను చాటుకున్నారు. ఒకానొక దశలో ఆమెను ప్రధాని పదవికి అభ్యర్థిగా బీజేపీ ఎంపిక చేయొచ్చునన్న ఊహాగానాలు రావడానికి ఈ విశిష్టతే కారణం. ఇతర రంగాల మాదిరిగా పురుషాధిక్యత రాజ్యమేలే రాజకీయరంగంలో మహిళలు ఉన్నత స్థాయికి చేరుకోవడం, తమను తాము నిరూపించుకోవడం సాధారణమైన విషయం కాదు. దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసి, ఉక్కు మహిళగా పేరు తెచ్చుకున్న ఇందిరాగాంధీకి తండ్రి జవహర్‌లాల్ నెహ్రూ సమున్నత వారసత్వం ఉంది. కానీ సుష్మా స్వరాజ్‌కు అటువంటి నేపథ్యం లేదు. ఆమె పూర్తిగా స్వశక్తితో ఎదిగిన మహిళ. విద్యార్థి దశలోనే సమస్యలపై పోరాడి, పరిష్కారాలు సాధించిన చరిత్రగలవారు. అప్పట్లోనే గొప్ప వక్తగా అందరి మన్ననలూ పొందారు. అరుదైన నాయకత్వ లక్షణాలు, ఏ సమస్యపైన అయినా ప్రభావవంతంగా మాట్లాడగల సామర్థ్యం సొంతం చేసుకోవడం వల్లనే ఆమె 25 ఏళ్ల పిన్న వయసులోనే హర్యానాలో కేబినెట్ మంత్రి కాగలిగారు. జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా వ్యవహరించారు. ఏడు సార్లు ఎంపీగా, మూడు దఫాలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఢిల్లీకి తొలి మహిళా ముఖ్యమంత్రిగా పనిచేశారు. విద్యార్థి దశలో సంఘ్ పరివార్ అనుబంధ సంఘమైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ)లో చురుగ్గా పనిచేసిన చరిత్ర ఆమెది. ఆ దశలోనే ఆమె ఆనాటి జనసంఘ్ నాయకుడు ఎల్‌కే అడ్వాణీ దృష్టిలో పడ్డారు. తన రాజకీయంగా భిన్నాభిప్రాయాలుండే స్వరాజ్ కౌశల్‌ను పెళ్లాడాక ఆమె జనసంఘ్‌కు దూరమయ్యారు. సోషలిస్టు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. దేశం ఉక్కు నిర్బంధాన్ని చవిచూసిన అత్యవసర పరిస్థితి కాలంలో నిరసన ప్రదర్శనల్లో ధైర్యంగా పాల్గొన్నారు. ఆ చీకటి రోజుల్లోనే సోషలిస్టు నేత, దివంగత నాయకుడు జార్జి ఫెర్నాండెజ్‌ను ప్రధాన కుట్రదారుగా చేర్చిన బరోడా డైనమైట్ కేసులో భర్తతో పాటు న్యాయస్థానంలో వాదించారు. ఆ క్రమంలో ఆమె లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ అనుయాయిగా మారారు. అత్యవసర పరిస్థితి రద్దయ్యాక సోషలిస్టు పార్టీ జనతా పార్టీలో విలీనమైనప్పుడు ఆ పార్టీలో చేరారు. అనంతరకాలంలో బీజేపీలో చేరి కీలకపాత్ర పోషించారు. కేంద్ర మంత్రిగా, విపక్ష నేతగా పనిచేశారు.

అయితే బీజేపీలో చాలామందికి లేని వెసులుబాటు సుష్మకు ఉంది. సోషలిస్టుగా రాజకీయ రంగప్రవేశం చేయడం వల్ల కావొచ్చు... బీజేపీలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నా ఆమెను ఉదారవాద నేతగానే అనేకులు పరిగణించారు. దానికితోడు ఆమె కొన్ని కీలక సందర్భాల్లో నిర్మొహమాటంగా వ్యక్తం చేసిన అభిప్రాయాలు కూడా ఆ భావనే కలిగించేవి. బెంగళూరులోని పబ్‌పై హిందూ ఛాందసవాదులు దాడిచేసి మహిళలపై దౌర్జన్యానికి దిగినప్పుడు ఆ చర్యను ఖండించిన ఏకైక బీజేపీ నేత సుష్మానే. ప్రియాంకా చతుర్వేది కాంగ్రెస్ నేతగా ఉండగా పదేళ్ల ఆమె కుమార్తె పట్ల అసభ్యకరంగా ట్వీట్‌లు చేసినవారిని సుష్మ మందలించారు. ప్రియాంకకు అండగా నిలిచారు. మతాంతర వివాహం చేసుకున్న జంట పాస్‌పోర్టు కోసం వచ్చినప్పుడు లక్నోలోని అధికారి ఆ మహిళపై తన పరిధి దాటి వ్యాఖ్యానించినప్పుడు సుష్మ మందలించారు. ఆమెకు పాస్‌పోర్టు అందేలా చూశారు. ఇలాంటి సందర్భాల్లో సంఘ్ పరివార్ శ్రేణులుగా చెప్పుకున్నవారు ఆమెపై విద్వేషపూరితంగా, వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేసినా సుష్మ లెక్కచేయలేదు. విదేశీ వ్యవహారాల శాఖ నిర్వహణ ఏ రాజకీయ నేతకైనా ప్రతిష్టాత్మకమైనదే. ఐక్యరాజ్యసమితితోసహా అనేక అంతర్జాతీయ వేదికలపై దేశానికి ప్రాతినిధ్యంవహించే అవకాశం లభించడం, మన వాదనను సమర్థవంతంగా వినిపించడం ఒక వరం. అదే సందర్భంలో ఆ పదవితో సమస్యలు కూడా ఉన్నాయి. అక్కడ నిత్యం వార్తల్లో వ్యక్తిగా ఉండటం సాధ్యపడదు. కానీ ఆ పదవి స్వభావాన్నే ఆమె మార్చారు. ఇరాక్‌లోని బస్రాలో ఉగ్రవాదుల చక్రబంధంలో చిక్కుకున్న 168మందిని కాపాడటం వెనక ఆమె కృషి చాలా ఉంది. విదేశాల్లో పాస్‌పోర్టు పోగొట్టుకున్నవారికి, ఇక్కడి వ్యక్తిని పెళ్లాడి వీసా లభించక ఇబ్బందులు పడుతున్నవారికి, గల్ఫ్ దేశాలకెళ్లి అక్కడ వెట్టిచాకిరీలో మగ్గినవారికి ఆమె అమ్మలా ఆపన్నహస్తం అందించారు. 'మీరు అరుణగ్రహంపై చిక్కుకున్నా కాపాడతాన'ంటూ ఆమె ఒక సందర్భంలో పెట్టిన ట్వీట్ విదేశాల్లో ఉండకతప్పనివారికి ఎంతో భరోసానిచ్చింది. ఆమెలోని మానవీయతకు అద్దం పట్టింది. విదేశాంగ శాఖలో కూడా ఇంత చేయొచ్చా అని అందరూ ఆశ్చర్యపోయారు. అడ్వాణీ శిబిరానికి చెందినవారు గనుక ఆమెకు మోదీ ప్రభుత్వంలో చోటుండకపోవచ్చన్న ఊహాగానాలొచ్చాయి. కానీ ఆమె సమర్థతను మోదీ సరిగానే గుర్తించారు. కీలకమైన విదేశాంగ శాఖ అప్పగించారు. వాజపేయి ప్రభుత్వంలో సమాచార మంత్రిగా ఆ శాఖపై సుష్మ చెరగని ముద్రవేశారు. చిత్రరంగాన్ని పరిశ్రమగా గుర్తించింది ఆమె హయాంలోనే. అందువల్లే చిత్ర నిర్మాణాలకు బ్యాంకు రుణాలు అందడం మొదలైంది.

తమపై వివక్ష ప్రదర్శిస్తున్నారని, ఎదగనీయడం లేదని అనేకులు ఫిర్యాదు చేస్తుంటారు. అలాంటివారు సుష్మ రాజకీయ జీవితం అధ్యయనం చేయాలి. అడుగడుగునా ఆధిపత్య ధోరణులు, పితృస్వామిక భావజాలం తొంగిచూసే సమాజంలో ఎలాంటి నేపథ్యమూ లేని కుటుంబాల నుంచి వచ్చిన మహిళలకు ఏదో ఒక రూపంలో, ఎప్పుడో ఒకప్పుడు సమస్యలు తప్పవు. వాటన్నిటినీ దీటుగా ఎదుర్కొనడం వల్లనే, తనను తాను నిరూపించుకోవడం వల్లనే సుష్మా స్వరాజ్ ఇంతమంది అభిమానాన్ని పొందగలిగారు. విశిష్ట నేతగా ఎదిగారు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి శు.అష్టమి ప.3.22 వరకు, తదుపరి నవమి నక్షత్రం విశాఖ రా.2.40 వరకు, తదుపరి అనూరాధ వర్జ్యం ఉ.8.49 నుంచి 10.22 వరకు, దుర్ముహూర్తం ఉ.9.59 నుంచి 10.49 వరకు, తదుపరి ప.3.02 నుంచి 3.55 వరకు అమృతఘడియలు... సా.6.10 నుంచి 7.43 వరకు.

సూర్యోదయం : 5.44
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం : ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

# రైతు రాబడికి చట్టబద్ధతే రక్షణ

విశ్లేషణ



దేవీందర్ శర్మ

**ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ హామీ ఇచ్చినట్లుగా రెండు లేదా మూడేళ్ల వ్యవధిలో భారతీయ రైతుల ఆదాయాన్ని రెండురెట్లకు పెంచడం అసాధ్యమని కేంద్రమంత్రే పార్లమెంటులో ప్రకటించి సమస్యనుంచి పక్కకు తప్పుకున్నారు. వచ్చే అయిదేళ్లకాలానికి వ్యవసాయరంగంలో వాస్తవ ఆదాయాలు సంవత్సరానికి అర్థశాతం కంటే తక్కువ మాత్రమే పెరుగుతాయని నీతిఆయోగ్ అంచనా వేసింది. మన పాలకులు, విధాన నిర్ణేతలు ఉద్దేశపూర్వకంగానే వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యపర్చడమే దీనికి కారణం. ఈ నేపథ్యంలో రైతుల ఆదాయ వృద్ధిపై వ్యర్థ చర్చలు మాని, కనీస మద్దతు ధరకు చట్టప్రతిపత్తిని కల్పించడమే పాలకుల తక్షణకర్తవ్యం కావాలి. వ్యవసాయరంగంలో పెట్టుబడుల పెంపుదల ఆర్థికవ్యవస్థనే సంక్షోభం నుంచి బయటబడేస్తుంది. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ సాగవలసిన మార్గం ఇదేమరి.**

ఎట్టకేలకు కేంద్రప్రభుత్వానికి తత్వం బోధపడినట్లుంది. తాజా పార్లమెంటు సమావేశాల సందర్భంగా, 2022 నాటికి వ్యవసాయరంగ ఆదాయాన్ని రెట్టింపు చేయడం సాధ్యం కాదని కేంద్రం పార్లమెంటులో అంగీకరించింది. సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు రామ్ గోపాల్ యాదవ్ రాజ్యసభలో సంధించిన ప్రశ్నకు వ్యవసాయశాఖ సహాయ మంత్రి పురుషోత్తం రూపాలా స్పష్టంగా సమాధానమిచ్చారు. 'రామ్ గోపాల్‌జీ ప్రశ్నతో మేము ఏకీభవిస్తున్నాం. వ్యవసాయ రంగంలో ప్రస్తుత వృద్ధి రేటు ప్రకారం రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడం సాధ్యం కాదు.''

ఏటా వ్యవసాయరంగం 4 కంటే తక్కువ శాతం వృద్ధిరేటు కనబరుస్తుండటంతో, వచ్చే మూడేళ్లలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం సాధ్యం కాదని మంత్రి స్పష్టంచేశారు. 2016 ఏప్రిల్‌లో ఏర్పడిన దళవాయి కమిటీ (డిఎఫ్ఐ) రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలంటే సంవత్సరానికి రైతుల ఆదాయ వృద్ధి రేటు 10.4 శాతానికి పెరగాల్సి ఉందని అంచనా వేశారు. ఇది సాధ్యపడాలంటే దేశం అత్యధిక ఆర్థిక వృద్ధి రేటును సాధించాల్సి ఉందని పలువురు ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు. ఇది ప్రస్తుత పరిస్థితుల్లో పేరాశే అవుతుందన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుంటూనే, రైతురాబడి వృద్ధిపై ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కావడం అంత సులభం కాదని కేంద్రమంత్రి స్వయంగా అంగీకరించినందుకు ధన్యవాదాలు.

సాక్షాత్తూ కేంద్రమంత్రి పార్లమెంటులో చేసిన ప్రకటన తర్వాత అయినా, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం ఎలా అనే అంశంపై దేశంలోని యూనివర్సిటీలు, విద్యాసంస్థలు, కాలేజీలు, పౌరసమాజ సంస్థలు రెండేళ్లుగా సాగించిన అంతులేని సెమినార్లు, కాన్ఫరెన్సులు, వర్క్‌షాపుల తతంగానికి ముగింపు పలకాల్సిన అవసరముంది. వ్యవసాయరంగ ఆదాయంలో నిజమైన వృద్ధి గత రెండేళ్లలో సున్నకు సమీపంలో కొనసాగుతున్న సమయంలో వచ్చే అయిదేళ్లకాలానికి వ్యవసాయరంగంలో నిజ ఆదాయం సంవత్సరానికి అర్థశాతం కంటే తక్కువ మాత్రమే పెరుగు తుందని నీతిఆయోగ్ అంచనా వేసింది. ఈ పరిస్థితుల్లో కూడా వ్యవసాయ రంగానికి తప్పనిసరైన మౌలిక వ్యవస్థాపనా పరివర్తన గురించి ఎవరూ మాట్లాడటం లేదు. నేల సంరక్షణ కార్డులు, వేపకలిపిన యూరియా, ఫసల్ బీమా యోజన, జాతీయ వ్యవసాయ మార్కెట్లు, మరిన్ని పంట నిల్వ వసతులు వంటి పథకాలేవీ రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తాయని హామీ ఇవ్వలేరు. ఇప్పుడు తక్షణం కావలసింది ప్రత్యక్ష ఆదాయ మద్దతు. రైతు ఆదాయాన్ని క్రమబద్ధం చేయటానికి ఇదే ఉత్తమమార్గం.

కేంద్ర ప్రభుత్వం 2018 సెప్టెంబర్‌లో రైతు ఆదాయ పెంపు కమిటీ (డీఎఫ్ఐ) సమర్పించిన నివేదిక చేసిన సిఫార్సుల అమలు, పర్యవేక్షణకోసం ఒక సాధికారక కమిటీని ఏర్పర్చినప్పటికీ వచ్చే రెండేళ్లలోపు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం సాధ్యపడకపోవచ్చు అని అర్థమవుతూనే ఉంది. అందుకే వ్యవసాయ రంగంలో దీర్ఘకాలిక సంస్కరణలను ప్రారంభించడంలో ఇది తప్పక తోడ్పడుతుంది. దీనికి అనుగుణంగా ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది. ఈ దీర్ఘకాలిక సంస్కరణల్లో మొట్టమొదటిది ఏమిటంటే వ్యవసాయ



రంగంలో ప్రభుత్వ రంగ మదుపును బాగా ప్రోత్సహించడమే. 2011–12, 2016–17 మధ్యకాలంలో వ్యవసాయంలో ప్రభుత్వరంగ మదుపు మొత్తం జీడీపీలో 0.4 శాతం వద్దే సాగిలపడిపోయిందని అర్బీఐ గణాంకాలు సూచిస్తున్నాయి. దేశ జనాభాలో దాదాపు సగం మంది నేటికీ వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారని గ్రహించినట్లయితే, మన పాలకులు, విధాన నిర్ణేతలు ఉద్దేశపూర్వకంగానే వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యపరుస్తూ వస్తున్నారని బోధపడుతుంది.

తగినంత పెట్టుబడి తరలిరాకుండా దేశీయ వ్యవసాయరంగంలో అద్భుతాలు సృష్టించవచ్చని ఏ ఆర్థిక వేత్త అయినా ప్రకటిస్తారని నేనయితే భావించడం లేదు. జీడీపీలో అరశాతం కూడా వ్యవసాయరంగంలో మదుపు చేయలేదన్నది స్పష్టమే. దీనిక్కారణం.. వ్యవసాయాన్ని ఒక ఆర్థిక కార్యాచరణగా మనదేశంలోని ఆర్థిక చింతనాపరులు గుర్తించకపోవడమే. దీనితో వ్యవసాయాన్ని లాభదాయకమైన, నిలకడకలిగిన పరిశ్రమగా చేయడంపై దృష్టి పెట్టడానికి బదులుగా విధాన నిర్ణేతలు రైతులను, అనుబంధ వృత్తి జీవులను మరింతగా వ్యవసాయ రంగం నుండి బయటకు నెట్టివేయడంపైనే కేంద్రీకరించారు. ఇలాంటి ధోరణి ఇకనైనా మారాలి. ఈ మార్పునకు సంబంధించిన సంకేతాన్ని మనం బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో చూడవచ్చు. దేశీయ వ్యవసాయ రంగంలో 25 లక్షల కోట్లను పెట్టుబడిగా పెడతామని ఆ మేనిఫెస్టోలో పేర్కొన్నారు. అయితే 2019–20 సంవత్సరానికిగానూ కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి రూ. 1,30,485 కోట్లను కేటాయిస్తున్నట్లు ప్రతిపాదించారు. పీఎమ్ కిసాన్ పథకంలో మిగిలిన మూడు ఇన్‌స్టాల్‌మెంట్ల చెల్లింపుకోసం కేటాయించిన రూ. 75,000 కోట్లను కూడా దీంట్లో భాగంగా చేశారు.

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, వ్యవసాయరంగంలో నిజ ఆదాయాలను పెంచడం, రైతులు కోల్పోయిన గౌరవాన్ని పునరుద్ధరించడం వంటివాటికోసం వ్యవసాయంలో మౌలిక సంస్కరణలు కావాలని ప్రతిపాదించడానికి కూడా మన వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు ఇచ్చగించని తరుణంలో పంజాబ్, హరియాణా హైకోర్టు ఇటీవలే సంచలనాత్మక తీర్పును వెలువరించింది. భారతీయ రైతులను ఆర్థిక దుస్థితి నుంచి కాపాడాలంటే వ్యవసాయ ఉత్పత్తి ధరకు మూడురెట్లు అధికంగా కనీస మద్దతు ధరను ప్రకటించాలని కోర్టు వ్యాఖ్యానించింది. 'కనీస మద్దతు ధరను 1965లో ప్రకటించినప్పటికీ, చేదువాస్తవం ఏమిటంటే, తీవ్ర దారిద్ర్యం నుంచి రైతులను బయటపడేలా వారి ఆదాయాలను ఈ పథకం కల్పించలేకపోయింది. కనీసం రైతులను ప్రోత్సహించలేకపోయింది. రైతులు పండించిన పంటలకు న్యాయమైన ధర పొందేలా న్యాయపరమైన హక్కులను కల్పిస్తూ కనీస మద్దతు ధరకు చట్టబద్ధతను ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది'. తగిన చట్టం రూపకల్పన ద్వారా కనీస మద్దతు ధరకు న్యాయ ప్రతిపత్తిని అందచేయాలని ఆదేశిస్తూ జస్టిస్ రాజీవ్ శర్మ, జస్టిస్ హెచ్‌ఎస్ సిద్ధుతోకూడిన డివిజన్ బెంచ్ తీర్పుచెప్పింది. తమ తీర్పులోభాగంగా న్యాయమూర్తులు.. వ్యవసాయరంగంలో దళారులను తొలగించడం, గిడ్డంగులను నెలకొల్పడం, వాతావరణ ప్రాతిపదికన పంటల బీమా పథకాలు, ఇంటర్నెట్ టెక్నాలజీని ఉపయోగించడం, రుణ కల్పన, రైతుల ఆత్మహత్యల నివారణ వంటి పలు సంస్కరణ చర్యలను సాగించాలని ఈ తీర్పులో పేర్కొన్నారు.

గతంలో వ్యవసాయ ఖర్చులు, ధరల కమిటీ కూడా కనీస మద్దతు ధరకు చట్టప్రతిపత్తి కల్పించాలని పిలుపునిచ్చింది. సుదూర ప్రాంతాలకు చెందిన రైతులు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీలను చేరలేకపోతున్నారని, దీంతో తమ ఉత్పత్తులను కనీస మద్దతు ధరకంటే ఎంతో తక్కువ ధరకే స్థానిక మార్కెట్లకు అమ్మేయాల్సి వస్తోందని ఈ కమిటీ ప్రత్యేకించి పేర్కొంది. కనీస మద్దతు ధరకు చట్టప్రతిపత్తిని కల్పించడం వల్ల రైతుల్లో ఆత్మవిశ్వాసం పెరగడమే కాకుండా రైతులకు కనీస ధరకు హామీ పడుతుంది. తద్వారా వారి ఆదాయాలు మెరుగుపడతాయి, రుణభారం తగ్గుతుంది, వ్యవసాయ దుస్థితి తగ్గుముఖం పడుతుందికూడా. వీటికి అదనంగా వ్యవసాయ ఉత్పత్తి ఖర్చుకు మూడు రెట్లు అధికంగా కనీస మద్దతు ధరను పెంచడం వల్ల ఇదొక్కటే వ్యవసాయరంగం పనితీరు గణనీయంగా పెరగడానికి వీలవుతుంది. నా ఉద్దేశంలో రెండు రకాల ధరల విధానం ఉండాలి. అవేమిటంటే కనీస మద్దతు ధరతో ధాన్యసేకరణ జరపటం, రైతుకు చెల్లించవలసిన వాస్తవ ధరను ఆచరణలో అమలు చేయడం. ఇప్పుడు రైతులందరికీ జన్‌ధన్ బ్యాంకు ఖాతాలు ఉన్నాయి కాబట్టి ఈ రెండు ధరల విధానాల మధ్యలో తలెత్తే వ్యత్యాసాన్ని రైతు బ్యాంకు ఖాతాకే నేరుగా బదలాయించవచ్చు.

వ్యవసాయరంగంలో వృద్ధి గణాంకాలు తమ్ముతాము నిరోధించుకునే పరిస్థితులనుంచి బయటపడాల్సిన సమయం వచ్చింది. మానవ వనరులపై మదుపు చేయడానికి ఇది చక్కటి తరుణం. వ్యవసాయ రాబడులను పెంచేందుకు మరిన్ని పెట్టుబడులు పెట్టడం వల్ల వ్యవసాయ టెక్నాలజీని మెరుగుపర్చుకునేందుకు రైతులుపెట్టే డబ్బు కూడా పెరుగుతుంది. ఇలా గ్రామీణ డిమాండును అధిక మదుపుల ద్వారా కేటాయించిన రోజు, పారిశ్రామికాభివృద్ధి కూడా వేగం పుంజుకుంటుంది. ఆర్థిక వ్యవస్థ మందగిస్తున్న తరుణంలో సరకులకు మరింత డిమాండును సృష్టించడం వ్యవసాయరంగం వల్లే సాధ్యపడుతుంది. కాబట్టి వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెట్టడం అనేది మొత్తం ఆర్థిక వ్యవస్థనే సంక్షోభం నుంచి బయటపడేస్తుంది. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ సాగవలసిన మార్గం ఇదేమరి.

వ్యాసకర్త వ్యవసాయ నిపుణులు
ఈ–మెయిల్ : hunger55@gmail.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




సోషల్ మీడియా

### సంధానకర్త



"మన అదృష్టం బాగుండి ఇప్పుడు అధికారంలో లేరు గానీ, ఆర్టికల్ 370 తొలగించాక కశ్మీర్లో పెట్టుబడులు పెట్టేవారందరికీ తానే సంధానకర్తనని ప్రకటించుకునే వారు బాబు. ఇన్‌సైడర్ ట్రేడింగులో తలపండిన వ్యక్తి కదా అమరావతిలో 'గాయపడిన' వారినందరినీ ప్రత్యేక విమానాల్లో శ్రీనగర్ తరలించేవారు"

– విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ కార్యదర్శి

### కశ్మీర్



"ఆర్టికల్ 370 రద్దు తర్వాత నిజమైన కశ్మీరీలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవడానికి చాలా ప్రయత్నం చేశా. తాను చెప్పాల్సింది చాలా ఉన్నప్పటికీ, భయం వేస్తోందని శాలువాలు ఎగుమతి చేసే వ్యాపారి ఒకరు అన్నారు. తమ కుటుంబాలు ప్రస్తుతం కశ్మీర్‌లోనే ఉన్నందున తామేమీ చెప్పలేమని ఒక జర్నలిస్టు, మరో విద్యావేత్త భయాందోళనలు వ్యక్తం చేశారు. తన పేరు ఎక్కడా బయటకు రావడం ఇష్టంలేదని ఓ సినీ నిర్మాత తప్పుకున్నారు. దీన్నిబట్టి తాజా పరిణామాలపై కశ్మీరీల మనోభావాలు అర్థమవుతూనే ఉన్నాయి"

– శ్రీనివాసన్ జైన్, జర్నలిస్ట్

### వయసు



"పురుష పుంగవుల్లారా, కశ్మీర్‌కు చెందినవారినే కాదు, ఏ ప్రాంతానికి చెందిన 'అమ్మాయి'నైనా వివాహం చేసుకోవడం నేరం. కనీస వివాహ వయస్సు 18 ఏళ్లు అని మన చట్టం చెబుతోంది. ఆ వయసు వచ్చాక వారిని మహిళ అంటారు. మహిళలు మీరు యుద్ధంలో గెలుచుకున్నవారు కాదు. కశ్మీరీ మహిళలను వివాహం చేసుకోవాలనే మీ ఊహలు అనాగరికమైనవి"

– నమిత భండారీ, జర్నలిస్ట్

### తప్పు



"ఆర్టికల్ 370ని రద్దు చేయడం కేంద్ర ప్రభుత్వ చారిత్రక తప్పిదం. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం, అప్రజాస్వామికం, నియంతృత్వ పోకడలకు నిదర్శనం. కేంద్రం జమ్మూకశ్మీర్‌లో ఎమర్జెన్సీలాంటి పరిస్థితిని సృష్టించింది. ఈశాన్య రాష్ట్రాలకు ఇది ఒక హెచ్చరిక కూడా"

– తరుణ్ గొగోయ్, అస్సాం మాజీ సీఎం

### ఖర్గూస్

"సుష్మాస్వరాజ్‌తో నాకు చాలా సుహృద్భావ సంబంధాలు ఉన్నాయి. ఆమె లాహోర్ వచ్చినప్పుడల్లా కలిసేదాన్ని, దీదీ అని పిలిచేదాన్ని. మా పాప పుట్టినప్పుడు దాన్ని ఒళ్లోకి తీసుకొని ప్రేమగా ఆడించారు. నా చిన్నారి కుందేలు పిల్ల అంటూ ముద్దులాడారు"



– మార్వి సిర్మెడ్, జర్నలిస్ట్

# కుంకుమపూలు..!




ఇతడు టీ నీళ్లు అమ్మితే అమ్మొచ్చు!
మామూలోడు మాత్రం కాకపోవచ్చు

మంచుకొండల్లో చంద్రుణ్ణి
వెలిగించేందుకు
వెళ్దొద్దామంటున్నాడు

కాశ్మీరు కుంకుమపూలను
పొంకాన పలకరిద్దాం
పదపదమంటున్నాడు

సరిహద్దురేఖల్లోని సరస్వతీ పీఠానికి
సమర్చన చేద్దాం రమ్మనమంటున్నాడు

డెబ్బయ్యేళ్ల దీర్ఘనిద్రని బదాబదలు
చేశానంటూ
ఢంకా బజాయిస్తున్నాడు

మూడువందల డెబ్భైలకు
కాలం తీరిందని
గుండెల నిండా చాటుతున్నాడు

అక్కడివారూ ఇక్కడివారూ
అందరూ అయినవారే అంటున్నాడు

ఒకే జెండా, ఒకే దేశం,
ఒకే ఆత్మ నినాదమే
విధానమంటున్నాడు
ఓటు బ్యాంకుల్ని తొలగించి,
ఏకతా బ్యాంకుల్ని
తెరుస్తానంటున్నాడు

బుజ్జగింపులకు వీడుకోలు పాడి
భూమిపుత్రులందర్నీ
పూజిస్తానంటున్నాడు

చెప్పినవన్నీ ఇతడు చేస్తాడేమో
అన్నవన్నీ ఇతడు తీరుస్తాడేమో
ఆశగా ఎదురు చూడవచ్చునేమో

పలికినదంతా ఇతడు
చివరాఖరికి పట్టించుకోకపోతే,
మాటలన్నింటినీ మడతేసి
మూలన దాచిపెట్టేస్తే,
మన ఓటు మన దగ్గరే ఉంది కదా!
దింపేసి చూడొచ్చునేమో కదా!!

చింతకింది శ్రీనివాసరావు,
రచయిత, సీనియర్ జర్నలిస్ట్
మొబైల్ : 88971 47067

# వయసుకి చిన్నమ్మ.. మనసుకి పెద్దమ్మ

భారతీయత నిండుదనానికి ఆమె చిరునామా. భారతీయుల స్వప్నానికి ప్రతిబింబం. సాటి లేని వాగ్ధాటి ఆమె సొంతం. ఇంగ్లీష్, హిందీల్లో అనర్గళంగా ప్రసంగిస్తూ... చెప్పాలనుకున్న విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పడంలో అందివేసిన చేయి. ఏపనైనా అలవోకగా చేసే ధైర్యం, తెగువ ఆమె సొంతం. రాజకీయంగా... అనితర సాధ్యమైన ప్రయాణాన్ని సాగించారు. ఒక స్త్రీగా, ఇల్లాలిగా, రాజకీయనాయకురాలిగా, ఎంపీగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా సంపూర్ణ మహిళగా ఖ్యాతి పొందారు. ఆమె మరెవరో కాదు భారత వీరనారి, ద గ్రేట్ లెజెండ్ సుష్మ స్వరాజ్.

పుట్టి పెరిగింది ఉత్తరాదిలోనైనా... దక్షిణాదిలో కూడా ఆమె సుపరిచితురాలే. పార్టీ అధినేతలకు మాత్రమే సాధ్యమయ్యే రీతిలో ఆమె పాపులర్ అయ్యారు. పార్టీలోనైనా, ప్రభుత్వంలోనైనా తన మార్క్ ఉండాల్సిందే. హర్యానాలో విద్యాభ్యాసం చేసిన సుష్మ 20 ఏళ్లకే న్యాయవాదిగా కెరీర్ ప్రారంభించారు. జయప్రకాష్ నారాయణ 'సంపూర్ణ విప్లవం'లో పాల్గొన్నారు. ఎమర్జెన్సీ తర్వాత బీజేపీలో చేరి అంచ లంచెలుగా ఎదిగారు. అతి కొద్ది కాలంలోనే బీజేపీ జాతీయ నాయకురాలి స్థాయికి చేరుకున్నారు. 25 ఏళ్లకే అంబాలా కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొంది 27 ఏళ్లకే హర్యానా జనతా పార్టీ అధ్యక్షురాలిగా ఎంపికై ఔరా అన్పించుకున్నారు. నాలుగుసార్లు లోక్ సభకు, మూడుసార్లు రాజ్యసభకు ఎన్నిక య్యారు. 1999లో బళ్లారి నుంచి లోక్ సభకు పోటీ చేసి సోనియాకు సవాల్ విసిరి.. దేశమంతా తనవైపు చూసేలా ప్రచారం సాగించారు.

ఢిల్లీ తొలి మహిళా ముఖ్యమంత్రిగా సంచలనం సృష్టించారు. వాజ్‌పేయి హయాంలో కీలక శాఖలకు మంత్రిగా పనిచేశారు. సమాచార శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు చేపట్టి అప్పుడే వస్తున్న ఎలక్ట్రానిక్ మీడియాకు కొత్త ఒరవడి తీసుకొచ్చారు. 1996లో వాజ్‌పేయీ ప్రభుత్వం కేవలం 13 రోజులపాటు కొనసాగిన సమయంలో సుష్మ కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రిగా ఉంటూ లోక్‌సభలో జరిగే చర్చలను



నివాళి

ప్రత్యక్ష ప్రసారం చేయాలని విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. 15వ లోక్ సభలో ప్రతిపక్ష నేతగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ సుష్మ కీలక బాధ్యత నిర్వర్తించారు. 2008, 2010లో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డులు పొందారు.

ఇక 2014లో ప్రధాని నరేంద్ర మోదీ కేబినెట్‌లో కీలక విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సుష్మ ఆ శాఖకు ముందెన్నడూ లేని గుర్తింపు తీసుకొచ్చారు. గల్ఫ్ దేశాల్లో భారతీయులు చిక్కుకున్నప్పుడు వారిని సురక్షితంగా దేశానికి తరలించడానికి చేసిన కృషి అనన్యసామాన్యమైంది. కల్లోల దేశాల్లో ప్రజల్ని రక్షించేందుకు తాను నేరుగా ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో చర్చలు జరిపేవారు.

పార్లమెంట్ లో సుష్మ చేసే ప్రసంగాలకు ఆ పార్టీ, ఈ పార్టీ అని కాకుండా అందరూ జేజేలు పలికేవారు. భాషపై పట్టు, వాక్చాతుర్యంతో ఎవరినైనా ఆమె ఇట్టే కట్టిపడేసేవారు. విదేశాంగ మంత్రిగా ఉంటున్న సమయంలో వచ్చిన అనారోగ్యం సుష్మను ఊపిరి సలుపుకోనివ్వలేదు. అందువల్లే గత ఎన్నికల్లో పోటీకి కూడా దూరంగా ఉన్నారు.

అయితే ఆర్టికల్ 370 రద్దు తన జీవిత కాలంలోనే చూడాల్సిన ఘట్టంగా, చనిపోయే ముందు చేసిన ట్వీట్ భారతదేశాన్ని కన్నీరు పెట్టించింది. సుష్మ చనిపోయారన్న నిజాన్ని భారతీయులెవరూ జీర్ణించుకోలేకోపోయారు. సంతాప సందేశాల్లో ప్రపంచదేశాధినేతలు కన్నీటి పర్యంతమయ్యారంటే విదేశాంగ విధానంపై సుష్మ వేసిన ముద్ర ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. విదేశాంగ విధానానికి గానీ, బీజేపీ పార్టీకి గానీ సుష్మ స్వరాజ్ ముందు, సుష్మ స్వరాజ్ తర్వాత అని చెప్పాల్సిందే. ఎందుకంటే అలాంటి నేత మరొకరు ఉండరు. ఉండబోరు. ఆ ఘనత ఒక్క సుష్మకు మాత్రమే దక్కుతుంది.

పురిఘళ్ల రఘురామ్, బీజేపీ సమన్వయకర్త
ఈ–మెయిల్ : raghuram.bjp@gmail.com

# రామనామం గొప్పది

అయోధ్యలో ఋషులూ, మహర్షులూ సమావేశమయ్యారు. వారిలో నారదుడు, వశిష్టుడు, విశ్వామిత్రుడు తదితరులున్నారు. ఆరోజు వారి మధ్య రాముడు గొప్పవాడా లేక రామనామం గొప్పదా అనే దానిపై చర్చ జరగవలసి ఉంది. అక్కడికి వచ్చిన హనుమంతుడు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేదు. అందరి వాదనలు వింటున్నాడు ఆంజనేయుడు.

నారదుడు మాట్లాడుతూ రాముడి కన్నా రామనామమే గొప్పది అన్నాడు. తన మాటను నిరూపించగలనని కూడా చెప్పాడు. ఆనాటి సభ ముగిసి అందరూ వెళ్ళిపోతుండగా, నారదుడు హనుమంతుడి వద్దకు వెళ్ళి అందరినీ గౌరవించుకానీ విశ్వామిత్రుడిని మాత్రం పట్టించుకోకు అన్నాడు. సరేనని హనుమంతుడు విశ్వామిత్రుడికి తప్పించి మిగిలిన వారందరికీ నమస్కరించాడు. ఈ విషయాన్ని విశ్వామిత్రుడసలు పెద్దగా పట్టించుకోలేదు. కానీ నారదుడు విశ్వామిత్రుడి వద్దకు వెళ్ళి 'హనుమంతుడు మీకు కావాలనే నమస్కరించలేదు, మీకేమీ అనిపించలేదా?' అని అడిగాడు. దాంతో విశ్వామిత్రుడికి కోపం వచ్చి రాముడి దగ్గరకు వెళ్ళి హనుమంతుడి ప్రవర్తన చెప్పి అతనిని తక్షణమే హతమార్చాలని ఒత్తిడి చేస్తాడు. గురువుగారి ఆజ్ఞను తిరస్కరించలేని రాముడు హనుమంతుడిని హతమార్చడానికి బాణం ఎక్కుపెట్టాడు. అయితే నారదుడు హనుమంతుడితో 'నువ్వేమీ దిగులుపడకు. రామనామాన్ని చెప్తూ ఉండు.. అదే నిన్ను కాపాడుతుంది' అంటాడు.

జ్యోతిర్మయం

రాముడు హనుమంతుడి పైకి బాణం తీశాడు. హనుమంతుడు రామనామాన్ని జపిస్తూనే ఉన్నాడు. రాముడు వదిలిన బాణాలేవీ హనుమంతుడిని గాయపరచలేదు. తాను విడిచిన బాణాలేవీ పని చేయకపోవడంతో రాముడు బ్రహ్మాస్త్రాన్ని సంధించాడు. అది కూడా విఫలమైంది. ఇదంతా గమనిస్తున్న నారదుడు... విశ్వామిత్రుడి వద్దకు వెళ్ళి తానే హనుమంతుడిని రెచ్చగొట్టానని రాముడితో అన్నాడు. నిజానికి హనుమంతుడి మనసులో విశ్వామిత్రుడికి ఎటువంటి దురుద్దేశమూ లేదు. నారదుడి కుతంత్రం తెలిసి రాముడు హనుమంతుడిపై బాణాలను ప్రయోగించడం ఆపాడు. ఈ సంఘటన రాముడి కన్నా రామనామం ఎంత విశిష్టమైనదో చెప్తుంది.

– యామిజాల జగదీశ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం ॥ 8-8-2019



ఇంటి ఖరీదు 140 కోట్లు
సినిమా పేజీలో...



ప్రతి ప్రయాణ నిర్ణయమూ
ఫైనల్ కాదు.
టికెట్ తీసుకున్నాక
కేన్సిల్ చేసుకోవచ్చు.
ప్లాట్‌ఫామ్‌కు చేరుకున్నాక
అనీజీగా ఉంటే వెనక్కు వచ్చేయవచ్చు.
ట్రైనెక్కేసినా పక్క స్టేషన్‌లో దిగిపోవచ్చు.
ఆగకపోతే చైన్ లాగి దూకి పారిపోవచ్చు.
మరి జీవితంలో తీసుకునే నిర్ణయాలకు
ఈ ఆప్షన్స్ ఉండవా?
ఒక నిర్ణయం తీసుకుంటే
కేన్సిల్ చేసే వీలు ఉండదా?
ఉండదు అన్న ఆలోచనే
చాలా పెద్ద వ్యాధి అవుతుంది.
లేదా ఈ అమ్మాయి
కథ అవుతుంది.

# అమ్మా... నాన్నా... ఓ పారిపోయిన అమ్మాయి

మొత్తం పదిహేను రోజుల తర్వాత దొరికిందా అమ్మాయి.

పూణెలో ఒక వర్కింగ్ విమెన్స్ హాస్టల్‌లో ఉంటే పోలీసులు ట్రేస్ చేశారు.

పదిహేను రోజుల పాటు ఆ అమ్మాయి ఫోన్ వాడలేదు. ఎవరికీ ఫోన్లు చేయలేదు. కాని ఇన్‌స్టాగ్రామ్‌ను ఒకసారి ఉపయోగించడం వల్ల పోలీసులు దాని ఆధారంగా ఎక్కడుందనేది కనిపెట్టారు.

పూణెలో ఆ అమ్మాయి చాలా మామూలు ధోరణిలోనే తోటి హాస్టల్ మేట్స్‌కు కనిపించింది. దగ్గరిలోని స్కూల్‌లో మ్యూజిక్ టీచర్‌గా క్లాసులు చెప్పడానికి వచ్చానని చెప్పింది. క్లాస్ ఉన్నప్పుడు స్కూల్‌కు వెళ్లేది. లేదంటే రూమ్‌లో పుస్తకాలు చదువుకుంటూ ఉండేది.

ఆ అమ్మాయి ఇంట్లో నుంచి పారిపోయి వచ్చిందని తెలిసి వారు ఆశ్చర్యపోయారు.

ఆ అమ్మాయి ఇంట్లో నుంచి పారిపోతుందని ఊహించని తల్లిదండ్రులు అంతకు మించిన షాక్‌లో ఉన్నారు.

* * *

హైదరాబాద్‌లోని దిల్‌షుక్‌నగర్‌లో ఉన్న ఆ కాలనీ వారికి ఆ అమ్మాయి ఇంట్లో నుంచి పారిపోయి తిరిగి వచ్చిందని తెలియదు. తల్లిదండ్రులు చాలా జాగ్రత్త పడ్డారు. పోలీసుల ఫిర్యాదును కూడా బయటకు పొక్కేలా చూసుకున్నారు. వయసొచ్చిన అమ్మాయి ఇంట్లో నుంచి పారిపోయిందని తెలిస్తే ఆ అమ్మాయి భవిష్యత్తుకు దెబ్బ.

పెళ్లి సంబంధాలు చూస్తూ ఉంటే కనుక ఇంకా దెబ్బ. ఎంగేజ్‌మెంట్ అయి ఉంటే ఇంక చెప్పే పనే లేదు. ఆ అమ్మాయికి ఎంగేజ్‌మెంట్ అయి నెల రోజులు.

పెళ్లి మరో నెలలో.

కాని ఈలోపు పారిపోయింది.

* * *

తల్లీ తండ్రీ మంచి ఉద్యోగులు. ఒక్కగానొక్క అమ్మాయి. బాగా చదివించుకున్నారు. ఎప్పుడూ డబ్బుల గురించి కొంటున్న స్థలాల గురించి ఇతరులు ఎదుగుతున్న వైనం గురించి చెబుతుండేవారు. ఉద్యోగం చేస్తే కొన్ని మంచి సంబంధాలు తప్పిపోతాయని చెప్పి ఉద్యోగం వద్దని సలహా ఇచ్చారు. జీవితం సంతోషంగా ఉండాలంటే పెద్ద ఉద్యోగం హోదా ఉండే అబ్బాయిని చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.



ఆ అమ్మాయి సరే అంది.

తల్లిదండ్రులకు మించిన శ్రేయోభిలాషులు ఎవరుంటారు?

మొదట ఒక ఐ.ఆర్.ఎస్ ఆఫీసర్‌ను చూశారు. కాని అతడు ఆ పోస్టు కొట్టడానికి చదివీ చదివీ ఇంకా ఆ చదువు నుంచి కోలుకోని వాడిలా కనిపించాడు. తల్లిదండ్రులే వద్దనుకున్నారు. ఆ తర్వాత ఒక డాక్టర్‌ని చూశారు. కాని అతడి పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ఫీజు తామే కట్టి చదివించాల్సి ఉంటుందని గ్రహించి వద్దనుకున్నారు. ఆ తర్వాత అమెరికా సంబంధం చూశారు. అబ్బాయి అక్కడకు వెళ్లి పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు. చూడటానికి బాగున్నాడు. ఆస్తిపాస్తులు ఉన్నాయి. పైగా ట్రంప్ పెట్టే రూల్స్‌తో సంబంధం లేకుండా అన్ని విధాలా అక్కడ శేష జీవితం గడిపే అర్హతలతో ఉన్నాడు.

'ఇది మంచి సంబంధం' అని తల్లిదండ్రులు అన్నారు.

సరే అంది.

నిశ్చితార్థం అయ్యింది.

అబ్బాయి తిరిగి పెళ్లినాటికి వస్తానని వెళ్లాడు.

రెండు మూడువారాలు గడిచాయి. ఒకరోజు ఆ అమ్మాయి తల్లిదండ్రుల దగ్గరకు వచ్చి 'నాకీ పెళ్లి ఇష్టం లేదు. కేన్సిల్ చేయండి' అంది.

'నోర్ముయ్' అని తండ్రి అన్నాడు. 'పిచ్చెక్కిందా' అని తల్లి అంది. 'మా పరువేంగాను' అని ఇద్దరూ అన్నారు. 'ఈ పెళ్లి జరక్కపోతే చస్తాం' అని కూడా అన్నారు.

అమ్మాయి పారిపోయింది.

వెళ్లే ముందు చేసుకోను అంది.

వెళ్లొచ్చాకా చేసుకోను అంది.

అమ్మాయి పారిపోయాక, డీటాక్సినేషన్ కోసం ప్రకృతి వైద్యశాలలో చేరిందని అక్కడ ఫోన్లు అలౌ చేయరని అబ్బాయికి చెప్పి, ఏదో మేనేజ్ చేసిన తల్లిదండ్రులు ఈ విషయాన్ని ఎలా మేనేజ్ చేయాలా అని తలలు పట్టుకున్నారు.

* * *

'నాకు ఏదైనా ఎన్.జి.వోలో చేరి వీధి బాలల కోసం పని చేయాలని కోరిక మేడమ్' అందా అమ్మాయి లేడీ సైకియాట్రిస్ట్‌తో.

సైకియాట్రిస్ట్ వింటూ ఉంది.

'అందుకు తగినట్టుగా ఎం.ఎ. సోషల్‌వర్క్ చదువుదామనుకున్నాను ఇంటర్‌లో ఉండగానే. కాని సాఫ్ట్‌వేర్‌కు తగిన చదువు చదివించారు. పోనీ ఆ ఉద్యోగమూ చేయనివ్వలేదు. ఎప్పుడూ డబ్బు గురించి చెప్తారు కాని నాకు చిన్నప్పటి నుంచి కళలు, పుస్తకాలు, సంగీతం ఇష్టం. వాటి పట్ల నా ఇష్టం చూపిస్తే తిడతారని దాచుకుని దాచుకుని పుస్తకాలు చదివేదాన్ని. పాటలు వినేదాన్ని. ఊళ్లో మంచి సాహిత్య కార్యక్రమం ఉంటే వెళ్లేదాన్ని. డబ్బు మనిషికి సౌకర్యం ఇవ్వొచ్చు. కాని మనిషికి వికాసం ఇచ్చేది కళే. దాని టచ్ లేనివాళ్లు వేస్ట్ అని నా ఉద్దేశ్యం. ఈ అబ్బాయి మంచివాడే. అక్కడకు వెళ్లాక రోజూ ఫోన్ చేసేవాడు. ఒకరోజు ఏం చేస్తున్నావ్ అని అడిగితే చలం పుస్తకం చదువుతున్నా అన్నా. ఎవరతను అన్నాడు. గతుక్కుమన్నాను. మరో రోజు ఒక పాట పాడనా అని అడిగి 'నెమలికి నేర్పిన నడకలివీ' పాడాను. అంతా విని 'ఏ సినిమాలోదీ పాట' అన్నాడు. సత్యజిత్ రే తెలియదు. కె.బాలచందర్ తెలియదు. కరుణశ్రీ తెలియదు. సరిగ్గా పది ఘంటసాల పాటలు కూడా వినలేదు. అలా ఎలా పెరిగాడో మరి. నేను కొంత సర్దుకోగలను గానీ మరీ ఇంత సర్దుకోలేను' అందా అమ్మాయి.

సైకియాట్రిస్ట్‌కు మొత్తం అర్థమైంది.

తల్లిదండ్రులను పిలిచి మాట్లాడింది.

'మీ అమ్మాయికి అందమైన జీవితం అంటే తెలుసు. అర్థవంతమైన జీవితం అన్నా తెలుసు. స్వేచ్ఛగా ఎగిరే పక్షి, గాలికి తలలూపే చెట్టు ఎంత అందమైనవో మీ అమ్మాయి భావుక ప్రపంచం అంత అందమైనది. ఆ అబ్బాయి బంగారు బోనులాంటి వాడు. బోను బంగారంతో చేసినా బోనే కదా. పెళ్లి కేన్సిల్ చేస్తే రెండు రోజుల పాటు మీ బంధువులకు అది న్యూస్ అవుతుంది. పెళ్లి చేస్తే ప్రతి రోజూ న్యూస్ అవుతుంది' అంది.

ఆ పెళ్లి జరగలేదు.

ఇటీవల ఒక ట్రావెల్ ఫోటోగ్రాఫర్ ఆమెకు పరిచయమయ్యాడని తల్లిదండ్రులకు తెలిసింది.

వాళ్లిద్దరూ కలిసి ట్రావెల్ చేద్దామనుకుంటే వద్దనలేదట కూడా.

బహుశా వాళ్లిద్దరి పెళ్లిఫొటో కనుచూపుమేరలో ఉండొచ్చు.

– కథనం: సాక్షి ఫ్యామిలీ

**'మీ అమ్మాయికి అందమైన జీవితం అంటే తెలుసు. అర్థవంతమైన జీవితం అన్నా తెలుసు. స్వేచ్ఛగా ఎగిరే పక్షి, గాలికి తలలూపే చెట్టు ఎంత అందమైనవో మీ అమ్మాయి భావుక ప్రపంచం అంత అందమైనది. ఆ అబ్బాయి బంగారు బోనులాంటి వాడు. బోను బంగారంతో చేసినా బోనే కదా. పెళ్లి కేన్సిల్ చేస్తే రెండు రోజుల పాటు మీ బంధువులకు అది న్యూస్ అవుతుంది. పెళ్లి చేస్తే ప్రతి రోజూ న్యూస్ అవుతుంది'**

నివాళి

# హిట్ సినిమాల రూపకర్త జె. ఓంప్రకాష్ మృతి



'జై జై శివశంకర్'... అనే పాట రేడియోలో రోజూ వస్తుంటుంది. 'తుమ్ ఆగయే హో నూర్ ఆగయా హై' పాట కూడా ఎప్పుడూ వినపడుతుంటుంది. 'షీషా హో యా దిల్ హో టూట్ జాతా హై' చాలా పెద్ద హిట్. ఈ పాటలన్నీ ఉన్న సినిమాల సూత్రధారి, రూపకర్త జె. ఓంప్రకాష్ బుధవారం ముంబైలో మృతి చెందారు. ఆయన వయసు 92 సంవత్సరాలు. మొదట నిర్మాతగా, ఆ తర్వాత దర్శకుడిగా జె. ఓంప్రకాష్ హిందీ ఇండస్ట్రీలో అరవయ్యవ దశకం నుంచి యనభయ్యవ దశకం వరకు మూడు దశాబ్దాలపాటు చక్రం తిప్పారు. తన సినిమా టైటిల్స్ 'ఏ' అక్షరంతో మొదలయ్యే సెంటిమెంట్‌ను పాటించిన ఓంప్రకాష్ 'ఆయే మిలన్ కి బేలా', 'ఆయా సావన్ ఝూమ్ కే', 'ఆంఖో ఆంఖోమే' సినిమాలకు నిర్మాతగా వ్యవహరించారు. ఆ తర్వాత రాజేష్ ఖన్నా, ముంతాజ్‌లతో 'ఆప్ కీ కసమ్' సినిమాతో డైరెక్టర్‌గా మారారు. ఈ సినిమా సూపర్ హిట్ అయ్యింది. ఇందులోని 'జై జై శివశంకర్', 'జిందగీ కే సఫర్ మే' పాటలు చాలా హిట్. ఈ సినిమాను తెలుగులో దాసరి నారాయణరావు దర్శకత్వంలో మోహన్‌బాబు హీరోగా 'ఏడడుగుల బంధం'గా రీమేక్ చేశారు. ఆ తర్వాత రీనా రాయ్, జితేంద్రలతో 'ఆశా' సినిమాను తీశారు. ఇందులోని 'షీషా హో యా దిల్ హో' పాట, 'ఆద్మీ ముసాఫిర్ హై' పాటలు హిట్ అయ్యాయి. ఎన్.టి.ఆర్ హీరోగా ఇదే సినిమాను 'అనురాగదేవత'గా రీమేక్ తీస్తే పెద్ద హిట్ అయ్యింది. తమిళంలో కూడా ఇదే సినిమా రీమేక్ చేశారు. గుల్జార్ దర్శకత్వంలో తీసిన 'ఆంధీ' ఆ రోజుల్లో సంచలనమే సృష్టించింది. ఇందులోని పాటలూ హిట్టే. తన కుమార్తె పింకీని రాకేష్ రోషన్‌కు ఇచ్చి పెళ్లి చేయడం ద్వారా జె. ఓంప్రకాష్ సంగీత దర్శకుడు రోషన్‌కు వియ్యంకుడయ్యారు. హృతిక్ రోషన్‌కు తాతయ్యారు. జె. ఓంప్రకాష్ మరణవార్త విని అమితాబ్, ధర్మేంద్ర వంటి బాలీవుడ్ దిగ్గజాలు తరలి వచ్చి నివాళులు అర్పించారు. ఆయన అంత్యక్రియలు బుధవారం రోజునే ముంబైలో ముగిశాయి.



● మనవడు హృతిక్ రోషన్‌తో...

చెట్టు నీడ

# మేలు కోరితే మంచి జరుగుతుంది

శ్రేష్ఠి శంభునాథునికి భయం పట్టుకుంది. తన వ్యాపారం దెబ్బతింటుందని భయం. గత పదేళ్ల నుంచీ వ్యాపారం చేస్తున్నా ఇంతవరకు పోటీ లేదు. ఇప్పుడు మరొక శ్రేష్ఠి మాధవనాథుడు దుకాణాల సముదాయాన్ని తెరవబోతున్నాడని వినికిడి. మరేం పరవాలేదు, నేను పదేళ్ల నుంచీ పాతుకు పోయాను, అందరూ నా వినియోగదారులే అనే ధీమాతో ఉన్నాడు. అనుకున్నట్టే మాధవనాథుడు దుకాణ సముదాయాన్ని విజయదశమి నాడు ప్రారంభించాడు. రోజులు గడుస్తున్నాయి. మాధవనాథుని వ్యాపారం పుంజుకుంటోంది. శంభునాథుని వ్యాపారం పలచబడుతోంది. అయినా ఏదో ఆశ, తనకేం ఢోకాలేదని. రోజులు గడుస్తున్న కొద్దీ శంభునాథుని వ్యాపారం దిగజారనారంభించింది. ఇంక లాభం లేదనుకొని తమ తాతల నుంచీ సలహాలు తీసుకొనే నారాయణ స్వామీజీని కలిసి తన బాధను చెప్పుకున్నాడు .

స్వామీజీ యిచ్చిన సలహా ''శంభూ! రోజూ నీ దుకాణాన్ని చూస్తున్నప్పుడు, నా దుకాణం దిన దిన ప్రవర్ధమాన మౌతుందని పదే పదే అనుకో. అలాగే నువ్వు వచ్చిపోయేటప్పుడు మాధవనాథుని

దుకాణ సముదాయం దాటి వచ్చేటప్పుడు ఆ సముదాయాన్ని చూస్తూ మాధవనాథుడు వ్యాపారంలో మంచి లాభాలు గడించాలి అని అనుకో'' అన్నారు. స్వామీజీ మాటలు అర్థం కాలేదు. తానొకటి కోరుకుంటే, ఆయనొకటి చెప్తున్నారు అనుకున్నాడు. ఇష్టం లేకున్నా, స్వామీజీ ఆదేశ ప్రకారం చేస్తున్నాడు. అయినా తన వ్యాపారం దిగజారుతూనే వుంది. మార్పు లేదు. చివరకు తన వ్యాపారాన్ని మూసేసాడు.

ఒకరోజు అటుగా వె ళ్తున్న శంభునాథుని మాధవనాథుడు పిలిచి ''శంభూ! నువ్వేమీ అనుకోకపోతే నేనొక మాట చెబుతాను. నీ వ్యాపారం దెబ్బతింది, నా వ్యాపారం పెరిగి పోతోంది. మరొక దుకాణ సముదాయం తెరుద్దామనుకుంటున్నాను. నువ్వు దీనికి నిర్వాహకుడిగా వుండి వ్యాపారం చూడు. నువ్వూహించని ధనం ఇస్తా'' అన్నాడు.''శంభునాథుడు తెల్లబోయాడు. ఎందుకిలా జరిగిందో అర్థం కాలేదు. చిన్న దుకాణ యజమాని పెద్ద దుకాణాల సముదాయానికి నిర్వాహకుడు అవుతాడు, వ్యాపారంలో నష్టమొస్తుందన్న చింత వుండదు, జీవితం హాయిగా సాగిపోతుందని భావించి అందుకు అంగీకరించాడు. నాటి హాయిగా బతుకుతున్నాడు. ఎదుటి వానికి కూడా మేలు జరగాలనే చింతనలోనే వుంది అసలు రహస్యం. అదే స్వామీజీ సందేశం.

– విశ్వేశ్వరవర్మ భూపతిరాజు

బొమ్మలిల్లు

# మొక్కజొన్న బాల్యం



**ఆ ఇంటి పై కప్పు నుంచి వెలువడిన చిక్కటి పొగ ఆకాశంలో దట్టమైన మేఘాలను సృష్టిస్తోంది. అప్పటికే అలుముకున్న చిక్కటి మంచు దుప్పటిని చీల్చుకుంటూ ప్రయాణిస్తోంది పొగ. ఇంట్లో ఎంత భారీ వంటలు వండితే ఇంత చిక్కటి పొగ ఇంత సేపు వస్తుంది? ఎంతమందికి వండుతున్నారు? పెళ్లి వంటి వేడుక ఉందేమో, విందు కోసం పెద్ద ఎత్తున వంటలు చేస్తున్నారేమో అనిపిస్తుంది ఆ పొగను చూస్తుంటే. మణిపూర్‌లోని సాంగ్‌సాంగ్ గ్రామస్థులకు అది రోజూ అలవాటైన దృశ్యమే. ఆ ఇల్లు నెలీ చాచియాది.**

### బొమ్మల 'కర్మాగారం'

ఆ పొగ వస్తున్న ఇల్లు నెలీ చాచియా బొమ్మలిల్లు. నిజమే. బొమ్మరిల్లు కాదు బొమ్మలిల్లే. ఆ ఇంట్లో నెలీ చాచియా బొమ్మలు తయారు చేస్తుంది. దాదాపుగా అన్నీ చేతిలో పూలబుట్ట పట్టుకున్న మోడరన్ యువతి బొమ్మలే. ఆ బొమ్మలకు ముడి సరుకు మొక్కజొన్న పంట వ్యర్థాలే. అది ఆమె బొమ్మల కార్ఖానా. నెలీ ఆడుతూపాడుతూ బొమ్మలు చేస్తుంది. ఆ బొమ్మలను పిల్లల కోసం అమ్ముతుంది. నెలకు కనీసంగా 45 వేలు సంపాదిస్తోంది. రోజంతా వర్క్ స్టేషన్‌లో గడిపితే పన్నెండు బొమ్మలు చేస్తుందామె. బొమ్మ డిజైన్‌ను బట్టి మార్కెట్‌లో రెండు నుంచి ఐదు వందల ధర పలుకుతుంది. ఉద్యోగాలు దొరకట్లేదని, ఉపాధికి మార్గాల్లేవని నిరాశ పడకూడదంటారు నెలీ. 'ప్రకృతిలో ప్రతిదీ అవసరమైన వస్తువే, ప్రతి వస్తువూ అందమైనదే. మన దృష్టి కోణం సృజనాత్మకమైనదైతే ఆ వస్తువులో సౌందర్యాన్ని చూడగలుగుతాం. మనసు పెట్టి పని చేస్తే... ఆ పనే మనకు ఆలంబన' అంటారామె.

### డబ్బుంటే అబ్బేది కాదేమో

నెలీ చాచియా బొమ్మలు తయారు చేయడాన్ని వృత్తిగా మలుచుకోవడానికి బీజం పడిన చిన్నప్పటి పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. ''నా చిన్నప్పుడు తోటి పిల్లలతో ఆడుకోవడానికి వెళ్లినప్పుడు అందరి దగ్గరా బొమ్మలుండేవి. అందరూ ఆటలకు తమ బొమ్మలు తెచ్చేవాళ్లు. ఆ బొమ్మలన్నీ ఒక చోట చేర్చి ఆడుకునే వాళ్లం. నాకు బొమ్మలు కొనడానికి అమ్మ దగ్గర డబ్బులుండేవి కాదు. అందరి దగ్గరా బొమ్మలున్నాయని, నాకూ కొనివ్వమని బాగా మారాం చేసి ఏడ్చాను. అప్పుడు మా అమ్మ... మొక్కజొన్న కండెలు, పొట్టు, ఆకులతో బొమ్మ చేసిచ్చింది. బొమ్మ ఎలా చేయాలో నేర్పించి, ఎన్ని రకాల బొమ్మలు కావాలో అన్నీ చేసుకోమన్నది. అప్పటి నుంచి రకరకాలుగా బొమ్మలు చేసుకుని ఆటలకు తీసుకెళ్లేదాన్ని. నా బొమ్మలకు క్రేజ్ కూడా పెరిగింది. పెద్దయిన తర్వాత నా చేతిలో ఉన్న కళనే ఉపాధిగా మార్చుకుంటే బాగుంటుందని పించింది. అలా 2000వ సంవత్సరంలో బొమ్మల తయారీ యూనిట్ ప్రారంభించాను. తర్వాత కొన్నేళ్లకు పిల్లలకు, మహిళలకు బొమ్మల తయారీలో శిక్షణ ఇవ్వడం కూడా మొదలుపెట్టాను. 'ఇలా అందరికీ నేర్పిస్తూ పోతే నీ పరిశ్రమ నడిచేదెలాగ' అన్నారు స్నేహితులు. నేర్పించడంలో నా ఉద్దేశం... ప్రతి ఒక్కరిలో 'మన ఎదుట ఉన్న ఎందుకూ పనికిరావనుకున్న వస్తువులతో అందమైన రూపాన్ని తయారు చేయవచ్చ'నే ఊహకు జీవం పోయడమన్నమాట. నా దగ్గర నేర్చుకున వాళ్లు... నేను నేర్పిన మెళకువలకు తమ క్రియేటివిటీని జోడించి, వాళ్లకు అందుబాటులో ఉన్న మెటీరియల్‌తో మరింత ఆకర్షణీయమైన బొమ్మలు చేస్తున్నారు. ముఖ్యంగా పిల్లల్లో అంతర్లీనంగా ఉన్న కళ బయటికొస్తుంది. నా బొమ్మలన్నీ పర్యావరణానికి ఏ మాత్రం హాని కలిగించని ఎకో ఫ్రెండ్లీ బొమ్మలే. పర్యావరణానికి హాని కారకమైన వస్తువుల వినియోగంలో తొలి వరుసలో ఉన్నది పిల్లల ఆట బొమ్మలే. వాటి స్థానాన్ని ఎకో ఫ్రెండ్లీ బొమ్మలతో భర్తీ చేయాలనేది నా కోరిక'' అంటారు నెలీ చాచియా.

మణిపూర్ రాజధాని నగరంలో ఇంఫాల్‌లో ఒక స్టోర్ తెరిచారామె. తాను మాత్రం ఎక్కువ రోజులు సొంతూరు సాంగ్ సాంగ్ లోని బొమ్మల పరిశ్రమలోనే పని చేస్తారు. బొమ్మల పరిశ్రమకే కాదు ఏ పరిశ్రమ అయినా సరే... యజమాని వర్క్‌స్టేషన్‌ను వదిలి షో రూమ్‌లో కూర్చోవడం మొదలు పెడితే ఇక అప్పట్నుంచి పరిశ్రమ తిరోగమనం మొదలైనట్లే అంటారామె.

– మంజీర

మణిపూర్ బొమ్మ




**"ఇండియన్ ఫ్లవర్స్, ఆర్నమెంటల్ ప్లాంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్‌లు సంయుక్తంగా 2007లో న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఇంటర్నేషనల్ ఫ్లోరా ఎక్స్‌పో నిర్వహించాయి. ఆ ఎక్స్‌పోలో పాల్గొనడం నాకు పెద్ద టర్నింగ్ పాయింట్. అప్పటినుంచి నెలీ చాచియా మణిపూర్ దాటి బయటి ప్రపంచానికి తెలిసింది. నా మొక్కజొన్న బొమ్మల స్టాల్ కోసం అనేక ఎగ్జిబిషన్‌ల నుంచి ఆహ్వానాలు వస్తున్నాయి. విదేశాల్లో కూడా మన మొక్కజొన్న బొమ్మలకు మంచి ఆదరణ లభిస్తోంది".**

**- నెలీ చాచియా,** ఎకో ఫ్రెండ్లీ బొమ్మల పరిశ్రమ నిర్వహకురాలు

### మొక్కజొన్న మెరుపుతీగలు


మొక్కజొన్న కంకిని కప్పి ఉంచే ఆకులు, ఆకులకు గింజలకు మధ్య ఉండే పట్టులాంటి మృదువైన దారాలు, గింజలు ఒలిచిన కండెలు, గింజలను మర పట్టినప్పుడు వచ్చే పొట్టు ఆమె బొమ్మలకు ముడిసరుకులు. పొట్టును తడిపి బొమ్మ తల, దేహం ఆకారాల్లో మలిచి ఆరబెట్టాలి. మొక్కజొన్న ఆకులను బొమ్మలకు దుస్తుల్లా కట్టాలి. మృదువైన దారాలను తల మీద అమరిస్తే చక్కటి హెయిర్‌స్టయిల్‌తో మోడరన్ యువతి బొమ్మ రెడీ. నెలీ ఫ్లోరిస్ట్ కూడా కావడంతో ఆమె బొమ్మల్లో డ్రై ఫ్లవర్స్ పూలబుట్టలు కూడా ప్రధానంగా కనిపిస్తాయి.



epaper.sakshi.com

సాక్షి
ఫ్యామిలీ సినిమా
విజయవాడ ॥ గురువారం
8-8-2019

## లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ నీలాంబరి గారూ! మీరు చాలా నాటీ. నాకు కూడా ఓ నాటీ ఆన్సర్ ఇవ్వండి ఆ లవ్ డాక్టర్‌తో కలిపి. నాకు ఓ అమ్మాయితో స్నేహం కుదిరింది. కానీ వాళ్ల ఫ్యామిలీతో అంతకు ముందే గొడవైంది. ఆ విషయం ఆ అమ్మాయికి కూడా తెలుసు. ఇప్పుడు ఏం చెయ్యాలి నీలూ గారూ?

– రఘు

ఆ లవ్ డాక్టర్ ఎందుకో రాలేదు
ఈ నీలాంబరి ఆయన కోసం వెళ్తోంది
అరటిపండు ఖాళీగా ఉంది
నువ్వేమనుకోనంటే నీకు సమాధానం ఈ అరటిపండు చెబుతుంది
ఇదేమీ అల్లాటప్పా అరటిపండు కాదు
గొప్ప మేధావి
తొక్కలో సమాధానం చెబుతుందను కోకు మిత్రమా!
డొక్కలో గుజ్జు నింపే ఆన్సర్ ఇస్తుంది! బాయ్ బాయ్!
‘రఘూ! లవ్ అంటేనే గొడవ..
చేసినంత సేపు గుండెలో గడబిడ..
అమ్మాయి ఒప్పుకుంటే పర్స్‌లో దడ
ఒప్పుకోకపోతే మనసులో బెడద
వాళ్ల అన్నయ్యకు తెలిస్తే దబిడిదిబిడే
కడుపుకు బుద్ధి ఉన్నవాడు.. మైండ్‌లో గుజ్జు ఉన్నవాడు..
ఫ్యామిలీతో ట్రబుల్ ఉన్నవాడూ ప్రేమా తొక్కా..
అని స్టెప్స్ వేస్తే కాలు జారి బాడీ పటప టా’

lovedoctorram@sakshi.com

## అదో బోరింగ్ టాపిక్

‘రానాకు అమెరికాలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది. రానా తల్లి లక్ష్మీ దగ్గుబాటి స్వయంగా కిడ్నీ దానం చేశారు’ అంటూ గత కొద్ది రోజులుగా వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. రానా ఆరోగ్యం విషయంలో పదే పదే ఏదో వార్త షికారు చేయడం చాలా కామన్‌గా అయిపోయింది. ఇటీవల రానా అమెరికాకు వెళ్లడంతో కిడ్నీ మార్పిడి సర్జరీ కోసమే అక్కడకు వెళ్లాడని ఆన్‌లైన్‌లో వార్తలు చక్కర్లు కొట్టాయి. దీనిపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో రానా స్పందించారు. ‘‘నా ఆరోగ్యం గురించి చాలా రోజుల నుంచి జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. నా ఆరోగ్యంపై రూమర్లు వచ్చిన ప్రతిసారీ ‘నేను ఆరోగ్యంగా ఉన్నాను’ అని క్లారిటీ ఇచ్చి అలిసిపోయాను. అందుకే నాకు ఇదో బోరింగ్ టాపిక్ అయింది. హైదరాబాద్ వదిలి నేను ఎక్కడికైనా ప్రయాణమైతే చాలు.. చాలామంది టెన్షన్ పడిపోతున్నారు. నా మీద అందరూ చూపించే శ్రద్ధకు.. ప్రేమకు ఋణపడి ఉంటాను. గుణశేఖర్ దర్శకత్వంలో నేను నటించనున్న భారీ బడ్జెట్ చిత్రం ‘హిరణ్య కశ్యప’ ప్రీ ప్రొడక్షన్ పనుల కోసం ఇటీవల అమెరికా వెళ్లాను. ప్రీ విజువలైజేషన్ కాన్సెప్ట్ గురించి పలు వీఎఫ్ఎక్స్ కంపెనీలతో మాట్లాడేందుకే వెళ్లా’’ అన్నారు.


రానా


నాగార్జున

“ఇతర భాషల్లో నా మార్కెట్‌ను పెంచుకోవాలనే ఆలోచన నాకూ ఉంది. కానీ నాకు ద్విభాషా చిత్రాలు కలిసి రాలేదు. నా కెరీర్‌లో నాలుగు ద్విభాషా చిత్రాలు చేశాను. సరైన ప్రేక్షకాదరణ లభించలేదు. ఈ విషయంలో నా పాఠాలు నేను నేర్చుకున్నాను. గీతాంజలి, శివ చిత్రాలను డబ్ చేశాం. బైలింగ్వల్‌గా తీయలేదు. ‘బాహుబలి’ కూడా తెలుగులోనే తీశారు. ఆ తర్వాత మిగతా భాషల్లోకి డబ్ చేసినా, మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు అందరూ అన్ని రకాల సినిమాలు చూస్తున్నారు” అని నాగార్జున అన్నారు. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో నాగార్జున హీరోగా నటించిన తాజా చిత్రం ‘మన్మథుడు 2’. ఇందులో రకుల్‌ప్రీత్ సింగ్ కథానాయికగా నటించారు. నాగార్జున, పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమా రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా నాగార్జున చెప్పిన విశేషాలు.

# నేను స్టార్‌ని కావడానికి అదో కారణం

● ‘మన్మథుడు 2’ని చాలా కష్టపడి చేశాం. మేం పడిన కష్టాన్ని ప్రేక్షకులు గుర్తించాలని కోరుకుంటున్నాను. అమ్మ, ముగ్గురు చెల్లెళ్లు, ఓ అమ్మాయి వల్ల బ్యాచిలర్ అయిన ఓ మధ్య వయస్కుడి జీవితం ఎలా ప్రభావితం అవుతుందన్నదే సినిమా కథ. ఈ సినిమా రొమాన్స్, ప్రేమ గురించి కాదు. పూర్తి స్థాయి వినోదాత్మక కుటుంబ కథా చిత్రం. విజయనగరం నుంచి వెళ్లి పోర్చుగల్‌లో సెటిలైన ఓ కుటుంబానికి చెందిన ఫోర్త్ జనరేషన్ ఫ్యామిలీ మెంబర్స్ కథ ఇది. వీళ్ల ఉండే ప్రాంతం పేరు కసాండ్ర అయితే ఆంధ్రా భోజనాలు, వంటకాలతో అది కాస్తా కసాంధ్రగా మారుతుంది (నవ్వుతూ).

● హీరోకి అమ్మ అంటే చాలా ఇష్టం. అమ్మ మాటను కాదనలేడు. అలాగని మనస్సాక్షిని వదులుకోలేడు. పెళ్లి చేసుకోవాలనే ఆలోచన హీరోది కాదు. వాళ్ల అమ్మది. అలా తప్పని పరిస్థితుల్లో డబుల్ లైఫ్‌ని లీడ్ చేయాల్సిన పరిస్థితి. ఆ సమయంలో ఓ కుర్ర అమ్మాయి హీరో జీవితంలోకి వస్తుంది? అప్పుడు ఎలాంటి పరిణామాలు జరిగాయి? అనే అంశాలు సినిమాలో ఆసక్తికరంగా ఉంటాయి. ట్రైలర్‌లో కొన్ని జోక్సే చూపించాం. సినిమా నిండా జోక్స్ ఉన్నాయి.

● రాహుల్ దర్శకత్వంలో వచ్చిన ‘చిలసౌ’ బాగా నచ్చింది. ఫ్రెంచ్ సినిమా బేస్ లైన్ తీసుకుని మన తెలుగు నేటివిటీకి తగ్గట్లు మార్చాలని రాహుల్‌తో చెప్పాను. రాహుల్‌కి ఆర్టిస్టులతో పెర్ఫార్మ్ చేయించుకోవడం బాగా తెలుసు. ఏడాది ప్రీ–ప్రొడక్షన్ వర్క్ చేశాం. అంతా పర్‌ఫెక్ట్‌గా జరిగింది.

● సినిమా స్టార్టింగ్‌లో నాకూ, రకుల్‌కు ఏవో విభేదాలు వచ్చాయనే వార్తల్లో నిజం లేదు. రకుల్ మంచి నటి. ‘నిన్నే పెళ్లాడతా’ సినిమా తర్వాత లక్ష్మీగారు నాకు మళ్లీ తల్లిగా ఈ సినిమాలోనే నటించారు. క్లైమాక్స్‌లో మంచి ఎమోషనల్ కంటెంట్ ఉంది. ‘ఆర్ ఎక్స్ 100’ సినిమా సంగీతం నచ్చి ఈ సినిమా మ్యూజిక్ డైరెక్టర్‌గా చేతన్ భరద్వాజ్‌ను ఎంపిక చేశాం. సమంత, కీర్తీ సురేష్‌లవి ఈ సినిమాలో కీలకమైన అతిథి పాత్రలు.

● నిర్మాత పి. కిరణ్ నాకు చిన్ననాటి స్నేహితుడు. ఎప్పట్నుంచో మా కాంబినేషన్‌లో సినిమా అనుకుంటున్నాం. ఇప్పటికీ కుదిరింది. వయాకామ్‌వారు కూడా తెలుగులో సినిమాలు చేయాలనుకుంటున్నారు. వారు మా బ్యానర్‌తో అసోసియేట్ అవ్వడం హ్యాపీ. ‘మన్మథుడు 2’ ఆడితే ‘మన్మథుడు 3’ ఉండొచ్చు.

**ధనుష్‌తో నేను చేయాల్సిన సినిమా క్యాన్సిల్ అయింది. బాలీవుడ్‌లో నేను చేస్తున్న ‘బ్రహ్మాస్త్ర’ సినిమా మంచి ఎగ్జైటింగ్ ప్రాజెక్ట్. నా వంతు షూటింగ్ ఇంకా పూర్తి కాలేదు. బాగా గ్రాఫిక్స్ ఉన్నాయి. ‘సోగ్గాడే చిన్ని నాయనా’ ప్రీక్వెల్ స్టార్ట్ చేయాల్సి ఉంది.**

● సెన్సార్ వారు యూఎ సర్టిఫికెట్ ఇచ్చారు. ఏ క్యారెక్టర్ చెప్పిన పదాలను సెన్సార్‌వాళ్లు మ్యూట్ చేశారనేది సినిమాలో చూడండి. సినిమాలోని పాత్రలను బట్టి ఆ డైలాగులు వస్తాయి. ‘అన్నమయ్య’ తర్వాత మళ్లీ అంత స్వచ్ఛమైన తెలుగు ఈ సినిమాలోనే వాడాం. ‘మన్మథుడు’తో పోల్చితే ఈ సినిమాలో రొమాన్స్ తక్కువ. అయినా నేటితరం పిల్లలకు ముద్దులు తెలియదు అనుకుంటే మన అమాయకత్వమే.

● కొత్త దర్శకులతో చేస్తే నాలోని కొత్తదనాన్ని వారు వెలికి తీస్తారు. యంగ్ టీమ్‌తో వర్క్ చేయడం నాకు ఫుల్ ఫన్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో గమనిస్తే ఎక్కువగా నేను అప్పటి తరం యంగ్ డైరెక్టర్స్‌తో చేసిన సినిమాలు కాస్త ఎక్కువగానే ఉంటాయి. నా మిగతా సినిమాల్లో కూడా సెకండ్ న్యూ డైరెక్టర్ లేదా బ్రాండ్ న్యూ డైరెక్టర్స్ ఉంటారు. బహుశా... నేను స్టార్‌ని కావడానికి ఇదొక కారణం కావొచ్చు.

● సీరియస్ సినిమాలు నాకు అంతగా నచ్చవు. సినిమాలోని క్యారెక్టర్స్ నవ్వించేలా లేదా స్ఫూర్తి పొందేలా ఉండాలనుకుంటాను. ఒకవేళ మనం ఏడిస్తే సంతోషంగా ఏడ్వాలి. డిప్రెషన్‌తో కాదు. కొన్ని సీరియస్ పాత్రలు చేశాను. వాటిలో కొన్నింటి నుంచి నా తప్పులు నేను తెలుసుకున్నాను. కొత్త పాఠాలు నేర్చుకున్నాను. సినిమా సక్సెస్ ఒక్కరిదే కాదు. టీమ్ అందరిదీ. అయితే దురదృష్టవశాత్తు సక్సెస్ క్రెడిట్‌ను హీరో, దర్శకులు తీసుకుంటున్నారు. ఇప్పుడు కొత్త కొత్త కథలు వస్తున్నాయి. సీనియర్ హీరోలకు కథల కొరత ఉంది. మంచి కథను పట్టుకోవడం కోసం కష్టపడతాం.

● ‘మీలో ఎవరు కోటీశ్వరుడు?’ షోలో లైఫ్ స్టోరీస్ విన్నాను. కానీ బిగ్‌బాస్ షోలో వారానికి వారం మారిపోతున్నారు. డిఫరెంట్‌గా ఉంటున్నారు. షో పాపులారిటీ కూడా పెరిగిపోతోంది. ఇదో డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్. ఒకే హౌస్‌లో అయితే నేను ఎక్కువగా ఉండను. ఈ షోకు మంచి వ్యూయర్‌షిప్ రావడం హ్యాపీ. ఈ ఏడాది నా బర్త్‌డే (ఆగస్టు 29)కి స్పెషల్ ప్లాన్స్ ఏమీ లేవు. నా ఫ్యామిలీతో ఎక్కడికైనా పారిపోదాం అనుకుంటున్నాను (సరదాగా). వాళ్లతో కొంచెం టైమ్ గడపాలని ఉంది.


శర్వానంద్, కాజల్

## డబ్బుతో కొనలేనిది డబ్బోక్కటే

‘ముంతాజ్ కోసం షాజహాన్ తాజ్‌మహల్ కట్టాడంటే డబ్బులు ఎక్కువై అనుకున్నా.. కొంతమంది కోసం కట్టొచ్చు.. ఖర్చు పెట్టొచ్చు, పవర్ ఉంటే సరిపోదు.. అది ఎవరిమీద ఉపయోగించాలో కూడా తెలుసుకో, ఈ ప్రపంచంలో డబ్బుతో కొనలేనిది ఏదైనా ఉందంటే అది డబ్బొక్కటే, మూడో ప్రపంచ యుద్ధం నీళ్ల కోసమే అంటే నమ్మలేదు.. ఇప్పుడు నమ్మక తప్పట్లేదు’... అంటూ శర్వానంద్ చెప్పిన డైలాగులు ‘రణరంగం’ సినిమాపై ఆసక్తి పెంచుతున్నాయి. శర్వానంద్ హీరోగా, కాజల్ అగర్వాల్, కళ్యాణీ ప్రియదర్శిని హీరోయిన్లుగా సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘రణరంగం’. పీడీవీ ప్రసాద్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ– ‘‘సుధీర్ వర్మ ‘రణరంగం’ చిత్రాన్ని చక్కగా తెరకెక్కించారు. శర్వానంద్ ఇందులో పోషించిన గ్యాంగ్‌స్టర్ పాత్ర ఆయన గత చిత్రాలకు భిన్నంగా, ఎంతో వైవిధ్యంగా ఉంటుంది. మంచి భావోద్వేగాలుంటాయి. హీరో జీవితంలో 1990, ప్రస్తుతకాలంలోని సంఘటనల సమాహారమే మా ‘రణరంగం’. కాకినాడలో విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. కాజల్ అగర్వాల్, కల్యాణీల పాత్రలు కథానుగుణంగా సాగుతూ ఆకట్టుకుంటాయి’’ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రశాంత్ పిళ్లై, కెమెరా: దివాకర్ మణి.

## ఇంటి ఖరీదు 140 కోట్లు

మీరు చదివింది కరెక్టే. ఇప్పుడు ప్రియాంకా చోప్రా, నిక్ జోనస్ కొనబోతున్న ఇంటి ఖరీదు దాదాపు 140 కోట్లు అని సమాచారం. గత ఏడాది ఈ ఇద్దరూ పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. పెళ్లయ్యాక లాస్ ఏంజిల్స్‌లోని బెవెర్లీ హిల్స్‌లో ఉన్న నిక్ ఇంట్లో ఈ దంపతులు ఉంటూ వచ్చారు. ఆ ఇంటి ఖరీదు దాదాపు 50 కోట్లు అట. 5 పడక గదులు, 5 బాత్రూమ్‌లు, ఈత కొలను.. ఇలా హంగామా ఉన్న ఆ ఇంటిని ఇటీవల అమ్మేశారట నిక్. ఇదే పెద్ద ఇల్లు అంటే ఇంతకన్నా పెద్ద ఇంటికి మారాలని ఈ క్రేజీ కపుల్ అనుకున్నారని హాలీవుడ్ కథనం. బెవెర్లీ హిల్స్‌లోనే సుమారు 140 కోట్లు విలువ చేసే ఇంటిని కొనుగోలు చేయబోతున్నారట. అయితే తన సోదరులతో కలిసి నిక్ జోనస్ ‘హ్యాపీనెస్ బిగిన్స్ టూర్’ ప్లాన్ చేశారు. ఈ మ్యూజికల్ టూర్ కోసం నిక్ పలు ప్రదేశాలను సందర్శిస్తారు. అందుకని కొత్త ఇల్లు కొనుక్కుని, తమ అభిరుచికి తగ్గట్టు అన్ని ఏర్పాట్లు చేసుకోవడానికి టైమ్ పడుతుంది కాబట్టి వచ్చే ఏడు నిక్, ప్రియాంక గృహప్రవేశం అవుతారని సమాచారం. ఇక సినిమాల విషయానికి వస్తే.. ప్రియాంకా చోప్రా నటించిన ‘ది స్కై ఈజ్ పింక్’ రిలీజ్‌కి రెడీ అవుతోంది. ఇంకొన్ని చిత్రాలకు సైన్ చేశారామె.


నిక్ జోనస్


ప్రియాంకా చోప్రా

## సెప్టెంబర్‌లో సాహసం


నాగ్ అశ్విన్

లెజండరీ నటి సావిత్రి బయోపిక్‌ని ‘మహానటి’ పేరుతో వెండితెరపై చక్కగా ఆవిష్కరించి మంచి విజయం సాధించడంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు డైరెక్టర్ నాగ్ అశ్విన్. తొలి సినిమా ‘ఎవడే సుబ్రమణ్యం’తో హిట్ సాధించిన నాగ్ అశ్విన్ రెండో సినిమా ‘మహానటి’తో ఘన విజయం అందుకున్నారు. గత ఏడాది మేలో ఈ చిత్రం విడుదలైన విషయం తెలిసిందే. ఆ చిత్రం తర్వాత ఆయన ఎవరితో సినిమా చేయనున్నారనే ఆసక్తి ఇటు ఫిల్మ్ ఇండస్ట్రీతో పాటు అటు ప్రేక్షకుల్లో నెలకొంది. పలువురు హీరోలు అశ్విన్‌తో సినిమా చేసేందుకు ఆసక్తి చూపారని టాక్. అయితే తాజాగా నాగ్ అశ్విన్ తన కొత్త సినిమాను ప్రకటించారు. వైజయంతీ మూవీస్ పతాకంపై రూపొందనున్న ఈ సినిమా సెప్టెంబర్‌లో ప్రారంభం కానుంది. ‘సాహసం సెప్టెంబర్‌లో మొదలవుతుంది. ఈ సినిమాకు రచయితలు, విజువల్ ఆర్టిస్ట్స్, డిజైనర్స్ కొత్తవారు కావాలి. అందుకోసం అన్వేషణ జరుగుతోంది’’ అని వైజయంతీ మూవీస్ ప్రకటించింది, ఈ సినిమా హీరో, హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మాత్రం ప్రకటించలేదు.

## ఏంట్రా ఈ హింస అనుకున్నాను!


సంపూర్ణేష్

‘‘కొబ్బరిమట్ట’ సినిమా రిలీజ్ విషయంలో చాలా ఆందోళనకు గురయ్యాను. చాలామంది అసలు ఈ సినిమా విడుదల అవుతుందా? అన్నారు. చాలా బాధగా అనిపించింది. ఇప్పుడు వాళ్లే ఫోన్ చేసి ఆల్ ది బెస్ట్ చెప్పాలని చూస్తున్నారు. నేను వాళ్ల ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు’’ అన్నారు సంపూర్ణేష్ బాబు. రూపర్ రోనాల్డ్ దర్శకత్వంలో సంపూర్ణేష్ హీరోగా సాయి రాజేష్ (స్టీవెన్ శంకర్) నిర్మించిన ‘కొబ్బరి మట్ట’ సినిమా ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా సంపూర్ణేష్ పంచుకున్న విశేషాలు.

● మాది మిట్టపల్లి. మా నాన్నగారు గోల్డ్‌స్మిత్ వ్యాపారి. నాకు చిన్నతనం నుంచే సినిమాలపై ఆసక్తి. నాటకాల్లో నటించాను. వెండితెరపై నన్ను నేను చూసుకోవాలనుకుంటున్న సమయంలో ‘హృదయ కాలేయం’ దర్శకుడు స్టీవెన్ శంకర్ పరిచయం అయ్యాడు. ‘నేనొక చెత్త హీరో కోసం వెతుకుతున్నా’ అన్నాడు. అలా నరసింహాచారి హీరో సంపూర్ణేష్ బాబుగా మారాడు. ఆ తర్వాత ‘సింగం 123, వైరస్’ సినిమాలు చేశా. ‘హృదయ కాలేయం’ తర్వాత జరిగిన కొన్ని సంఘటనలు బాధించాయి.

● ‘కొబ్బరిమట్ట’ చిత్రంలో పెదరాయుడు, పాపారాయుడు, ఆండ్రాయిడ్ అనే మూడు పాత్రల్లో నటించాను. ఈ సినిమాలో నాకు ఆరుగురు భార్యలు, ముగ్గురు చెల్లెళ్లు ఉంటారు.

● ‘హృదయ కాలేయం’ తర్వాత ‘కొబ్బరిమట్ట’ పోస్టర్ రిలీజ్ చేశాం. ఈ సినిమా బాగా ఆలస్యం కావడానికి కారణం మేం అనుకున్న బడ్జెట్ కన్నా ఎక్కువ కావడమే. మధ్యలో నేను బిగ్‌బాస్ షోకు వెళ్లాల్సి రావడం ఒక కారణం. చాలామంది ఆర్టిస్టులు నటించడం వల్ల వారి కాంబినేషన్ సీన్స్ తీయడానికి కష్టపడ్డాం. ఈ సినిమా జర్నీ మూడేళ్ల పాటు సాగింది. నా మొదటి సినిమా దర్శకుడు స్టీవెన్ ఈ సినిమా నిర్మించినందుకు ఆయనకు థ్యాంక్స్.

**సన్నీ లియోన్ తెలియదు**

**మనోజ్ ‘కరెంట్‌తీగ’ సినిమాలో సన్నీ లియోన్‌తో నటించబోతున్నానగానే అందరూ అవాక్కయ్యారు. అప్పటివరకూ సన్నీ లియోన్ ఎవరో నాకు తెలియదు. సెట్‌లో ఆమెను చూశాను. నన్ను మనోజ్ ఆమెకు పరిచయం చేశారు. మేం పెద్దగా ఏం మాట్లాడుకోలేదు. నాకు ఇంగ్లీష్ రాదు.. సన్నీకి తెలుగు రాదు.**

● ఈ సినిమాలో నేను మూడున్నర నిమిషాల డైలాగ్స్ చెప్పడం కోసం చాలా కష్టపడ్డాను. చదువుకోవడానికే రెండు రోజులు పట్టింది. రాయడం, వినడం, చదవడం ఇలా చాలా ప్రాక్టీస్ చేసి చెప్పాను. మంచి స్పందన లభించింది. డైలాగ్ కింగ్ మోహన్‌బాబుగారు ఫోన్ చేసి అభినందించడం హ్యాపీ. అయితే ఈ డైలాగ్ ఫస్ట్ టైమ్ నా దగ్గరకు వచ్చినప్పుడు ‘ఏంట్రా ఈ హింస’ అనుకున్నా.

● నేను హైదరాబాద్‌కు ఇంకా షిఫ్ట్ కాలేదు. నాకు ఇద్దరు కుమార్తెలు. మా ఊర్లోనే ఉందామని మా ఆవిడ చెప్పారు. అయితే నరసింహాచారి కన్నా సంపూర్ణేష్ బాబు లైఫ్ బాగుందని చెప్పగలను. సంపూర్ణేష్ బాబుగా నాకు వచ్చిన క్రేజ్‌నే వినియోగించుకోలేకపోతున్నాను. ఇక బర్నింగ్‌స్టార్ అనే ట్యాగ్‌ను నేనేం చేసుకోను.

● ఇటీవల రెండు సినిమాలకు అడ్వాన్స్ తీసుకున్నాను. కానీ ‘కొబ్బరి మట్ట’ విడుదలపై క్లారిటీ లేకపోవడంతో ఆ సినిమాలు ఆగిపోయే పరిస్థితి. ఈ సినిమాపై నా కెరీర్ ఆధారపడి ఉంది.

## తోట బావి వద్ద...


గౌతమి, రవి

యాంకర్ రవి హీరోగా తెరకెక్కిన చిత్రం ‘తోట బావి’. గౌతమి హీరోయిన్‌గా నటించారు. అంజి దేవండ్ల దర్శకత్వం వహించారు. గద్వాల్ కింగ్స్ సమర్పణలో జోగులాంబ క్రియేషన్స్ పతాకంపై ఆలూర్ ప్రకాష్ గౌడ్ నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని డ్యాన్స్ మాస్టర్ శేఖర్ విడుదల చేసి, మాట్లాడుతూ– ‘‘తోటబావి’ టైటిల్ చాలా కొత్తగా ఉంది. ఫస్ట్‌లుక్ బావుంది. ఈ సినిమా మంచి విజయం సాధించి, యూనిట్‌కి పేరు తీసుకురావాలి’’ అన్నారు. అంజి దేవండ్ల మాట్లాడుతూ– ‘‘యాక్షన్, థ్రిల్లర్ నేపథ్యంలో కొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రమిది. రవిగారు ఇచ్చిన సపోర్ట్‌తో సినిమాను బాగా తీయగలిగాం. క్వాలిటీ విషయంలో నిర్మాతలు రాజీపడలేదు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి’’ అన్నారు. ‘‘కథ, కథనాలను దర్శకుడు చాలా ఆసక్తిగా రాసుకుని, అదే తరహాలో సినిమా రూపొందించాడు. సెప్టెంబర్‌లో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం’’ అన్నారు ఆలూర్ ప్రకాష్ గౌడ్. ‘‘టైటిల్ లాగే సినిమా కూడా చాలా ఫ్రెష్‌గా ఉంటుంది’’ అన్నారు రవి. శివశంకర్ మాస్టర్, ఈ చిత్రానికి కెమెరా: చిడతల నవీన్, సంగీతం: దిలీప్ బండారి, సహనిర్మాతలు: దౌలు (విష్ణుప్రియ హోటల్), చిన్న స్వామి, అభినేష్ .బి.

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 6 | | 4 | | | | 7 |
| | 1 | | 2 | | 9 | | | 5 |
| | 5 | | 3 | | 8 | | | 1 |
| 3 | 6 | | 7 | | | 8 | 1 | |
| 7 | 8 | | | | | | 9 | 2 |
| | 9 | 4 | | | 3 | | 7 | 6 |
| 6 | | | 1 | | 2 | | 4 | |
| 2 | | | 6 | | 4 | | 5 | |
| 5 | | | | 3 | | 2 | | |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 6 | 2 | 9 | 8 | 3 | 5 | 4 | 7 |
| 3 | 8 | 5 | 4 | 6 | 7 | 2 | 9 | 1 |
| 4 | 7 | 9 | 1 | 5 | 2 | 8 | 3 | 6 |
| 2 | 4 | 8 | 3 | 9 | 6 | 1 | 7 | 5 |
| 5 | 3 | 6 | 2 | 7 | 1 | 9 | 8 | 4 |
| 9 | 1 | 7 | 8 | 4 | 5 | 3 | 6 | 2 |
| 6 | 2 | 3 | 7 | 1 | 8 | 4 | 5 | 9 |
| 8 | 5 | 4 | 6 | 2 | 9 | 7 | 1 | 3 |
| 7 | 9 | 1 | 5 | 3 | 4 | 6 | 2 | 8 |




సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం
8-8-2019

# వయసు మీద పడితే?



ఫలానా వారు బాత్‌రూమ్‌లో కాలుజారి పడిపోయారనే వార్త తరచూ వింటూనే ఉంటాం. ఇలా అందరూ పడిపోవచ్చు. కానీ అలా పడేవారిలో సాధారణంగా పెద్ద వయసువారే ఎక్కువగా ఉండటం ఎప్పుడైనా గమనించారా? అరవై అయిదేళ్లు - డెబ్భయిల్లోకి వచ్చిన ప్రతి ముగ్గురిలోనూ ఒకరు ఇలాగే పడిపోతుంటారు. నిజానికి పడిపోవడం అనేది ఒక యాక్సిడెంట్. దాన్నెవరూ ఊహించలేరూ, ఆపలేరు. కానీ పెద్దవయసు వచ్చిన వారు పడిపోవడానికి కొన్ని ఆరోగ్యపరమైన కారణాలుంటాయి. తెలుసుకుంటే వాటిని నివారించవచ్చు కదా! పైగా చిన్న వయసు వారు పడిపోతే కోలుకోడానికి అవకాశాలెక్కువ. కానీ పెద్ద వయసు వారు పడిపోతే వచ్చే అనర్థాలెన్నో. ఒక్కోసారి వారు పూర్తిగా మంచం పట్టారంటే అది వారికీ, వారిని చూసుకునే ఇంట్లోని వారికీ ఇబ్బంది. అందుకే పెద్దవయసు వారు అలా పడిపోడానికి కారణాలేమిటో, ఏయే జాగ్రత్తలతో వాటిని నివారించవచ్చో తెలుసుకుంటే పెద్దలను జాగ్రత్తగా చూసుకున్నట్లూ ఉంటుంది. వారు పడిపోవడంతో వచ్చే అనర్థాలనూ, అసౌకర్యాలనూ నివారించినట్లూ ఉంటుంది. ఈ విధంగా అనేక బహుళ ప్రయోజనాలిచ్చేలా ఉపకరించేందుకూ, పెద్దలు పడిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు ఉపయోగపడే కథనమిది.

పెద్దలు పడిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత చాలా ఎక్కువ. ఒకసారి పడిపోయిన తర్వాత వారు అలా పడిపోవడానికి కారణాలను అప్పుడు తెలుసుకున్నామనుకోండి. ఆ కారణాలకు వైద్యపరంగా చికిత్స చేసి సరి చేయవచ్చేమోగానీ... ఇలా పడటం మూలంగా ఒక్కోసారి అప్పటికే కాళ్లూ, చేతులు, తుంటి వంటి కీలకమైన ఎముకలు విరగడం (ఫ్రాక్చర్స్ కావడం), తలకు పెద్ద గాయం (హెడ్ ఇంజ్యూరీ) కావడం వంటివి జరిగితే మాత్రం... దాని వల్ల కలిగే ఇబ్బంది చాలా ప్రమాదకరంగా ఉండవచ్చు. ఒక్కోసారి అది కుటుంబసభ్యులందరికీ జీవితాంతం వేధించవచ్చు. అందుకే పెద్ద వయసు వారు ఏయే సమస్యల వల్ల పడిపోతారు, వాటిని ఎలా నివారించవచ్చో తెలుసుకోవాలి.

మామూలుగా ఉన్న వారితో పోలిస్తే పెద్ద వయసు వారిలో పడిపోవడాల సంభావ్యత ఎక్కువ. వయసుతో పాటు అలా పడిపోయే ఫ్రీక్వెన్సీ పెరుగుతున్న కొద్దీ ప్రమాదాలూ, వాటి తీవ్రత కూడా పెరుగుతూ పోతుంది. సాధారణ వయసువారు మొదలుకొని, మధ్యవయస్కులు, పెద్ద వయసు వారి వరకూ అకస్మాత్తుగా కింద పడిపోవడానికి కొన్ని కారణాలేమిటో చూద్దాం.

### పెద్దలు పడిపోవడానికి కొన్ని కారణాలివే...

- వయసు పెరుగుతున్న కొద్దీ కొందరి పాదాల్లో స్పర్శజ్ఞానం తగ్గుతుంది. దాంతో తమకు తెలియకుండానే వారు పడిపోవచ్చు.
- వయసు పెరుగుతున్న కొద్దీ కండరాలూ పలచబడతాయి. నిర్దిష్టంగా చెప్పాలంటే మజిల్ మాస్ తగ్గుతుంది. ఇలా (మజిల్ మాస్ తగ్గి) కండరాలు పలచబడటం వల్ల కండరాల్లోని శక్తి కూడా క్షీణిస్తుంటుంది. పడిపోవడానికి ఇలా కండరాల శక్తి తగ్గిపోవడమూ ఒక కారణం కావచ్చు.
- వయసు పెరుగుతున్న కొద్దీ కొన్ని కీళ్లలో ముఖ్యంగా మోకాలు, చీలమండ, తుంటి ఎముకల కీళ్లలో కొన్ని మార్పులు వస్తుంటాయి. ఆ మార్పుల కారణంగా కూడా పడిపోవడం జరగవచ్చు.
- వయసు పెరుగుతున్న కొద్దీ చూపు మందగించడం, వినికిడి శక్తి క్షీణించడం వంటివి చాలా సాధారణం. ఒక్కోసారి పెద్దవారు అకస్మాత్తుగా పడిపోడానికి ఈ అంశాలు కూడా దోహదం చేస్తుంటాయి.



- మీరు జాగ్రత్తగా గమనిస్తే వయసు పెరుగుతున్న కొద్దీ వారు నిటారుగా ఉండలేదు. వాస్తవానికి పెద్దవయసు వారు పడిపోకుండా ఉండేందుకే ప్రకృతి వారిని ఇలా ముందుకు ఒంగిపోయేలా చేస్తుంది. దాంతో వారి గరిమనాభి (సెంటర్ ఆఫ్ గ్రావిటీ) భూమికి చాలా దగ్గరగా ఉండటం వల్ల పడిపోవడానికి అవకాశాలు తగ్గడం కోసమే ప్రకృతి వారిని ముందుకు వంగిపోయేలా చేస్తుంది. ఇది సాధారణంగా జరిగే పరిణామం. అయితే వారిలా ముందుకు వంగిపోవడమే ఒక్కోసారి పడిపోవడానికి కారణం కావచ్చు.
- పెద్ద వయసు వచ్చాక గుండె జబ్బులనీ లేదా ఇతరత్రా ఆరోగ్య సమస్యలంటూ వారు అనేక రకాల మందులు వాడాల్సి వస్తుంటుంది. ఒక్కోసారి ఆ మందుల ప్రభావం కారణంగా కూడా పడిపోయే ప్రమాదం ఉంది.
- కొందరిలో నరాలకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఇలా నరాల సమస్యలున్నప్పుడు పడిపోయే అవకాశాలు మరింత ఎక్కువ. అయితే ఒక్క విషయం. కొందరిలో నరాలకు సంబంధించిన కారణాలేమీ లేకుండానే ముందుకో వెనక్కో పడిపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా మొబైల్‌లో మాట్లాడుతూ నడుస్తున్నప్పుడు ఇలాంటి ప్రమాదం జరగవచ్చు. అందుకే మొబైల్‌లో మాట్లాడుతూ నడవకూడదు. పెద్ద వయసు వారికే కాదు... ఈ నియమం అందరికీ వర్తిస్తుంది.

### వృద్ధాప్యంలో అకస్మాత్తుగా పడిపోవడానికి మరికొన్ని వైద్యపరమైన కారణాలు



- **సింకోప్:** కొంతమంది కొద్దిసేపు అకస్మాత్తుగా స్పృహ కోల్పోయినట్లుగా అయిపోతారు. కళ్లు తిరుగుతాయి. చూపు తాత్కాలికంగా మసకబారుతుంది. ముఖంలో రక్తపుచుక్క లేనట్లుగా పాలిపోతారు. శరీరం చల్లబడి, ఒళ్లంతా చెమటలు పట్టవచ్చు. ఇలాంటి కండిషన్లతో వ్యక్తులు అకస్మాత్తుగా పడిపోయి, ఎముకలు విరగడం, తలకు గాయం కావడం వంటి ప్రమాదం జరగవచ్చు. ఒక్కోసారి మూత్రవిసర్జనపై నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంది. ఇలా అకస్మాత్తుగా తాత్కాలికంగా స్పృహ కోల్పోడాన్ని సింకోప్ అంటారు. దీనికి అనేక అంశాలు కారణం కావచ్చు. తీవ్రమైన మానసిక ఒత్తిడి, మన మనసుకు ఏమాత్రం నచ్చని విషయాలను చూడటం (ఉదాహరణకు ఎవరైనా గాయపడటం, ఎవరికైనా తీవ్రమైన రక్తస్రావం అవుతుండటం, తీవ్రమైన నొప్పి/వేదనతో బాధపడటం వంటి అన్‌ప్లెజెంట్ విజువల్ స్టిములై వల్ల) ఇలా జరగవచ్చు.
- **పోష్చరల్ హైపోటెన్షన్ (లో బీపీ):** ఇది అకస్మాత్తుగా బీపీ పడిపోయే పరిస్థితి. సాధారణంగా దీనికి ముందు శరీరంలోని ద్రవాలు, ఖనిజాల పాళ్లు తగ్గడం, ఏదైనా మందు/ఔషధం తీసుకోవడం వల్ల ఇలా జరగవచ్చు. ఒక్కోసారి మనం కూర్చున్న స్థితి నుంచి అకస్మాత్తుగా పైకి లేవడం లేదా ఉన్నట్టుండి పక్కపై నుంచి లేవడం జరిగినప్పుడు కూడా బీపీ అకస్మాత్తుగా పడిపోవచ్చు. ఇలా పడిపోవడం అన్నది 20 హెచ్‌జీ/ఎంఎం కంటే ఎక్కువగా పడిపోతే (అంటే బీపీ అకస్మాత్తుగా తగ్గితే) మెదడుకు చేరాల్సిన రక్తం పరిమాణం ఒకేసారి తగ్గిపోతుంది. దాంతో ఇలా పడిపోవడం జరుగుతుంది.



- నిలబడి మూత్రవిసర్జన చేసే సమయంలో లేదా అకస్మాత్తుగా దగ్గు వచ్చినప్పుడు ఒక్కోసారి బీపీ అకస్మాత్తుగా తగ్గిపోయి పడిపోయే ప్రమాదం ఉంది.
- **వర్టిగో :** ఒక్కోసారి కళ్లు తిరిగినట్లుగా అయిపోయి ఒళ్లు స్వాధీనం తప్పి పడిపోవచ్చు. ఇది సాధారణంగా లోపలిచెవి లేదా బ్రెయిన్ స్టెమ్‌లో ఉన్న వ్యాధుల వల్ల ఇలా జరగవచ్చు.
- **ట్రాన్సియెంట్ ఇస్కిమిక్ ఎటాక్ (టీఐఏ):** ఒక్కోసారి కొందరిలో చాలా తక్కువ తీవ్రతతో పక్షవాతం వచ్చి, మళ్లీ వెంటనే సాధారణ స్థితికి వచ్చేస్తారు. ఇలాంటి కండిషన్‌ను వైద్య పరిభాషలో ట్రాన్సియెంట్ ఇస్కిమిక్ ఎటాక్ అంటారు. అకస్మాత్తుగా పడటడానికి ఇది కూడా ఒక కారణం. ఇలాంటి సందర్భాల్లో కొందరిలో సరిగా మాట రాకపోవడం, మాటలు ముద్దగా రావడం, కాళ్లూ, చేతులు తాత్కాలికంగా బలహీనంగా మారడం జరగవచ్చు.
- **ఫిట్స్ :** కొందరిలో ఒక్కోసారి ఫిట్స్ రావడం / స్పృహ కోల్పోవడం / శరీరమంతా కుదుపునకు (జెర్క్) లోనుకావడం వల్ల పడిపోవడం జరగవచ్చు.
- **పార్కిన్‌సన్ డిసీజ్ :** ఈ వ్యాధి ఉన్నవారిలో పడిపోవడం అన్నది శరీరం సరైన బ్యాలెన్స్ లేకపోవడం వల్ల జరుగుతుంది. ఈ వ్యాధి ఉన్నవారిలో శరీర కదలికలు మందగించడం వల్ల పడిపోవడం జరగవచ్చు.
- వెన్నెముక / నరాలు / కండరాల వ్యాధుల వల్ల ఒక్కోసారి కాళ్లూ చేతులు బలహీనమైపోయి పడిపోవచ్చు.
- మన శరీరంలోని సోడియమ్, పొటాషియమ్ వంటి లవణాల పాళ్లు, చక్కెర పాళ్లు తగ్గిపోయి పడిపోయే ప్రమాదం ఉంది.
- చాలా అరుదుగా ఒక్కోసారి మెదడులో కణుతులు, మతిమరపు, సైకోసిస్ వంటి అంశాలు కూడా పడిపోవడానికి దోహదం చేయవచ్చు.

### ఇవి మరికొన్ని జాగ్రత్తలు...



- పడిపోవడాన్ని నివారించే నాన్‌స్టిక్ మ్యాట్స్ వాడాలి.
- ఘర్షణ (ఫ్రిక్షన్) ఎక్కువగా ఉంటే ఫ్లోరింగ్ వేయించాలి. టాయిలెట్స్, బాత్‌రూమ్‌లలో కూడా జారిపడేందుకు ఆస్కారం ఉన్న పూర్తిగా నున్నగా ఉండే టెయిల్స్‌కు బదులు మంచిగా నిలబడటానికి పట్టునిచ్చే తరహా టైల్స్ వాడాలి.
- కాలుజారడానికి ఆస్కారం ఇవ్వకుండా ఉండేందుకు ఫ్రిక్షన్‌ను పెంచే కార్పెట్స్ పరచుకోవాలి.
- గదిలో ధారాళంగా మంచి వెలుతురు / గాలి వచ్చేలా చేసుకోవాలి.
- టాయిలెట్స్, బాత్‌రూమ్స్‌లో మంచి పట్టు ఉండటానికి వీలుగా హ్యాండ్ రెయిల్స్ అమర్చుకోవడం, బాత్‌రూమ్ బయట కాలు జారకుండా ఉండే మ్యాట్స్ వాడటం వంటివి చేయాలి.
- మరీ అవసరమైతే తప్ప ఎక్కడా ఎత్తులకు ఎక్కకుండా జాగ్రత్త తీసుకోవాలి. అలాగే ఎత్తుల నుంచి దిగేటప్పుడు పడిపోవాడానికి ఆస్కారం ఎక్కువ. కాబట్టి అలా దిగాల్సి వచ్చినప్పుడు మెట్ల పక్కన ఉండే పట్టు (రెయిలింగ్స్) పట్టుకుని జాగ్రత్తగా దిగాలి.

### పడిపోయే అవకాశాలు ఎవరెవరిలో ఎక్కువ...

- రెండు కాళ్ల మధ్య తక్కువ ఖాళీ ఉంచుతూ నడిచే వారు. నడిచే సమయంలో అడుగులు చిన్నవి చిన్నవిగా వేసేవారు.
- నిల్చున్నప్పుడు రెండు కాళ్ల మధ్య చాలా తక్కువగా ఖాళీ ఉంచేవారు.
- నడిచే సమయంలో కళ్లు మూసుకునేలా ముఖం ఎక్కువగా రుద్దుకునేవారు.
- అకస్మాత్తుగా పడిపోవడాన్ని నివారించడం ఇలా...
- గతంలో అకస్మాత్తుగా పడిపోయిన సంఘటనలు జరిగినవారు లేదా అలాంటి వైద్యచరిత్ర (మెడికల్ హిస్టరీ) ఉన్నవారు ముందుగా తాము అలా పడిపోవడానికి గల కారణాన్ని తెలుసుకునేందుకు తగిన వైద్యపరీక్షలు చేయించుకోవాలి. సమస్యను గుర్తించి అందుకు అవసరమైన మందులు వాడాలి.
- వైద్యపరమైన కారణాలు కాకుండా... అలా పడిపోవడానికి నిర్దిష్టమైన కారణాలను తెలుసుకొని... వాటిని సరిదిద్దుకోవాలి. అంటే ఉదాహరణకు ... పడుకున్నవారు అకస్మాత్తుగా లేవడం వల్ల పడిపోయినా / కూర్చుని ఉన్నవారు అకస్మాత్తుగా లేచి నిల్చున్నప్పుడు పడిపోవడం జరిగినా, ముఖ్యంగా మూత్ర విసర్జన చేసిన తర్వాత... అలా వెంటనే ఠక్కుమంటూ కదలడం / లేవడం సరికాదు. ఒక్కోసారి నిల్చుని మూత్ర విసర్జన చేసే వారు పడిపోతున్నట్లుగా అనిపిస్తే... అలాంటివారు కూర్చుని మూత్ర విసర్జన చేయడం అలవాటు చేసుకోవాలి.
- ఇక పడుకున్న వారు లేవాల్సి వస్తే పక్కలో మెల్లగా ఒక పక్కకు ఒరుగుతూ లేచి కూర్చుని... ఆ తర్వాత మెల్లగా నించోవాలి. అలాగే కూర్చున్న వారు కూడా ఒకేసారి కుర్చీలోంచి లేవకుండా... మెల్లగా లేని నిల్చోవాలి.
- అకస్మాత్తుగా పడిపోవడానికి నరాలకు సంబంధించిన (న్యూరలాజికల్) కారణాలు ఏవైనా ఉంటే వాటిని వైద్యపరంగా లేదా ఇతరత్రా సరిదిద్దుకోవాలి.
- **ఉపకరణాలు వాడటం:** అకస్మాత్తుగా పడిపోయే వారు తమకు అవసరమైన ఉపకరణం... అంటే వాకర్ / చేతికర్ర (వాకింగ్ స్టిక్) / కళ్లజోడు వంటి ఉపకరణాలు వాడటం అవసరం. అవి లేకపోతే పడిపోయే అవకాశాలు ఎక్కువ. అందుకే వాటి అవసరం ఉన్నవారు వాటిని విస్మరించకూడదు.
- మహిళలు హైహీల్స్ వాడటం సరికాదు. దానికి బదులు తమకు సురక్షితంగా ఉంటూ నచ్చే పాదరక్షలు ధరించాలి.
- కాలి కండరాల బలాన్ని పెంచే వ్యాయామాలు, వాకింగ్ వంటివి చేయడం అవసరం.

ఇలాంటి కొన్ని జాగ్రత్తలతో అకస్మాత్తుగా పడిపోయే ప్రమాదాలను నివారించుకోవచ్చు.



**డాక్టర్ బి. చంద్రశేఖర్ రెడ్డి,**
చీఫ్ న్యూరాలజిస్ట్, సిటీ న్యూరో సెంటర్,
రోడ్ నెం. 12, బంజారాహిల్స్,
హైదరాబాద్

## హోమియో కౌన్సెలింగ్స్

### పేను కొరుకుడుకు చికిత్స ఉందా?

**మా అమ్మాయి వయసు 24 ఏళ్లు. ఈమధ్య ఒకేదగ్గర వెంట్రుకలు రాలిపోతున్నాయి. అందరూ పేనుకొరుకుడు అంటున్నారు. హోమియోలో దీనికి పరిష్కారం ఉందా?**
**– శ్రీలక్ష్మి, యాప్రాల్**

పేనుకొరుకుడు సమస్యను వైద్యపరిభాషలో అలోపేషియా అంటారు. ఈ కండిషన్‌లో ఒక నిర్ణీత స్థలంలో వెంట్రుకలు పూర్తిగా రాలిపోయి, నున్నగా మారుతుంది. శరీరం తనను తాను రక్షించుకోగలిగే శక్తిని కోల్పోయినప్పుడు జుట్టు రాలిపోతుంటుంది. అలాంటప్పుడు చాలాసార్లు తలపై అక్కడక్కడ ప్యాచ్‌లలాగా ఏర్పడతాయి. ఇది ఒక ఆటో ఇమ్యూన్ డిజార్డర్. అంటే తన సొంత వ్యాధి నిరోధక శక్తి తన వెంట్రుకలపైనే ప్రతికూలంగా పనిచేయడం వల్ల వచ్చే సమస్య అన్నమాట. ఇది తలలోగానీ, గడ్డంలోగానీ, మీసాలలోగాని ఇది రావచ్చు. ఇది అంటు వ్యాధి కాదు. సాధారణంగా 60 ఏళ్లు పైబడిన వారిలో ఈ సమస్య కనిపించదు.

**కారణాలు:** ● మానసిక ఆందోళన ● థైరాయిడ్ సమస్య ● డయాబెటిస్, బీపీ వంటి సమస్య ఉన్న వాళ్లలో ఇది ఎక్కువగా కనిపిస్తుంటుంది ● వంశపారంపర్యంగా ● కవలల్లో ఒకరికి ఉంటే మరొకరికి వచ్చే అవకాశం ఉంటుంది.

**లక్షణాలు:** ● తలపై మొత్తం జుట్టు ఊడిపోయి, బట్టతల లక్షణాలు కనిపిస్తాయి. ● తలపై అక్కడక్కడ గుండ్రంగా ప్యాచ్‌లలా జుట్టు ఊడిపోతుంది ● సాధారణంగా గుండ్రగా లేదా అండాకృతితో ఈ ప్యాచ్‌లు ఉంటాయి.

**నిర్ధారణ:** ఈ సమస్య నిర్దిష్టంగా ఏ కారణం వల్ల వచ్చిందో తెలుసుకోవాలి. ట్రైకోస్కోపీ, బయాప్సీ, హిస్టలాజిక్ పరీక్షలు, పిగ్మెంట్ ఇన్‌కాంటినెన్స్ వంటివే మరికొన్ని పరీక్షలు.

**చికిత్స:** పేనుకొరుకుడు సమస్యకు హోమియోలో మంచిమందులు అందుబాటులో ఉన్నాయి. వైద్యులు వ్యాధి కారణాలు, లక్షణాలను పరిగణనలోకి తీసుకొని మందులను సూచిస్తారు.
దీనికి హోమియోలో యాసిడ్ ఫ్లోర్, సల్ఫర్, ఫాస్ఫరస్, గ్రాఫైటిస్, సెలీనియమ్, సోరినమ్, తుజా వంటి మందులను డాక్టర్ల పర్యవేక్షణలో వాడాల్సి ఉంటుంది.





**డా॥ శ్రీకాంత్ మొర్లావర్,**
సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్,
హైదరాబాద్

### బాబు ఇంకా పక్క తడుపుతున్నాడు



**మా బాబు వయసు 13 ఏళ్లు. చిన్న వయసు నుంచి రాత్రిళ్లు నిద్రలో పక్కతడిపే అలవాటు ఉంది. ఇప్పటికీ ఇది ఆగలేదు. ఈ సమస్య వల్ల బయటకు ఎక్కడికైనా వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. హోమియో చికిత్స ద్వారా ఈ సమస్యను పూర్తిగా తగ్గించే అవకాశం ఉందా?**
**– ఎమ్‌డీ. రమీజా, గుంటూరు**

మీ బాబు రాత్రుళ్లు నిద్రలో పక్క తడిపే ఈ అలవాటును వైద్య పరిభాషలో నాక్చర్నల్ ఎన్యురెసిస్ అంటారు. ఈ సమస్యతో బాధపడే పిల్లలు, వారి తల్లిదండ్రులు చాలా బాధపడతారు. ఈ సమస్య చిన్న పిల్లల్లోనే గాక కొంతమంది పెద్దల్లోనూ ఉంటుంది. సాధారణంగా పిల్లల్లో రాత్రి సమయంలో మూత్రవిసర్జనపై అదుపు అన్నది రెండు నుంచి ఐదేళ్ల వయసులో వస్తుంటుంది. కానీ ఐదు శాతం మంది పిల్లల్లో పదేళ్ల వయసు తర్వాత కూడా మూత్రవిసర్జనపై అదుపు సాధించడం జరగకపోవచ్చు. ఐదేళ్ల వయసు తర్వాత కూడా తరచూ పక్కతడిపే అలవాటు ఉండటాన్ని ప్రైమరీ ఎన్యురెసిస్ అంటారు. సాధారణంగా ఇది కొన్నాళ్లలోనే తగ్గిపోతుంది. ఎదుగుదల సమయంలో వచ్చే లోపం వల్ల ఇలా జరుగుతుండవచ్చు. అయితే కొంతమంది పిల్లలు పక్కతడపడం మానివేశాక, మళ్లీ ఆర్నెల్ల తర్వాత సమస్య తిరగబెట్టవచ్చు. ఇంతకుముందు పక్కతడపకుండా ప్రస్తుతం మళ్లీ పక్కతడపడం మొదలుపెట్టినట్లయితే ఈ పరిస్థితిని 'సెకండరీ ఎన్యురెసిస్' అంటారు.

**కారణాలు:** నాడీవ్యవస్థ ఎదుగుదల లోపాలు, జన్యుపరమైన సమస్యలు (ముఖ్యంగా డౌన్‌సిండ్రోమ్), ఇన్ఫెక్షన్లు, మూత్రాశయం సమస్యలు, కొందరిలో వంశపారంపర్య కారణాల వల్ల ఈ సమస్య కనిపిస్తుండవచ్చు.
ఇంకొంతమంది పిల్లల్లో కండరాలు ఎక్కువసార్లు అనియంత్రితంగా సంకోచం చెందడం వంటి కారణాలతోనూ ఈ సమస్య కనిపించవచ్చు. టైప్-1 డయాబెటిస్, మలబద్ధకం వల్ల మూత్రాశయంపై ఒత్తిడి పడటం వల్ల, కెఫిన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా ఈ సమస్య రావచ్చు. కొంతమంది పిల్లల్లో మానసిక ఒత్తిడి, భయం వల్ల కూడా రాత్రివేళలో తమకు తెలియకుండానే మూత్రవిసర్జన జరిగిపోవచ్చు.

**చికిత్స:** పక్క తడిపే పిల్లలను తిట్టడం, వాళ్లకు శిక్షలు విధించడం వల్ల పిల్లలు మరింత కుంగిపోయి సమస్య మరింత జటిలం అవుతుంది. ఇలా పిల్లలను మందలించడం వల్ల ప్రయోజనం చేకూరదు సరికదా... కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే ఎట్టిపరిస్థితుల్లోనూ పిల్లలను దండించకూడదు. హోమియో చికిత్సతో పిల్లల్లో ఈ అలవాటు పూర్తిగా మాన్పించడానికి అవకాశం ఉంది. కాబట్టి మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.



**డాక్టర్ కె. శ్రీనివాస్ గుప్తా,**
ఎండీ (హోమియో),
స్టార్ హోమియోపతి, హైదరాబాద్

## ఫ్యామిలీ డాక్టర్

### బాబుకు ఆటిజమ్... చికిత్స సూచించండి

**మా బాబుకు మూడేళ్లు. ఆటిజమ్ ఉన్నట్లు డాక్టర్లు నిర్ధారణ చేశారు. హోమియోలో మంచి చికిత్స సూచించండి.**
**– డి. రాగిణి, వరంగల్**

ఆటిజమ్ ఇటీవల పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తున్న వ్యాధి. దీనిలో చాలా స్థాయిలు, ఎన్నో లక్షణాలు ఉంటాయి. కాబట్టి దీనితో బాధపడేవారందరిలోనూ లక్షణాలు ఒకేలా ఉండకపోవచ్చు. ఆటిస్టిక్ డిజార్డర్ అనేది ఆటిజంలో ఎక్కువగా కనిపించే సమస్య. మగపిల్లల్లో ఎక్కువ. రెట్స్ డిజార్డర్ అనే అరుదైన రకం ఆడపిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంది. చైల్డ్‌హుడ్ డిసింటిగ్రేటెడ్ డిజార్డర్ అనేది ఆటజమ్‌లో ఒక తీవ్రమైన సమస్య.యాస్పర్జస్ డిజార్డర్‌లో పిల్లల్లో తెలివితేటలు ఎక్కువగా ఉండి, వారు తదేకంగా చేసే పనులలో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. ఇలా దీనిలో చాలా రకాలు ఉంటాయి. ఇది మెదడు సరిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల వస్తుంది. ఈ వ్యాధికి నిర్దిష్టమైన ఒకే కారణం గాక అనేక అంశాలు దోహదపడవచ్చు. మెదడు ఎదుగుదలకు తోడ్పడే జన్యువులు, అందులో స్రవించే సెరటోనిన్, డోపమిన్ వంటి రసాయనాలు ఇలా ఎన్నో అంశాలు దీనికి కారణం కావచ్చు. గర్భిణిగా ఉన్నప్పుడు తల్లి తీవ్రమైన ఉద్వేగాలకు లోనుకావడం, పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడపలేకపోవడం వల్ల కూడా ఇది రావచ్చు. పిల్లల్లో దీన్ని గుర్తించడానికి తోడ్పడే అంశాలు... ● అకారణంగా ఎప్పుడూ ఏడుస్తూ ఉండటం ● నలుగురిలో కలవడలేకపోవడం ● ఆటవస్తువుల్లో ఏదో ఒక భాగంపైనే దృష్టి కేంద్రీకరించడం ● వయసుకు తగినంత మానసిక పరిపక్వత లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఆటిజమ్ ఉన్న పిల్లలకు లక్షణాలను బట్టి చికిత్స ప్రారంభించాల్సి ఉంటుంది. మాటలు సరిగా రానివారిని స్పీచ్ థెరపీ ఉపయోగకరంగా ఉంటుంది. బిహేవియర్ థెరపీ కూడా దీనితో బాధపడే పిల్లల్లో మార్పు తీసుకురావడానికి సహాయపడుతుంది. పిల్లల వ్యక్తిగత లక్షణాలు బట్టి, కుటుంబ, సామాజిక పరిస్థితులను అవగాహనలోకి తీసుకొని, మూలకారణాలను అన్వేషించి చికిత్స చేయాల్సి ఉంటుంది. పిల్లల్లో ఆటిజమ్ వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స వ్యవధి ఉంటుంది. సరైన హోమియోపతి మందులను అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో వాడితే పిల్లలు మామూలుగా అయ్యేందుకు లేదా గరిష్ఠస్థాయికి మెరుగుపడేందుకు అవకాశం ఉంటుంది.





**డాక్టర్ ఎ.ఎం. రెడ్డి, సీఎండీ,**
పాజిటివ్ హోమియోపతి, హైదరాబాద్

సాక్షి భవిత

స్పర్థయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

గురువారం
8-8-2019


# విద్య, ఉద్యోగ సమాచారం

## ఎస్ఎస్‌సీ-1350 పోస్టులు

వివిధ కేంద్ర సర్వీసుల్లో 1350 సెలక్షన్ పోస్టులు(ఫేజ్ 7/2019) భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ)దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** ఎంటీఎస్, సైంటిఫిక్ అసిస్టెంట్, సీనియర్ ప్రిజర్వేషన్ అసిస్టెంట్, టెక్నీషియన్, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్, స్టాక్‌మెన్, ఫార్మసిస్ట్, మెకానిక్ తదితర పోస్టులున్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి పదోతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇతర ఉన్నత విద్యార్హతలు ఉన్నవారు అర్హులు.
- **వయసు:** పోస్టులను బట్టి 18–30 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; పీడబ్ల్యూడీలకు పదేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ రాత పరీక్ష, స్కిల్‌టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పరీక్ష తేదీలు:** 2019, అక్టోబర్ 14 నుంచి 18 వరకు ఉంటాయి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మెన్, మహిళలకు ఫీజు లేదు.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 31, 2019.
- **ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** సెప్టెంబర్ 4, 2019.
- **వెబ్‌సైట్:** https://ssc.nic.in

## ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ (2) ఎగ్జామ్-2019

నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), నేవల్ అకాడమీ (ఎన్ఏ)లలో ప్రవేశానికి ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ(2) ఎగ్జామ్-2019 ప్రకటనను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) విడుదల చేసింది. అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

- **ఖాళీలు:** 415
1. నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ): 370
2. నేవల్ అకాడమీ (10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్): 45.
- **అర్హత:** ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత.
- **వయసు:** 2001, జనవరి 2 నుంచి 2004 జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పరీక్షతేదీ:** నవంబర్ 17, 2019.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100.
- **దరఖాస్తుకు చివరితేదీ:** సెప్టెంబర్ 3, 2019.
- **ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** సెప్టెంబర్ 3, 2019.
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

## ఎన్‌టీపీసీ-203 పోస్టులు

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌టీపీసీఎల్)..దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రాజెక్టు క్షేత్రాల్లో ఖాళీగా ఉన్న 203 ఇంజనీర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఎలక్ట్రికల్–75, మెకానికల్–76, ఎలక్ట్రానిక్స్–26, ఇన్‌స్ట్రుమెంటేషన్–26.
- **అర్హత:** సంబంధిత విభాగాల్లో గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత. నిర్దిష్ట అనుభవం ఉండాలి.
- **వయసు:** 30 ఏళ్లకు మించకూడదు.
- **ఎంపిక:** ఆన్‌లైన్ రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.300 (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు లేదు).
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 26, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.ntpc.co.in

## జర్నలిజం కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని రచన జర్నలిజం కళాశాల రెగ్యులర్, కరస్పాండెన్స్ విధానం ద్వారా జర్నలిజంలో పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** పీజీ డిప్లొమా కోర్సుల్లో చేరడానికి ఏదైనా డిగ్రీ, సర్టిఫికెట్ కోర్సుల్లో చేరడానికి పదోతరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.200 డీడీని రచన జర్నలిజం కళాశాల పేరుమీద తీసి సంబంధిత అడ్రస్‌కు పంపాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 30, 2019
- **ఫోన్ నెంబర్లు:** 040–23261335 లేదా 9959640797.



# ఐఐటీలకు మరో మార్గం..

# జామ్-2020

## హయ్యర్ ఎడ్యుకేషన్

**ఐఐటీల్లో ఎంఎస్సీ, జాయింట్ ఎంఎస్సీ-పీహెచ్‌డీ, ఎంఎస్సీ-పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ చదవాలనుకుంటున్నారా.. ఐఐఎస్సీలో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో చేరాలనుందా.. అయితే మీ లక్ష్యం.. జాయింట్ ఎంట్రెన్స్ టెస్ట్ ఫర్ ఎంఎస్సీ (జామ్)నే కావాలి..! ఇందులో సత్తా చాటిన విద్యార్థులకు ప్రతిష్టాత్మక ఐఐఎస్సీ, ఐఐటీల్లో ఉన్నతవిద్య చదవాలనే కల సాకారమవుతుంది. తాజాగా జామ్-2020 ప్రవేశ ప్రక్రియకు సంబంధించిన ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో జామ్ 2020 ముఖ్యతేదీలు, ప్రవేశ ప్రక్రియ, పరీక్ష తీరుతెన్నులపై కథనం...**

» జామ్ స్కోర్‌తో ఐఐటీలు, ఐఐఎస్సీలో ఎంఎస్సీ, పీహెచ్‌డీల్లో ప్రవేశం
» వెలువడిన జామ్ 2020 షెడ్యూల్ » సెప్టెంబర్ 5 నుంచి దరఖాస్తులు ప్రారంభం

**జామ్** జాతీయస్థాయిలో జరిగే పరీక్ష. జామ్ 2020ను ఐఐటీ కాన్పూర్ నిర్వహించనుంది. ఇందులో సాధించిన స్కోరు ఆధారంగా దేశంలోని 23 ఐఐటీలతోపాటు ప్రతిష్టాత్మక ఐఐఎస్సీలో ప్రవేశం లభిస్తుంది. వీటితోపాటు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీలు), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్‌లు), షిబ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఈఎస్‌టీ), పంజాబ్‌లోని ఎస్ఎల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ తదితరాల్లో జామ్ స్కోరు ఆధారంగా ప్రవేశాలు కల్పించే అవకాశముంది.

### కోర్సులు

- **ఐఐటీలు ఆఫర్‌చేస్తున్న కోర్సులు:** ఎంఎస్సీ (రెండేళ్లు), జాయింట్ ఎంఎస్సీ-పీహెచ్‌డీ, ఎంఎస్సీ-పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ, ఎంఎస్సీ-ఎంఎస్(రీసెర్చ్)/పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ, పోస్ట్ బ్యాచిలర్ డిగ్రీ ప్రోగ్రామ్స్.
- **ఐఐఎస్సీ:** ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్.

### అర్హత

- జనరల్, ఓబీసీ అభ్యర్థులకు సంబంధిత డిగ్రీలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.

### టెస్ట్ పేపర్లు

బయోటెక్నాలజీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, జియాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్, బయలాజికల్ సైన్సెస్.

### పరీక్ష విధానం

జామ్‌ను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ప్రశ్నపత్రాలు ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. ప్రశ్నపత్రంలో మూడు సెక్షన్లు.. సెక్షన్-ఏ, సెక్షన్-బీ, సెక్షన్-సీ ఉంటాయి. సెక్షన్ ఏలో 30 ప్రశ్నలు, సెక్షన్ బీలో 10 ప్రశ్నలు, సెక్షన్ సీలో 20 ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 60 ప్రశ్నలతో 100 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష వ్యవధి 3 గంటలు. సెక్షన్ ఏలో ఒక మార్కు ప్రశ్నల్లో ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 1/3 మార్కుల్లో కోత ఉంటుంది. అలాగే సెక్షన్ ఏలోనే 2 మార్కుల ప్రశ్నలకు ప్రతి సరైన సమాధానానికి 2 మార్కులు లభిస్తే.. ప్రతి తప్పు సమాధానానికి 2/3 మార్కుల్లో కోత ఉంటుంది. సెక్షన్ బీలో నెగిటివ్ మార్కింగ్ విధానంలేదు. ప్రతి సరైన సమాధానానికి 2 మార్కులు కేటాయిస్తారు. సెక్షన్ సీలో 10 ఒక మార్కు ప్రశ్నలు, మరో పది 2 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. ఈ సెక్షన్‌లో కూడా నెగిటివ్ మార్కింగ్ విధానంలేదు. జామ్ పరీక్షలో మూడు రకాల ప్రశ్నలు అడుగుతారు. అవి.. మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్స్ (ఎంసీక్యూ), మల్టిపుల్ సెలక్షన్ క్వశ్చన్స్ (ఎంఎస్‌క్యూ), న్యూమరికల్ ఆన్సర్ టైప్ క్వశ్చన్స్ (ఎన్ఏటీ).

### ప్రిపరేషన్ టిప్స్

జామ్ జాతీయస్థాయిలో జరిగే పరీక్ష. ప్రముఖ విద్యాసంస్థలైన ఐఐటీలు, ఐఐఎస్సీలో ఎంఎస్సీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి గట్టి పోటీ ఉంటుంది. కాబట్టి ఈ పరీక్షలో విజయం సాధించాలంటే.. సాధ్యమైనంత ముందుగానే ప్రిపరేషన్ ప్రారంభించాలి. ప్రతిరోజూ సిలబస్‌లోని అంశాలను అధ్యయనం చేస్తూ.. ప్రశ్నలను ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది. ప్రతి సబ్జెక్టుకు, అంశానికి ప్రత్యేకంగా సమయం కేటాయించుకొని చదివేలా టైమ్‌టేబుల్ రూపొందించుకోవాలి. ఆయా అంశాలను చదువుతూ షార్ట్ నోట్స్, లాంగ్ నోట్స్ సిద్ధం చేసుకోవాలి. ఇది పరీక్ష ముందు వేగంగా రివిజన్ చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. అదేవిధంగా జామ్ అధికారిక సైట్‌లో పేర్కొన్న సిలబస్‌ను, పాత ప్రశ్నపత్రాలను పరిశీలించి.. ముఖ్యమైన, ఎక్కువ వెయిటేజీ ఉన్న టాపిక్స్‌కు అధిక సమయం కేటాయించుకోవాలి. పరీక్ష కోణంలో ప్రాధాన్య అంశాల జాబితా రాసుకోవాలి. వాటిని రోజూ చదువుతుండాలి. ఆయా టాపిక్స్‌పై అందుబాటులో ఉన్న ప్రతి ప్రశ్నను వేగంగా సాధించేలా నిత్యం ప్రాక్టీస్ చేస్తుండాలి. జామ్ పరీక్షలో విజయానికి ఏకైక మార్గం ప్రాక్టీస్ మాత్రమే అని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి పాత పేపర్లు, మోడల్ పేపర్లను సేకరించుకొని నిత్యం ప్రాక్టీస్ చేయడం అలవాటు చేసుకోవాలి.

### కౌన్సెలింగ్

జామ్‌లో క్వాలిఫై అయిన అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో కామన్ అడ్మిషన్ పోర్టల్ (జేఓఏపీఎస్) ద్వారా కౌన్సెలింగ్‌లో పాల్గొనాలి. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

### జామ్ 2019 కటాఫ్ మార్కులు

| సబ్జెక్టు | జనరల్ | ఓబీసీ (ఎన్‌సీఎల్) | ఎస్సీ/ఎస్టీ/ పీడబ్ల్యూడీ |
|---|---|---|---|
| మ్యాథమెటిక్స్ | 22.96 | 20.66 | 11.48 |
| కెమిస్ట్రీ | 20.31 | 18.28 | 10.15 |
| ఫిజిక్స్ | 24.99 | 22.49 | 12.49 |

### జామ్ షెడ్యూల్




- జామ్‌ను 2020, ఫిబ్రవరి 9న రెండు సెషన్స్‌లో నిర్వహిస్తారు.
- **సెషన్ 1:** ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు.
- **టెస్ట్ పేపర్లు:** బయోటెక్నాలజీ(బీటీ), ఫిజిక్స్(పీహెచ్), మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్(ఎంఎస్).
- **సెషన్ 2:** మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు.
- **టెస్ట్ పేపర్లు:** మ్యాథమెటిక్స్ (ఎంఏ), కెమిస్ట్రీ (సీవై), జియాలజీ (జీజీ).

#### దరఖాస్తు ప్రక్రియ

- ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** సెప్టెంబర్ 5, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబర్ 8, 2019.
- **జామ్ 2020 పరీక్ష తేదీ:** ఫిబ్రవరి 9, 2020.
- **ఫలితాల వెల్లడి:** మార్చి 20, 2020.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం.

#### దరఖాస్తు ఫీజు

- **జనరల్, ఓబీసీ కేటగిరీ:** రూ.1500, రెండు సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకుంటే రూ.2100.
- **ఎస్సీ,ఎస్టీ, పీడబ్ల్యూడీ కేటగిరీ:** రూ.750, రెండు సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకుంటే రూ.1050.
- **మహిళలు:** రూ.750, రెండు సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకుంటే 1050.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://jam.iitk.ac.in

# వ్యవసాయం-వనరుల వినియోగం

## గ్రూప్స్ ప్రత్యేకం
### జనరల్ ఎస్సే

### పరిచయం

భారతదేశ వ్యవసాయ రంగంలో అధిక శాతం మంది చిన్న, సన్నకారు రైతులే. వీరి జీవనోపాధిలో వ్యవసాయ, అనుబంధ రంగాల పాత్ర కీలకమైంది. పేదరిక నిర్మూలన, సమ్మిళిత వృద్ధి తదితర లక్ష్యాల సాధనకు వ్యవసాయ రంగ కార్యకలాపాలను సుస్థిరాభివృద్ధి లక్ష్యాలతో సంఘటితం చేయాల్సిన అవసరముంది. వ్యవసాయ రంగంలో సుస్థిరత సాధనకు చిన్న కమతాల సాగులో వనరుల సమర్థతపై భారత్ దృష్టిసారించాలి. గత కొన్నేళ్లుగా వ్యవసాయ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంది. దేశ వ్యవసాయ రంగంలో కమతాల విఘటన, నీటి వనరుల క్షీణత వంటి పరిస్థితులను గమనించొచ్చు.

**స్థూల** కలిపిన విలువ (జీవీఏ)లో వ్యవసాయ, అనుబంధ రంగాల వాటాలో 2013–14 నుంచి తగ్గుదల నమోదవుతోంది. 2013–14లో జీవీఏలో స్థిర ధరల వద్ద వ్యవసాయ, అనుబంధ రంగాల వాటా 17.8 శాతం కాగా, ఇది ప్రాథమిక అంచనాల ప్రకారం 2018–19లో 14.4 శాతానికి తగ్గింది. పంటల ఉత్పత్తి వృద్ధిలో తగ్గుదల వల్ల మొత్తం జీవీఏలో వ్యవసాయ, అనుబంధ రంగాల వాటా తగ్గింది. గత మూడేళ్లలో పంటలు, పశుసంపద, అటవీరంగ ఉత్పత్తుల వృద్ధి సరిగా లేనప్పటికీ మత్స్య ఉత్పత్తుల వృద్ధిలో పెరుగుదల సంభవించింది. వ్యవసాయ, అనుబంధ రంగాల స్థూల మూలధన కల్పనలో ప్రభుత్వరంగ పెట్టుబడిలో వృద్ధి 2014–15 తర్వాతి కాలంలో పెరిగినప్పటికీ ప్రైవేటు పెట్టుబడి వృద్ధి క్షీణించింది. వ్యవసాయ రంగంలో పంటల ఉత్పత్తి, పశుపోషణ, తోటల పెంపకం, పంట కోత అనంతర కార్యకలాపాలు, సామాజిక అడవులు, మత్స్యరంగంలో మహిళల పాత్ర ప్రధానమైంది. మొత్తం సాగులో ఉన్న వ్యవసాయ కమతాల్లో మహిళలు సాగుచేస్తున్న కమతాల వాటా 2005–06లో 11.7 శాతం కాగా, ఇది 2015–16 నాటికి 13.9 శాతానికి పెరిగింది. మార్కెట్ సంస్కరణలను పూర్తిస్థాయిలో ఏ రాష్ట్రమూ అమలు చేయలేదు. వ్యవసాయ రుణాల పంపిణీలో ఈశాన్య రాష్ట్రాల వాటా ఒక శాతం లోపు ఉంది.

### వ్యవసాయ అనుబంధ రంగాలు

- గ్రామీణ ప్రాంతాల్లో రుతు సంబంధ నిరుద్యోగం కాలంలో పశు సంపద, కోళ్లు, పాడి, మత్స్య తదితర వ్యవసాయ అనుబంధ రంగాలు వ్యవసాయ కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నాయి. అనేక పంటల ఉప ఉత్పత్తులు పాడి ఉత్పత్తులకు సంబంధించి ముడి సరుకుగా ఉపయోగపడుతున్నాయి. ప్రపంచ పాల ఉత్పత్తిలో భారత్ 20 శాతం వాటాతో మొదటి స్థానంలో ఉంది. 1991–92 తర్వాత భారత్ పాల ఉత్పత్తిలో స్థిరమైన పెరుగుదల సంభవించింది. 1991–92లో దేశంలో పాల ఉత్పత్తి 55.6 మిలియన్ టన్నులు కాగా, ఇది 2017–18లో 176.3 మిలియన్ టన్నులకు పెరిగింది. ఈ కాలంలో పాల ఉత్పత్తి సగటు సాంవత్సరిక వృద్ధి 4.5 శాతంగా నమోదైంది. మరో వైపు పాల ఉత్పత్తిలో రాష్ట్రాల మధ్య తేడా అధికమైంది. భారత్‌లో తలసరి పాల లభ్యత రోజుకు 375 గ్రాములు కాగా, రాష్ట్రాల వారీ పరిశీలిస్తే పంజాబ్‌లో రోజుకు 1120 గ్రాములు, అస్సాంలో 71 గ్రాములుగా జాతీయ పాడి అభివృద్ధి బోర్డు అంచనాలు వెల్లడించాయి. గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం పాల ఉత్పత్తిలో విక్రయానికి అందుబాటులో ఉన్న పాలు 52 శాతం. ఇందులో సగం కంటే తక్కువ పాలను సంఘటిత రంగమైన సహకార డెయిరీలు, ప్రైవేటు డెయిరీలకు విక్రయిస్తుండగా, మిగిలిన పాలను అసంఘటిత రంగంలో విక్రయిస్తున్నారు.
- నేషనల్ శాంపుల్ సర్వే 70వ రౌండు ప్రకారం 3.7 శాతం వ్యవసాయ కుటుంబాలకు పశు పోషణ ప్రధాన ఆదాయ వనరుగా ఉంది. భారత్ ప్రపంచ మేకల జనాభాలో 16.1 శాతం, గొర్రెల జనాభాలో 6.4 శాతం వాటాను కలిగి ఉంది. దేశంలో మొత్తం పశు సంపద 512.1 మిలియన్లు కాగా వీటిలో మేకలు, గొర్రెల వాటా 39 శాతం. వనరుల లేమి ఉన్న కుటుంబాలతో పాటు వ్యవసాయ కార్యకలాపాలు లేని కాలంలో రైతులకు ముఖ్యంగా ఉపాంత, మహిళా, భూమి లేని రైతులకు మేకలు, గొర్రెలు అనుబంధ ఆదాయాన్ని ఇస్తున్నాయి.

### మత్స్యరంగం

- దేశంలో మత్స్య రంగం అధిక శాతం మంది ప్రజలకు పౌష్టికాహారం, ఆహార భద్రత కల్పిస్తూ వేగంగా అభివృద్ధి చెందుతోంది. దీనిద్వారా 14.5 మిలియన్ల ప్రజలు ఆదాయం, ఉపాధి పొందుతున్నారు. ప్రపంచంలో చేపల ఉత్పత్తిలో భారత్ రెండో స్థానంలో నిలిచింది. 2018–19లో దేశంలో చేపల ఉత్పత్తి 13.7 మిలియన్ మెట్రిక్ టన్నులు. స్థిర ధరల వద్ద జీవీఏలో మత్స్య రంగ వృద్ధి 2012–13లో 4.9 శాతం కాగా, ఇది 2017–18లో 11.9 శాతానికి పెరిగింది. వ్యవసాయ ఎగుమతుల్లో చేపలు, చేప ఉత్పత్తుల ఎగుమతులు కీలకంగా ఉన్నాయి. 2018–19లో చేపలు, చేప ఉత్పత్తుల ఎగుమతుల విలువ రూ.47,620 కోట్లుగా నమోదైంది. అధిక వనరుల సామర్థ్యం ఉన్న మత్స్య రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 2019, ఫిబ్రవరిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. అన్ని రకాల చేపల ఉత్పత్తి, ఉత్పాదకత పెంపునకు సంబంధించిన అన్ని పథకాలనూ ''బ్లూ రివల్యూషన్: ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్'' అనే పథకంలో విలీనం చేశారు. మత్స్య రంగ లక్ష్యాలను సాధించడానికి రూ.7,522.48 కోట్ల వ్యయంతో ఫిషరీస్, ఆక్వాకల్చర్ అవస్థాపనా అభివృద్ధి నిధి ఏర్పాటుకు ఆమోదం లభించింది. పశు సంపద, మత్స్య రంగం అభివృద్ధి ద్వారా ఒకవైపు ప్రజల ఆదాయాలను పెంచుతూ, మరోవైపు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను పేద ప్రజల ఆదాయాలు, జీవన ప్రమాణాలతో అనుసంధానించాలి. వైవిధ్యంతో కూడిన, చలనాత్మక రంగమైన మత్స్య రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ పెట్టుబడుల పెంపునకు ప్రయత్నించాలి. మత్స్య రంగానికి సంబంధించిన అన్ని విధానాలు, కార్యక్రమాలను క్రమబద్ధీకరించాల్సిన అవసరముంది. మత్స్య రంగ అభివృద్ధి.. భారత ఆర్థిక వృద్ధికి ఓ సాధనంగా నిలుస్తుంది. భూమిలేని రైతులకు మేకలు, గొర్రెలు అనుబంధ ఆధాయాన్ని సమకూరుస్తున్నాయి.



### భూకమతాలు

- భారత వ్యవసాయ గణాంకాల (2015–16) ప్రకారం 2010–11లో వ్యవసాయ వినియోగానికి సంబంధించిన కమతాలు 13.8 కోట్లు కాగా, వీటి సంఖ్య 2015–16 నాటికి 14.6 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో కమతాల సంఖ్యలో 5.3 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం కమతాల్లో ఉపాంత కమతాల (హెక్టారు లోపు) వాటా 2000–01లో 62.9 శాతం కాగా, ఇది 2015–16 నాటికి 68.5 శాతానికి పెరిగింది. ఇదే కాలంలో చిన్న కమతాలు (ఒక హెక్టారు– రెండు హెక్టార్లు) 18.9 శాతం నుంచి 17.7 శాతానికి తగ్గగా, పెద్ద కమతాలు (4 హెక్టార్లకు పైగా) 6.5 శాతం నుంచి 4.3 శాతానికి తగ్గాయి.
- 2000–01లో ఉపాంత, చిన్న కమతాల కింద ఉన్న విస్తీర్ణం మొత్తం విస్తీర్ణంలో 38.9 శాతం కాగా, ఇది 2015–16 నాటికి 47.4 శాతానికి పెరిగింది. ఇదే కాలంలో మొత్తం విస్తీర్ణంలో పెద్ద కమతాల విస్తీర్ణం 37.2 శాతం నుంచి 20 శాతానికి తగ్గింది. మహిళలు సాగుచేస్తున్న కమతాల్లో ఉపాంత కమతాల వాటా ఎక్కువ.
- భారత వ్యవసాయ రంగంలో కమతాల ప్రక్రియను పరిశీలించడం ద్వారా ఉపాంత, చిన్న కమతాల (85 శాతం) ప్రాధాన్యాన్ని గుర్తించవచ్చు. ఉపాంత, చిన్న కమతాల వ్యవసాయానికి వ్యవసాయ రంగ అభివృద్ధి వ్యూహం ప్రాధాన్యమివ్వాలి. వ్యవసాయ ఉత్పాదకత ఎరువులు, సాగునీటి లభ్యత, సాంకేతిక పరిజ్ఞానం, పంట సాంద్రత, పంటల తీరు తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది. వనరుల వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం వల్ల చిన్న కమతాల్లో ఉత్పాదకత పెరుగుతుంది.

### నీటి వినియోగం

- ఆసియా జల అభివృద్ధి వీక్షణం (2016) ప్రకారం మొత్తం భూగర్భ జల వినియోగంలో సాగునీటి వాటా 89 శాతం. భూగర్భ నీటిమట్టం అడుగంటుతున్న నేపథ్యంలో ప్రస్తుత భూగర్భ జల వినియోగం ఇదే విధంగా కొనసాగుతుందా? అనేది ప్రశ్నార్థకంగా ఉంది. నీటి అభద్రతకు సంబంధించి 2050 నాటికి భారత్ ప్రపంచ కేంద్ర బిందువుగా నిలుస్తుందని అంచనా. ఈ నేపథ్యంలో చిన్న, ఉపాంత రైతుల సాగునీటి అవసరాలను తీర్చడానికి పటిష్ట యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. దేశంలో లభ్యమయ్యే సాగునీటిలో అధిక శాతాన్ని వరి, చెరకు పంటలు వినియోగించుకుంటున్నాయి. చెరకు ఉత్పత్తి అధికంగా ఉన్న రాష్ట్రాల్లో భూ ఉత్పాదకత, సాగునీటి ఉత్పాదకత మధ్య తేడా స్పష్టంగా తెలుస్తోంది. వ్యవసాయ ఉత్పాదకత పెరగడానికి సాగునీటి ఉత్పాదకత పెంపుపై దృష్టిసారించాల్సిన అవసరాన్ని ఈ పరిస్థితి తెలియజేస్తోంది. మెరుగైన సాగునీటి పద్ధతులు, సాగునీటి సాంకేతికత అనేవి సాగునీటి ఉత్పాదకత పెంపు, పంటల తీరు ప్రక్రియలో మార్పునకు కారణమవుతాయి. సూక్ష్మ నీటి పారుదల వ్యవస్థ.. నీటి వినియోగ సామర్థ్యం పెంపునకు దోహదపడగలదు. సూక్ష్మ నీటిపారుదల వ్యవస్థకు ప్రాధాన్యమిచ్చిన రాష్ట్రాల్లో ఇంధనం, ఎరువుల వినియోగంలో 40–50 శాతం మేర ఆదా జరిగింది. వ్యవసాయ రంగంలో దృష్టి భూ ఉత్పాదకత నుంచి సాగునీటి ఉత్పాదకత వైపు మళ్లాలి. నీటి వినియోగానికి సంబంధించి సమర్థ విధానాలను రూపొందించి, రైతులకు తగిన ప్రోత్సాహకాలు అందించినప్పుడు నీటి సంక్షోభ నివారణ సాధ్యపడుతుంది.

### ఎరువులు

- చిన్న, ఉపాంత రైతుల లాభదాయకతను నిర్ణయించే అంశాల్లో ఎరువుల ధరలు ముఖ్యమైనవి. 2002 నుంచి 2011 వరకు భారత్‌లో ఎరువుల వినియోగంలో పెరుగుదల నమోదైంది. తర్వాతి కాలంలో తగ్గుదల సంభవించింది. దీనికి వినియోగంలో సమతుల్యత లోపించడం, లభ్యత తగ్గుదల, మొక్కలకు సంతులిక పోషణపై రైతుల్లో అవగాహన లేమి, పంట నిర్వహణ సక్రమంగా లేకపోవడం తదితరాలు కారణం. సరైన ఎరువు ఎంపిక, మోతాదు, కాలం, వినియోగ పద్ధతులపై అవగాహన ద్వారా ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచొచ్చు. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ ఉద్దేశం.. రసాయన ఎరువుల నిర్మూలన ద్వారా ఉత్తమ ఆగ్రోనామిక్ పద్ధతులను ప్రోత్సహించడం. జీరో బడ్జెట్ ఫార్మింగ్‌ను తక్కువ నీటితో చేపట్టవచ్చు. దీన్ని వాతావరణ స్నేహ పూర్వక వ్యవసాయ వ్యవస్థగా చెప్పొచ్చు.
- చిన్న కమతాల్లో అభిలషణీయ సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా వనరుల సమర్థతను సాధించొచ్చు. సాంకేతికత వినియోగం; వ్యవసాయ పనిముట్లు, యంత్రాలపై అధిక పెట్టుబడులు; ప్రస్తుత వినియోగంలో ఉన్న సాంకేతికత స్థాయి పెంపు తదితర అంశాలు చిన్న, ఉపాంత రైతులకు ప్రయోజనం చేకూర్చలేవు. చిన్న తరహా వ్యవసాయానికి అవసరమైన పర్యావరణ స్నేహపూర్వక ఆటోమేటెడ్ వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను సమకూర్చాలి. చిన్న తరహా వ్యవసాయంలో సమాచార విస్తరణకు, లావాదేవీల వ్యయం తగ్గింపునకు ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ)ని వినియోగించుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ ఫోన్ల విస్తరణ వల్ల చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, వాతావరణం, నేల ఆరోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని పొందగలుగుతున్నారు.

### సాంకేతికత తోడుగా..

- చిన్న, సన్నకారు వ్యవసాయ క్షేత్రాల్లో యాంత్రీకరణలో భాగంగా హైటెక్ యంత్రాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కస్టమ్ హైరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద 2014–15 నుంచి 2017–18 మధ్యకాలంలో 8,162 కస్టమ్ హైరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అవస్థాపనా సౌకర్యాల కొరత నేపథ్యంలో చిన్న, ఉపాంత రైతులను ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీకి దగ్గర చేయాలి. దీనివల్ల మార్కెట్ లభ్యతకు సంబంధించిన సమాచారం వేగంగా లభిస్తుంది. వ్యవసాయ మార్కెట్లలో సమాచార అగాధాన్ని తొలగించడంలో సాంకేతిక పరిజ్ఞానం ప్రధాన పాత్ర పోషిస్తుంది. కాఫీ మార్కెట్లో వినియోగిస్తున్న బ్లాక్ ఛెయిన్ టెక్నాలజీని దీనికి ఉదాహరణగా చెప్పొచ్చు.
- చిన్న, సన్నకారు రైతులకు సంబంధించి ఉత్పత్తుల మార్కెటింగ్‌లో స్థానిక వర్తకులు, ముడి సరుకులు విక్రయించే డీలర్ల పాత్ర ప్రధానమైంది. వ్యవసాయ మార్కెట్లకు అనుసంధానతను పెంచడం ద్వారా రైతులకు మార్కెట్ లభ్యత చేకూరి, తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర పొందగలరు.




డా॥ తమ్మా కోటిరెడ్డి
ప్రొఫెసర్, ఐబీఎస్, హైదరాబాద్



epaper.sakshi.com

భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య ఇప్పటివరకు 127 వన్డేలు జరిగాయి. 60 మ్యాచ్‌ల్లో భారత్ నెగ్గగా... 62 మ్యాచ్‌ల్లో వెస్టిండీస్‌ను విజయం వరించింది. రెండు మ్యాచ్‌లు 'టై'గా ముగిశాయి. మూడు మ్యాచ్‌లు రద్దయ్యాయి.

వెస్టిండీస్ గడ్డపై ఆ జట్టుతో భారత్ ఇప్పటి వరకు 36 మ్యాచ్‌లు ఆడింది. 14 మ్యాచ్‌ల్లో గెలిచి, 20 ఓడింది. రెండు మ్యాచ్‌లు రద్దయ్యాయి. 2017లో విండీస్‌లో పర్యటించిన భారత్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3–1తో గెల్చుకుంది. మరో మ్యాచ్ రద్దయింది.

# ఇక వన్డే సమరం




**బలహీనమైనదే అయినా అనూహ్యంగా చెలరేగే వెస్టిండీస్‌తో టీమిండియాకు మరో సవాల్. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా రెండు జట్ల మధ్య గురువారం ప్రావిడెన్స్ వేదికగా తొలి వన్డే. ఈ సిరీస్ నెగ్గి తమ దిగ్గజం క్రిస్ గేల్‌కు సగర్వంగా వీడ్కోలు పలకాలని కరీబియన్లు భావిస్తుండగా... లోపాలను సరిచేసుకుని పునర్ నిర్మాణ ప్రక్రియకు పునాదులు వేయాలని భావిస్తోంది భారత్. ఎవరి ప్రణాళికలు ఎంతవరకు నెరవేరుతాయో చూడాలి.**

- నేడు వెస్టిండీస్‌తో టీమిండియా తొలి మ్యాచ్
- బ్యాటింగ్ ఆర్డర్‌లో నంబర్ 4పైనే దృష్టి
- ఆఖరి సిరీస్ ఆడనున్న గేల్
- మ్యాచ్‌కు వర్ష సూచన

**ప్రావిడెన్స్ (గయానా):** టి20 సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన ఊపులో... ప్రపంచ కప్ సెమీస్ నిష్క్రమణ గాయాన్ని మాపే ఆలోచనలో వెస్టిండీస్‌తో వన్డే సమరానికి సిద్ధమవుతోంది కోహ్లి సేన. పనిలో పనిగా వెటరన్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోని స్థానాన్ని యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్ సమర్థంగా భర్తీ చేయాలని; బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎంతో కాలంగా ఇబ్బంది పెడుతున్న నంబర్–4 స్థానానికి పరిష్కారం దొరకాలని ఆశిస్తోంది. కొంత క్లిష్టమే అయినా సత్తా మేరకు ఆడితే ఈ సిరీస్ సైతం మన సొంతం అవుతుందనడంలో సందేహం లేదు. పరుగులు చేయడం అంత తేలికేం కాదని తెలుస్తోన్న ప్రావిడెన్స్ మైదానం పిచ్‌పై ఏ జట్టు నిలకడ చూపుతుందో వారికే విజయం దక్కనుంది.

### అక్కడ అతడే!

వన్డే ప్రపంచ కప్ నుంచి గాయంతో వైదొలగిన ధావన్ తాజా టి20 సిరీస్‌లో ఆకట్టుకోలేకపోయాడు. తనకు మంచి రికార్డున్న వన్డేల్లో ఇప్పుడు ఎలా ఆడతాడో చూడాలి. అతడు ఫామ్ అందుకుని రోహిత్, కెప్టెన్ కోహ్లికి తోడైతే దిగులుండదు. అత్యంత చర్చనీయాంశమైన నంబర్–4 స్థానంలో కేఎల్ రాహుల్‌కే అవకాశం దక్కొచ్చు. ప్రపంచ కప్‌లో ప్రభావం చూపలేకున్నా కరీబియన్ పర్యటనకు తీసుకొచ్చారంటే కేదార్ జాదవ్‌పై టీం మేనేజ్‌మెంట్‌కు బాగా నమ్మకం ఉన్నట్లే. మనీశ్ పాండే, శ్రేయస్ అయ్యర్ రూపంలో మంచి బ్యాట్స్‌మెన్ ఉన్నా స్పిన్ కూడా వేయగలడు కాబట్టి జాదవ్ తుది జట్టులో ఉండే అవకాశం ఉంది. పరిస్థితులను బట్టి పంత్‌ను ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు దింపొచ్చు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా జడేజా ఖాయం. మణికట్టు స్పిన్నర్లు కుల్దీప్, చహల్ సంగతేమిటన్నది మరో ఆసక్తికర అంశంగా మారింది. ప్రపంచ కప్‌లో రాణించకపోవడంతో టి20 సిరీస్‌కు ఇద్దరినీ పక్కన పెట్టారని స్పష్టమైంది. ఈ నేపథ్యంలో విండీస్‌తో వన్డే సిరీస్ వీరికి సవాల్‌తో కూడుకున్నది. మెరుగైన ప్రత్యామ్నాయాలు కనిపిస్తున్నందున... ఈసారి విఫలమైతే 'కుల్చా' ద్వయానికి దారులు మూసుకుపోయినట్లే. ప్రత్యర్థి స్పిన్ ఆడటంలో తడబడుతుంది కాబట్టి తొలి వన్డేలో ఇద్దరికీ చోటుండొచ్చు. మూడో పేసర్ అవసరం అనుకుంటే ఒకరిని పక్కనబెట్టే వీలుంది. కుడి ఎడమ సమీకరణాల ప్రకారం కుల్దీప్‌ను తప్పిస్తే ఖలీల్ అహ్మద్‌కు, చహల్ వద్దనుకుంటే నవదీప్ సైనీ బరిలో దిగుతారు. బ్యాటింగ్‌లో టాపార్డర్ పరుగులు చేసి, మంచి లయలో ఉన్న భువనేశ్వర్, షమీలు విండీస్ బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేస్తే టీమిండియా గెలుపునకు బాటలు పడతాయి.

**తుదిజట్లు (అంచనా)**

**భారత్:** రోహిత్, ధావన్, కోహ్లి, రాహుల్, జాదవ్, పంత్, జడేజా, కుల్దీప్/ఖలీల్, చహల్/సైనీ, భువనేశ్వర్, షమీ

**వెస్టిండీస్:** గేల్, లూయిస్/జాన్ క్యాంప్‌బెల్, హోప్, హెట్‌మైర్, పూరన్, ఛేజ్, హోల్డర్ (కెప్టెన్), కీమో పాల్, రోచ్/థామస్, కాట్రెల్, అలెన్

### టి20ల్లో తుస్... వన్డేల్లో?

ప్రపంచ చాంపియనే అయినప్పటికీ టి20 సిరీస్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో వెస్టిండీస్ పేలవ ప్రదర్శన కనబర్చింది. వన్డేలకు వచ్చేసరికి మార్పులతో జట్టు బలంగా ఉంది. ఆల్‌రౌండర్ జేసన్ హోల్డర్ సారథ్యం, గేల్ వంటి బ్యాట్స్‌మన్ అందుబాటులో ఉండటం, నిలకడగా ఆడే షై హోప్, రోస్టన్ చేజ్ చేరికే దీనికి కారణం. యువ హిట్టర్లు పూరన్, హెట్‌మైర్ ప్రమాదకారులు. పేసర్లు కాట్రెల్, ఒషాన్ థామస్ పటిష్టమైన టీమిండియా టాపార్డర్‌ను ఎంతమేరకు కట్టడి చేస్తారో చూడాలి.

## గేల్ ఎలా ఆడతాడో...




భారత్‌తో వన్డే సిరీస్ తర్వాత క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించనున్న విధ్వంసక బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్‌పై అందరి చూపు నిలిచింది. ప్రపంచ కప్‌లో అలరించలేకపోయిన గేల్... ఈ సిరీస్‌లో రాణించి కెరీర్‌కు ఘన వీడ్కోలు పలకాలని భావిస్తుండొచ్చు. సరిగ్గా 20 ఏళ్ల క్రితం టొరంటో వేదికగా భారత్‌పైనే అరంగేట్రం చేసిన గేల్... 298 వన్డేల్లో 10,393 పరుగులు చేశాడు. మరో 12 పరుగులు చేస్తే దిగ్గజ బ్రయాన్ లారా (10,405)ను అధిగమించి వెస్టిండీస్ తరపున వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌గా నిలుస్తాడు. 300 వన్డేలు ఆడిన క్రికెటర్‌గానూ రికార్డులకెక్కనున్నాడు. ఈ ఏడాది ప్రారంభంలో వెస్టిండీస్‌లో పర్యటించిన ఇంగ్లండ్‌పై అతడు 135, 50, 162, 77 పరుగులు చేశాడు. దీని ప్రకారం సొంతగడ్డపై అతడిని ఆపడం చాలా కష్టమని తెలిసిపోతుంది. మరి.. గేల్ ఏం చేస్తాడో?

## బోపన్న జంట సంచలనం

**నాలుగో సీడ్ జోడీపై విజయం**



**మాంట్రియల్ (కెనడా):** రోజర్స్ కప్ ఏటీపీ మాస్టర్స్ సిరీస్–1000 టెన్నిస్ టోర్నమెంట్‌లో రోహన్ బోపన్న (భారత్)–డెనిస్ షపోవలోవ్ (కెనడా) జోడీ సంచలన విజయంతో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో అన్‌సీడెడ్ బోపన్న–షపోవలోవ్ ద్వయం 4–6, 6–1, 10–6తో 'సూపర్ టైబ్రేక్'లో నాలుగో సీడ్ నికోలస్ మహూట్–రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటను ఓడించింది.

**OIL INDIA LIMITED**
(A Government of India Enterprise)
KG BASIN PROJECT, KAKINADA.
**CONTRACTUAL APPOINTMENT**
Oil India Limited (OIL), KG Basin Project, Door No. 11-4-7, Nookalamma Temple Street, Ramarao Peta, Kakinada-533004, Andhra Pradesh invites applications from **retired oil sector PSU Officers / Govt. Officials** for engagement as Consultant (Land & Coordination) on contract. Job responsibilities, eligibility criteria etc. are furnished in OIL's website : **www.oil-india.com.** Interested candidates may send their CVs along with work experience details to e-mail ID: **KGB_CONS@oilindia.in** on or before **23.08.2019.**

**RAJIV GANDHI UNIVERSITY OF KNOWLEDGE TECHNOLOGIES, RGUKT-NUZVID**
NUZVID, KRISHNA DISTRICT, ANDHRA PRADESH-521 202
Ref. No: RGUKT/NUZ/E-Proc/ET07-ET08/2019-20, Dt. 08.08.2019
**E-PROCUREMENT SHORT TENDER NOTICE**
Online tenders are hereby invited from original manufacturer(OEM)/ authorized Dealers/Distributors /whole sale dealer for supply of the following items to the RGUKT- Nuzvid Institute located at Krishna (district), Andhra Pradesh -521 202.
1. Supply and delivery of the PUC-I Books (NCERT and SCERT)
2. Supply and installation of the Information Outlets (I/O) ports
Interested bidders can download and submit the bids online from 08.08.2019, 11:00 AM to 20.08.2019 up to 05:00 PM through https://tender.apeprocurement.gov.in (AP Portal). For further details please visit our website: www.rguktn.ac.in or https://tender.apeprocurement.gov.in (Andhra Pradesh Portal). Interested bidders are informed to submit a separate bid, tender processing fee, EMD for each tender mentioned above.
Date. 08.08.2019 Sd/-Administrative Officer, RGUKT-Nuzvid

**GOVERNMENT OF ANDHRA PRADESH**
**Office of the Director,**
**Women Development and Child Welfare Department**
Jampani Towers, Lodge Centre, Guntur-522006, Phone No.0863-2332587
e-Tender Notificaton
**WD&CW/POSHAN Abhiyaan- RFP for outsourcing of services - 2019, Dated 07.08.2019**
Sealed tenders are invited under "REQUEST FOR PROPOSAL for selection of Agency for Hiring skilled man-power for providing Techno-managerial support under POSHAN Abhiyaan" in the State of Andhra Pradesh.

| Sl. No. | Name of the work | Approximate tender value in INR | Document cost in INR |
|---|---|---|---|
| 1. | Selection of Agency for Hiring skilled manpower for providing Techno-managerial support under POSHAN Abhiyaan | 5,98,44,000/- | Rs.5,000/- |

The Tender Documents will be available for download at; www.apeprocurement.gov.in from 08-08-2019, 9:30 pm to 06.09.2019, 5:00 pm on payment of above document fees through Demand Draft in favour of DDO, Office of the Director, WD&CW Dept., AP, Guntur from any nationalized Bank payable at Guntur. Last date for submission of "e" tenders is 06.09.2019 upto 5:00 PM. The "e-Tenders will be opened on 09.09.2019 at 10:00 AM in the Office of the Director, Women Development & Child Welfare Department, AP, Guntur. For further details, contact O/o.the Director of WD&CW, Guntur over phone No.0863-2332587, Accounts Officer : 94408 14406.
**Sd/- Director, WD&CW**
DIPR RO.No.81PP/CL/Advt/1/1/2019-20, Dt.7.8.2019

# నిఖత్ జరీన్‌కు షాక్!

- ప్రపంచ చాంపియన్‌షిప్ ట్రయల్స్‌లో పాల్గొనకుండా అడ్డుకున్న సెలక్షన్ కమిటీ చైర్మన్
- తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన తెలంగాణ బాక్సర్
- న్యాయం చేయాలంటూ సమాఖ్యకు లేఖ
- ట్రయల్స్ లేకుండానే మేరీకోమ్ ఎంపిక



నిఖత్

**న్యూఢిల్లీ:** గత కొంత కాలంగా నిలకడగా రాణిస్తూ పెద్ద టోర్నీలలో సత్తా చాటేందుకు సిద్ధమైన తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ ఆశలపై భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) పంచ్ విసిరింది. వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాలనుకున్న ఆమెను ఊహించని విధంగా అడ్డుకుంది. ఈ మెగా ఈవెంట్ కోసం నిర్వహిస్తున్న ట్రయల్స్‌లో నిఖత్ పాల్గొనకుండా స్వయానా చీఫ్ సెలక్టర్ రాజేశ్ భండారి నిరోధించారు. నిఖత్ ఈవెంట్ అయిన 51 కేజీల విభాగంలో భారత స్టార్ బాక్సర్, ఆరుసార్లు ప్రపంచ విజేతగా నిలిచిన 36 ఏళ్ల మేరీకోమ్‌ను బీఎఫ్ఐ ఎంపిక చేసింది. ట్రయల్స్‌లో పాల్గొనకపోయినా ఇటీవలి ప్రదర్శన ఆధారంగా మేరీకోమ్‌ను ఎంపిక చేసినట్లు బీఎఫ్ఐ ప్రకటించింది. మేరీకోమ్ ఈ ఏడాది ఇండియన్ ఓపెన్‌తో పాటు ఇండోనేసియాలో జరిగిన ప్రెసిడెంట్స్ కప్ టోర్నీలో కూడా విజేతగా నిలిచింది. షెడ్యూల్ ప్రకారం మంగళవారం జరిగిన ట్రయల్స్‌లో వన్‌లాల్ దువాతితో నిఖత్ తలపడాల్సి ఉంది. అయితే బౌట్ ఆరంభానికి కొద్దిసేపు ముందు ఈ పోరు జరగడం లేదని ఆమెకు భండారి చెప్పారు. బుధవారం జరగవచ్చని ఆశించినా... జాబితాలో ఆమె పేరు, కేటగిరీలే కనిపించలేదు. దాంతో ఒక్కసారిగా ఈ నిజామాబాద్ బాక్సర్ దిగ్భ్రాంతికి గురైంది.

### ట్రయల్స్ నిర్వహించండి...

తనకు జరిగిన అన్యాయంపై ప్రపంచ మాజీ జూనియర్ చాంపియన్ నిఖత్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ప్రపంచ యూత్ బాక్సింగ్ రజత, సీనియర్ ఆసియా కాంస్య పతక విజేత అయిన ఆమె తన సమస్యను, బాధను వెల్లడిస్తూ బాక్సింగ్ సమాఖ్యకు లేఖ రాసింది. ఇటీవలే నిఖత్ థాయ్‌లాండ్‌లో జరిగిన టోర్నీలో కూడా రజతం సాధించింది. 'ఇది చాలా ఆశ్చర్యంతోపాటు నిరాశ కలిగించింది. చిన్న వయసులోనే నేను ప్రపంచ చాంపియన్‌షిప్ బరిలోకి దిగకుండా రక్షిస్తున్నామని, మంచి భవిష్యత్తు కోసం నా మేలు కోరుతున్నామని సెలక్టర్లు నాతో చెప్పారు. అయితే 2016లోనే ఈ టోర్నీలో పాల్గొన్న నేను ఇప్పుడు చిన్నదాన్ని ఎలా అవుతాను. కాబట్టి నన్ను ఆపేందుకు వయసు మాత్రమే కారణం కాదు. మీ ఆధ్వర్యంలో పారదర్శకంగా ట్రయల్స్ నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నా. ఏదైనా ఒక నిబంధన నిజంగా ఉంటే అది బాక్సర్ల స్థాయి, ఘనతను బట్టి కాకుండా అందరికీ వర్తింపజేయాలి. బాక్సర్లు ట్రయల్స్‌లో పాల్గొనకుండా అడ్డుకునేందుకు తప్పుడు పద్ధతులు అవలంబించవద్దు. అందుకే మీ జోక్యం కోరుతున్నాను' అని 23 ఏళ్ల నిఖత్ ఆ లేఖలో పేర్కొంది.

### సరైన నిర్ణయమే: భండారి

నిఖత్‌ను ట్రయల్స్‌లో పాల్గొనకుండా తీసుకున్న నిర్ణయాన్ని రాజేశ్ భండారి సమర్థించుకున్నారు. భారత్ పతకావకాశాలు మెరుగ్గా ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 'బీఎఫ్ఐ ఉన్నతాధికారులతో చర్చించిన తర్వాతే 51 కేజీల విభాగంలో మేరీకోమ్‌ను ఎంపిక చేశాం. ఆమె కోచ్ కూడా మాకు ఒక అభ్యర్థన పంపారు. దానిని పరిశీలించిన తర్వాత ట్రయల్స్ లేకుండానే ఎంపికయ్యేందుకు మేరీకోమ్‌కు అర్హత ఉందని నిర్ధారణకు వచ్చాం. ఇటీవల ఇండియా ఓపెన్‌లో నిఖత్‌ను కూడా ఆమె ఓడించింది. జాతీయ శిబిరంలో కూడా అందరికంటే మెరుగ్గా కనిపించింది. నిఖత్ కూడా చాలా మంచి బాక్సర్. భవిష్యత్తులో ఆమెకు తగిన అవకాశాలు లభిస్తాయి. ప్రస్తుతానికి మాత్రం ప్రదర్శన, అనుభవంపైనే మేరీకోమ్‌ని ఎంపిక చేశాం' అని భండారి వివరించారు.



**మేరీకోమ్Xనిఖత్**

**మే** నెలలో గువాహటిలో జరిగిన ఇండియా ఓపెన్ సెమీఫైనల్లో నిఖత్‌పై మేరీకోమ్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌కు ముందు 'నాకు స్ఫూర్తిగా నిలిచిన బాక్సర్‌తో తలపడేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా. ఆమె వ్యూహాలను పసిగట్టి గట్టి పోటీనిస్తా' అని నిఖత్ వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలో అంత వివాదం ఏమీ లేదు. కానీ ఎందుకో మేరీకోమ్ అహం దెబ్బతిన్నట్లుంది! లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, ఆరుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఈ దిగ్గజం తనకంటే ఎంతో జూనియర్ అయిన నిఖత్‌పై మ్యాచ్ తర్వాత ఆగ్రహాన్ని ప్రదర్శించింది. 'ఈ అమ్మాయి ఎవరో కూడా నాకు తెలీదు. నేను చాలా ఏళ్లుగా ఆడుతున్నాను. నన్ను ఆమె సవాల్ చేస్తున్నట్లుగా పత్రికల్లో వచ్చింది. నాకు ఆశ్చర్యంతో పాటు చికాకు కలిగింది. ముందు నిన్ను నువ్వు రింగ్‌లో నిరూపించుకో. ఆ తర్వాత నాపై వ్యాఖ్యలు చేయవచ్చు. అంతర్జాతీయ స్థాయిలో ఒక్క పతకం గెలిచిన ఆమెకు ఇంత అహం అవసరమా? నాతో పోటీ పడటం ఆమె అదృష్టం' అని తీవ్రంగా వ్యాఖ్యానించింది. నిఖత్ కెరీర్ ఆరంభం నుంచి 51 కేజీల విభాగంలోనే పోటీ పడుతోంది. మొదటి నుంచి 48 కేజీల విభాగంలో ఆడిన మేరీ కోమ్ దానిని ఒలింపిక్స్ నుంచి తప్పించడంతో ఇండియా ఓపెన్‌తోనే 51 కేజీలకు మారింది. దాంతో నిఖత్ అవకాశాలు దెబ్బతింటున్నాయి. నాటి ఘటనకు, ఇప్పుడు నిఖత్‌ను అడ్డుకోవడానికి సంబంధం ఉండవచ్చని బాక్సింగ్ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేశాయి.

## సింధు సంపాదన రూ.39 కోట్లు

**న్యూయార్క్:** తెలుగుతేజం, బ్యాడ్మింటన్ స్టార్ పూసర్ల వెంకట సింధు ప్రపంచ సంపన్న మహిళా క్రీడాకారిణుల జాబితాలో 13వ స్థానంలో నిలిచింది. ఫోర్బ్స్ విడుదల చేసిన ఈ జాబితాలో భారత్ నుంచి ఆమె ఒక్కరికే చోటు దక్కడం విశేషం. ఫోర్బ్స్ లెక్కల ప్రకారం ఆమె గతేడాది సంపాదన రూ. 39 కోట్లు (5.5 మిలియన్ డాలర్లు)గా తేల్చింది. 'సింధు విలువైన మార్కెట్ కలిగిన భారత మహిళా అథ్లెట్‌గా కొనసాగుతోంది. ఆమె గతేడాది సీజన్ ముగింపు టోర్నీ అయిన 'బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్'లో విజేతగా నిలువడంతో ఆమె బ్రాండింగ్‌కు ఢోకా లేకపోయింది' అని ఫోర్బ్స్ తెలిపింది. అత్యధికంగా ఆర్జించే మహిళా అథ్లెట్ల జాబితాలో అమెరికా టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్ 29.2 మిలియన్ డాలర్ల (రూ. 207 కోట్లు)తో అగ్ర స్థానంలో ఉంది.

**Real Time Governance Society (RTGS)**
**Government of Andhra Pradesh**
Block 1, AP Secretariat, Velagapudi, Guntur
REAL TIME GOVERNANCE
**Request for Proposal - Call Notice for**
**1.** Real Time Governance Society invites Request for Proposals (RFP) for "Selection of suppliers for supply of equipment to the Village volunteers in the State of Andhra Pradesh".
(i) Equipment set 1: Finger Print Scanner + Iris Scanner
(ii) Equipment set 2: Handheld Device + GSM SIMs
**2.** The main objective of this RFP is to select eligible supplier(s) for supply of above mentioned equipment to Village/Ward Volunteers and Village/Ward Secretariat functionaries in Andhra Pradesh, along with support for a period of 3 years.
Time Schedule of Proposal related various events:

| Description | Date and Time |
|---|---|
| Release of Request for Proposal (RFP) | Thursday, August 8th, 2019, 11:00hrs |
| Last Date for Submission of online Questions by bidders | Monday 12th August 2019, 05:00pm hrs |
| Pre-Bid Conference | Tuesday 13th August 2019, 11:00 hrs O/o 4th Floor, Commissioner Panchayat Raj, Tadepali, Guntur (DT) |
| Date of Issue of Clarifications | Thursday 15th August 2019, 5:00PM hrs |
| Last Date for Submission of bids | Wednesday 28th August 2019, 3:00PM hrs |
| RFP Document Cost | Rs. 5,00,000 (in words five lakhs only) |

Issued by
Real Time Governance Society (RTGS),
On behalf of Commissioner, Panchayat Raj and Rural Development Department ("PRRD") and Commissioner, Municipal Administration and Urban Development ("MAUD"), Government of Andhra Pradesh.
The complete set of bid documents is available online on the below mentioned websites from 08-Aug-2019 at 2.00 PM. IST onwards.
(i) http://www.rtgs.ap.gov.in/ - RTGS website
(ii) http://www.apeprocurement.gov.in - AP eProcurement website
**Sd/- CEO, RTGS**
DIPR Ro.No.82PP/CL/ADVT/1/1/2019-20, Dt:7-8-2019

## హరియాణా స్టీలర్స్ గెలుపు

**పట్నా:** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో భాగంగా బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 35–26 స్కోరుతో పట్నా పైరేట్స్‌పై నెగ్గింది. స్టీలర్స్ జట్టులో రైడర్ వికాస్ (10) చక్కని ప్రదర్శన కనబరిచాడు. యూపీ యోధ, తమిళ్ తలైవాస్ జట్ల మధ్య మ్యాచ్ చివరకు 28–28తో టై అయింది. **నేడు జరిగే మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్‌తో తెలుగు టైటాన్స్ తలపడుతుంది.**

**GOVERNMENT OF ANDHRA PRADESH**
**MUNICIPAL ADMINISTRATION DEPARTMENT**
**Short Tender Notice**
**Lr. Roc.No. 005/2019/OP1** **Dated : 06.08.2019**
Sealed tenders are invited for an urgent nature of work of Printing, Supply and Distribution of Hand Book (Karadeepika) for Ward Volunteers in all 110 Municipalities in Andhra Prdesh and to hand over the hand books before 15.08.2019.

| | | |
|---|---|---|
| 1. | Tender Documents Download | 07.08.2019 onwards |
| 2. | Last date and time for submission of tenders | 13.08.2019 at 11.00 AM |
| 3. | Technical /Financial Bid Opening date and time | 13.08.2019 at 11.30 AM/12.30 PM |

The tender document can be downloaded from the **www.cdma.ap.gov.in.**
**Sd/- Commissioner & Director of Municipal Administration, Guntur**

## భారత స్టార్స్‌కు చుక్కెదురు

- రెండో రౌండ్‌లోనే ఓడిన టాప్–3 సీడెడ్ ఆటగాళ్లు సమీర్ వర్మ, ప్రణయ్, సాయిప్రణీత్



**సాక్షి, హైదరాబాద్:** బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ విభాగంలో తొలి రౌండ్‌లో 'బై' పొందిన భారత అగ్రశ్రేణి ఆటగాళ్లు సమీర్ వర్మ, హెచ్ఎస్ ప్రణయ్, సాయిప్రణీత్ రెండో రౌండ్‌లోనే నిష్క్రమించారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన మ్యాచ్‌ల్లో టాప్ సీడ్ సమీర్ వర్మ 18–21, 11–21తో హియో క్వాంగ్ హీ (కొరియా) చేతిలో... రెండో సీడ్ సాయిప్రణీత్ 17–21, 23–21, 15–21తో లియోనార్డో రుంబే (ఇండోనేసియా) చేతిలో... మూడో సీడ్ ప్రణయ్ 17–21, 10–21తో జియా వె తాన్ (మలేసియా) చేతిలో ఓడిపోయారు. భారత్‌కే చెందిన పారుపల్లి కశ్యప్, సౌరభ్ వర్మ, శుభాంకర్ డే ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో నాలుగో సీడ్ కశ్యప్ 23–21, 19–21, 21–17తో క్వాలిఫయర్ కిమ్ డాంగ్ హున్ (కొరియా)పై, శుభాంకర్ 19–21, 21–13, 21–16తో సెంగ్ జో యో (మలేసియా)పై గెలిచారు. హైదరాబాద్ ఆటగాడు, క్వాలిఫయర్ చిట్టబోయిన రాహుల్ యాదవ్ తొలి రౌండ్‌లో 21–16, 21–23, 15–21తో మరో క్వాలిఫయర్ బాయ్ యు పెంగ్ (చైనా) చేతిలో ఓటమి చవిచూశాడు.

మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో చుక్కా సాయి ఉత్తేజిత రావు 21–14, 17–21, 21–10తో దిశా గుప్తా (అమెరికా)పై గెలుపొందగా... గుమ్మడి వృశాలి 16–21, 10–21తో ఫితాయపోర్న్ చైవన్ (థాయ్‌లాండ్) చేతిలో... కుదరవల్లి శ్రీకృష్ణప్రియ 15–21, 10–21తో కి జుయ్‌ఫె (ఫ్రాన్స్) చేతిలో పరాజయం పాలయ్యారు.

**ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్**
(భారత ప్రభుత్వ చట్టబద్ధమైన సంస్థ)
నెల్సన్ మండేలా మార్గ్, వసంత్ కుంజ్, న్యూఢిల్లీ – 110070
ఫోన్: 011–26131577, 78, 80 & 011–29581000, ఇ-మెయిల్: antiraging@aicte-india.org
వెబ్‌సైట్: www.aicte-india.org
**బహిరంగ ప్రకటన**
**AICTE ఆమోదిత టెక్నికల్ ఇన్‌స్టిట్యూషన్లలో ర్యాగింగ్ బెదిరింపులను నిరోధించుట**
ర్యాగింగ్ క్రిమినల్ అపరాధమని మరియు AICTE ఆమోదిత టెక్నికల్ ఇన్‌స్టిట్యూషన్లలో ర్యాగింగ్ రుగ్మతను నిషేధించుటకు, నివారించుటకు మరియు తొలగించుటకు AICTE ఆమోదిత టెక్నికల్ ఇన్‌స్టిట్యూషన్లలో ర్యాగింగ్ భయాన్ని నిరోధించుటకు F.No.37-3/Legal/AICTE/2009 తేది 1 జూలై, 2009 ప్రకారం దాని రెగ్యులేషన్‌ను మరియు వరుసగా F.No.37-3/Legal/AICTE/2009 & F.No.34-AICTE/AR/Antiragging/2016 తేది 17, జూలై 2014 మరియు 22, ఫిబ్రవరి 2017 (AICTE వెబ్‌పోర్టల్ **www.aicte-india.org**లో లభించును) ప్రకారం తదుపరి సవరణలను AICTE ఇప్పటికే ప్రకటించిందని AICTE ఆమోదిత ఇన్‌స్టిట్యూషన్లు, విద్యార్థులు మరియు ఇతర వివిధ స్టేక్ హోల్డర్లందరికీ తెలియజేయబడుతోంది.
పై రెగ్యులేషన్లు తప్పనిసరి మరియు అన్ని AICTE ఆమోదిత ఇన్‌స్టిట్యూషన్లకు వర్తిస్తాయి. అందువలన ఈ అన్ని ఇన్‌స్టిట్యూషన్లు దానిని సరిగ్గా అమలుపరచుటకు దిగువ తెలిపిన అవసరమైన చర్యలు చేపట్టవలెను, అవి:
- యాంటి–ర్యాగింగ్ కమిటి మరియు యాంటి–ర్యాగింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయడం
- ప్రవేశం, హాస్టల్ వసతి అలాట్‌మెంట్ సమయంలో అండర్‌టేకింగ్స్ పొందడం
- నిబద్ధతగల వార్డెన్(ల) కేడర్ మరియు హాస్టల్స్‌ను క్రమబద్దంగా సందర్శించడం
- విద్యార్థులతో క్రమబద్ధమైన సమావేశాల ద్వారా అవగాహన కల్పించడం
- ఫ్రెషర్స్ కొరకు ప్రొఫెషనల్ కౌన్సెలర్(ల) నియామకం
- చట్టంలోని నిబంధనలు, శిక్షలు మొ॥వాటిని ప్రదర్శించే పోస్టర్లు/బ్యానర్ల స్థాపన

AICTE ఆమోదిత ఇన్‌స్టిట్యూషన్‌చే పైన తెలిపిన విధంగా AICTE రెగ్యులేషన్స్ యొక్క ఏదేని ఉల్లంఘన లేదా ర్యాగింగ్ నిరోధించుటకు తగినచర్యలు చేపట్టుటలో ఏదేని ఇన్‌స్టిట్యూషన్ విఫలమైన సందర్భంలో లేదా ఈ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడంలో విఫలమైన సందర్భంలో లేదా ర్యాగింగ్ సంఘటనలకు పాల్పడిన వారిని తగిన విధంగా శిక్షించుటలో విఫలమైన సందర్భంలో అప్రూవల్ ప్రాసెస్ హ్యాండ్‌బుక్‌లోని నిబంధనల ప్రకారం తప్పుచేసిన ఇన్‌స్టిట్యూషన్లపై AICTE శిక్షాత్మక చర్య తీసుకోవలసిందిగా ఆజ్ఞాపిస్తుంది.
ర్యాగింగ్ సంబంధిత సంఘటనల కారణంగా వ్యధ చెందుతున్న విద్యార్థులు **టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నం.:1800–180–5522 ద్వారా సంప్రదించవచ్చును లేదా మెంబర్ సెక్రటరీ, AICTE, JNU క్యాంపస్, నెల్సన్ మండేలా మార్గ్, వసంత్ కుంజ్, న్యూ ఢిల్లీ–110070 వారికి వ్రాయవచ్చును.**
**Advt No.: PGRC/08 (01)/2019** మెంబర్ సెక్రటరీ, AICTE

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 286 ▼ | 93 ▼ |
| 36,690 | 10,855 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 7,845 | ▲ | 12 |
| డోజోన్స్ | 25,940 | ▼ | 90 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,199 | ▲ | 27 |
| డాక్స్ | 11,650 | ▲ | 82 |
| షాంఘై | 2,769 | ▼ | 9 |
| నికాయ్ | 20,516 | ▼ | 69 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.15 | 71.79 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 84.78 | 87.84 |
| యూరో | ఎస్‌బీఐ | 78.15 | 81.05 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 65.65 | 68.14 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.54 | 48.67 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.43 | 52.19 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.12 | 19.86 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.56 | 20.12 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.44 | 10.79 |

# రుణాలు ఇక పండగే!



## గృహ, వాహన, కార్పొరేట్ రుణాలు మరింత చౌక

- వరుసగా నాలుగోసారి రెపో రేటు కోత • 35 బేసిస్ పాయింట్లు తగ్గించిన ఆర్‌బీఐ
- 5.4 శాతానికి దిగొచ్చిన రెపో రేటు.. • 5.15 శాతానికి రివర్స్ రెపో రేటు
- జీడీపీ వృద్ధి రేటు అంచనాలు 7 శాతం నుంచి 6.9 శాతానికి తగ్గింపు
- సరళ పాలసీ విధానం కొనసాగింపు • డిమాండ్, పెట్టుబడులు పెంపే లక్ష్యం

**ముంబై:** పండుగలు మొదలవుతున్న తరుణంలో రుణగ్రహీతలకు రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) తీపికబురు తెచ్చింది. కీలక పాలసీ రేట్లను అంచనాలకు మించి తగ్గించడంతో... ఇక అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్లు దిగిరానున్నాయి. నెలవారీ వాయిదాల (ఈఎంఐ) భారం కూడా తగ్గనుంది. కాగా, దిగజారుతున్న దేశ ఆర్థిక వృద్ధి, పడిపోతున్న డిమాండ్ ఆర్‌బీఐనీ ఆందోళనకు గురిచేస్తోంది! బుధవారం వెల్లడైన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమీక్ష నిర్ణయాల్లో ఇదే తేటతెల్లమైంది. వృద్ధి క్షీణతకు చెక్ పెట్టేందుకు, వ్యవస్థలో డిమాండ్ పెంచేందుకు తన వంతుగా రేట్ల కోతతో ముందుకు వచ్చింది. 25 బేసిస్ పాయింట్ల వరకు రెపో రేటును తగ్గించొచ్చని ఎక్కువ మంది విశ్లేషకులు అంచనా వేయగా, ఈ విషయంలో ఆర్‌బీఐ విశాలంగానే స్పందించి 35 బేసిస్ పాయింట్లను తగ్గించి ఆశ్చర్యపరిచింది. బ్యాంకులకు సమకూర్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీ రేటునే రెపో రేటుగా పేర్కొంటారు. ''25 బేసిస్ పాయింట్ల తగ్గింపు సరిపోదు. 50 బేసిస్ పాయింట్ల తగ్గింపు ఎక్కువ అవుతుంది. 35 బేసిస్ పాయింట్లు అన్నది సమతుల్యంగా ఉంటుందని ఎంపీసీ భావించింది'' అని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. సాధారణంగా ఆర్‌బీఐ పావు శాతం లేదా అరశాతం (25 బేసిస్ పాయింట్ల మల్టిపుల్‌లో) మేర రేట్లలో చేసే మార్పులకు, 35 బేసిస్ పాయింట్ల తగ్గింపు అన్నది వినూత్నమే. గత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు ఆర్‌బీఐ 1.1% రెపో రేటును తగ్గించడం విశేషం. తాజా నిర్ణయం తర్వాత రెపో రేటు 5.4%కి, రివర్స్ రెపో రేటు (బ్యాంకుల నుంచి ఆర్‌బీఐ సమీకరించే నిధులపై ఇచ్చే రేటు) 5.15%కి దిగొచ్చాయి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019–20) జీడీపీ వృద్ధి అంచనాలను గతంలో ఉన్న 7% నుంచి 6.9 శాతానికి తగ్గించింది. సర్దుబాటు ధోరణిని కొనసాగించింది. అంటే పాలసీ విషయంలో ఉదారంగా వ్యవహరించే వెసులుబాటు ఈ విధానంలో ఉంటుందని ఆశించొచ్చు. అవసరమైతే భవిష్యత్తులోనూ రేట్ల కోత చేపట్టవచ్చని ఇది సూచిస్తుంది.

**బలహీనంగా ఆర్థిక రంగం**

''దేశీయ ఆర్థిక కార్యకలాపాలు బలహీనంగానే ఉన్నాయి. అంతర్జాతీయ మందగమనం, వాణిజ్య ఉద్రిక్తతలు పెరగడం వృద్ధి తగ్గే రిస్కును పెంచుతున్నాయి. వృద్ధిపై ఆందోళనలకు పరిష్కారంగా డిమాండ్‌ను పెంచేందుకు, ప్రైవేటు పెట్టుబడులను పెంచడం అన్నది ఈ దశలో అత్యంత ముఖ్యమైనది'' అని రేట్ల కోత అనంతరం విడుదల చేసిన ప్రకటనలో ఎంపీసీ స్పష్టం చేసింది.

### అసాధారణ నిర్ణయం...



రెపో రేటును 35 బేసిస్ పాయింట్లను తగ్గించడం అసాధారణమే. మార్కెట్లు ఊహించని విధంగా ఆశ్చర్యపరిచే రీతిలో మానిటరీ పాలసీ పనిచేస్తుందని ఇది తెలియజేస్తోంది. 2019–20కు వృద్ధి అంచనాలను స్వల్పంగా తగ్గించినప్పటికీ, వృద్ధి క్షీణతను అడ్డుకునేందుకు ఎన్నో చర్యలను ఆవిష్కరించింది. రోజులో 24 గంటలూ ఎన్‌ఈఎఫ్‌టీని అందుబాటులోకి తీసుకురావడం రిటైల్ చెల్లింపులను పెంచుతుంది.

–రజనీష్ కుమార్, ఎస్‌బీఐ చైర్మన్

### ద్రవ్యోల్బణం కట్టడిలోనే...



ద్రవ్యోల్బణం విషయంలో ఆర్‌బీఐ ఇప్పటికీ ఆశావహంగానే ఉంది. 2021 మొదటి త్రైమాసికం వరకు 4% లోపే ఉంటుందని అంచనా వేస్తోంది. ఎన్‌బీఎఫ్‌సీలకు రుణాల లభ్యత పెంచడం, ఎన్‌బీఎఫ్‌సీ ద్వారా కొన్ని రంగాలకు రుణాలను ప్రాధాన్య రంగ రుణ వితరణగా గుర్తించడం ఆహ్వానించతగినవి.

– బి ప్రసన్న, ఐసీఐసీఐ బ్యాంకు గ్లోబల్ మార్కెట్స్ హెడ్

### బ్యాంకులు వెంటనే బదిలీ చేయాలి

నేటి రేట్ల తగ్గింపుతో ఆర్‌బీఐ ఈ ఏడాది 110 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించినట్టయింది. కేంద్ర బ్యాంకు లిక్విడిటీని కూడా మిగులుగానే కొనసాగించింది. తగ్గిన పాలసీ రేట్లను వేగంగా బదిలీ చేయడం బ్యాంకులకు కీలకం. రేట్ల తగ్గింపును పూర్తి స్థాయిలో బదిలీ చేయకపోతే పెట్టుబడులు, వినియోగ డిమాండ్‌లో మార్పు ఉండదు.

– సందీప్ సోమాని, ఫిక్కీ ప్రెసిడెంట్

### వాహన, రియల్టీకి ఊతం...



ఎన్‌బీఎఫ్‌సీలకు రుణాలకు ద్వారాలను తెరవడం వాహన, రియల్ ఎస్టేట్‌పై వినియోగ డిమాండ్‌ను పెంచుతుంది. రేట్ల కోత సత్వరమే బదిలీ చేసేందుకు బ్యాంకులను ప్రోత్సహిస్తుందని భావిస్తున్నాం.

– జార్జ్ అలెగ్జాండర్ ముత్తూట్, ముత్తూట్ ఫైనాన్స్ ఎండీ

# మందగమనమే... కానీ..?

ఆర్థిక రంగం మందగమన పరిస్థితుల్లో ఉందన్న పలువురు ప్రముఖుల ఆందోళనలను నిజం చేస్తూ... ఇది మందగమనమే కానీ, నిర్మాణాత్మక మందగమనం మాత్రం కాదన్నారు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్. వృద్ధి రేటు వేగాన్ని అందుకుంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. గత కొన్ని నెలలుగా వాహన విక్రయాలు క్షీణిస్తుండడం, వినిమయ డిమాండ్ తగ్గుతుండడం ఎంతో మందిని కలవరపరుస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టడానికి అవకాశం ఉందన్నారు దాస్. ప్రభుత్వం, ఆర్‌బీఐ తీసుకునే చర్యలతో, తక్కువ బేస్ ప్రభావంతో వృద్ధి రేటు తిరిగి వేగాన్ని సంతరించుకుంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం వృద్ధి రేటును పెంచేందుకు మరిన్ని చర్యలు తీసుకునే ప్రణాళికతో ఉన్నట్టు చెప్పారు. రంగాలవారీగా చర్యలు ఉంటాయన్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటనను గుర్తు చేశారు.

**పడిపోయిన డిమాండ్**


పెట్టుబడులు, డిమాండ్ రెండూ తగ్గాయని అంగీకరిస్తూ, ఇదే వృద్ధి రేటు పడిపోవడానికి దారితీస్తున్నట్టు దాస్ చెప్పారు. తాజా సమీక్షలో 6.9%కి జీడీపీ వృద్ధి అంచనాలు తగ్గించిన విషయం గమనార్హం. ''ప్రస్తుతానికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ దెబ్బతిన్నది. గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్ల అమ్మకాలు క్షీణించడం, పట్టణ ప్రాంతాల్లో కార్ల విక్రయాలు పడిపోవడం ఇదే సూచిస్తోంది. అయితే, డిమాండ్ తిరిగి మెరుగుపడుతుందన్న ఆశాభావంతో ఆర్‌బీఐ ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో వృద్ధి రేటు 7.5%కి చేరుతుంది'' అని దాస్ పేర్కొన్నారు. ఆర్‌బీఐ 1.10 శాతం మేర రేట్లను తగ్గించడం, వ్యవస్థలో సరిపడా లిక్విడిటీ ఉండేలా చూసేందుకు కట్టుబడి ఉండడం ఇందుకు సాయం చేస్తుందన్నారు.

**రుణ పంపిణీ పెరుగుతుంది**

''రుణాల వితరణ అన్నది ప్రస్తుతం తిరిగి పుంజుకుంది. నేడు తీసుకున్న చర్యలతో వ్యవస్థలో రుణాల జారీని పెంచుతుంది. ఇది వృద్ధి గణాంకాలను పెంచేందుకు తోడ్పడుతుంది'' అని శక్తికాంతదాస్ పేర్కొన్నారు.

**ఒక వంతే బ్యాంకులు బదిలీ చేశాయి**

ఆర్‌బీఐ రేట్ల తగ్గింపు స్థాయిలో బ్యాంకులు ఆ ప్రయోజనాన్ని కస్టమర్లకు బదిలీ చేయలేదని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ అంగీకరించారు. జూన్ వరకు 75 బేసిస్ పాయింట్ల మేర ఆర్‌బీఐ తగ్గించగా, బ్యాంకులు కేవలం మూడింట ఒక వంతు 0.29 శాతాన్ని రుణ గ్రహీతలకు బదిలీ చేసినట్టు చెప్పారు. రేట్లను అధిక స్థాయిలోనే కొనసాగించేందుకు బ్యాంకులు జట్టు కట్టాయన్న ఆరోపణలను ఆయన కొట్టిపడేశారు. బ్యాంకుల నుంచి అధిక రేట్ల తగ్గింపు బదలాయింపు అన్నది భావిస్తున్నట్టు చెప్పారు. తాము తీసుకున్న చర్యల ద్వారా వడ్డీ రేట్ల తగ్గింపు క్రమంగా వ్యవస్థలో కనిపిస్తుందని బ్యాంకులతో తాము నిర్వహించిన సమావేశం ఆధారంగా తెలుస్తోందన్నారు.



### పాలసీలో ఇతర ముఖ్యాంశాలు..

- నగదు నిల్వల నిష్పత్తి(సీఆర్‌ఆర్) 4 శాతం, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్‌ఎఫ్) రేటు 5.65 శాతంగా ఉన్నాయి.
- 2010 ఏప్రిల్ తర్వాత రెపో రేటు ఇంత తక్కువ స్థాయికి రావడం ఇదే తొలిసారి.
- ఆరుగురు ఎంపీసీ సభ్యుల్లో ఇద్దరు 25 బేసిస్ పాయింట్ల తగ్గింపునకు అనుకూలంగా ఓటు వేయగా, నలుగురు 35 బేసిస్ పాయింట్లకు మొగ్గు చూపారు.
- వినియోగధరల ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్ త్రైమాసికానికి 3.1 శాతంగా, ఆ తర్వాత రెండు త్రైమాసికాల్లో 3.5–3.7 శాతం మధ్య ఉండొచ్చని ఎంపీసీ అంచనా వేసింది. మొత్తం మీద 12 నెలల కాలానికి 4 శాతం లక్ష్యం పరిధిలోనే ద్రవ్యోల్బణం ఉంటుందని పేర్కొంది.
- చెల్లింపుల మోసాల సమాచారాన్ని తెలియజేసేందుకు కేంద్రీకృత రిజిస్ట్రీ ఏర్పాటుకు నిర్ణయం. ఆర్థిక మోసాలు జరిగితే ఇది సత్వరమే స్పందిస్తుంది.

# ఇకపై రోజంతా నెఫ్ట్ సేవలు

**డిసెంబర్ నుంచి అమల్లోకి**

**ముంబై:** ఆన్‌లైన్ నగదు బదిలీ లావాదేవీలకు సంబంధించిన నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్) విధానాన్ని ఇకపై ఇరవై నాలుగ్గంటలూ అందుబాటులోకి తేవాలని రిజర్వ్ బ్యాంక్ నిర్ణయించింది. ఈ ఏడాది డిసెంబర్ నుంచి దీన్ని అమల్లోకి తేనున్నట్లు వెల్లడించింది. దేశీయంగా రిటైల్ చెల్లింపుల వ్యవస్థలో ఇది విప్లవాత్మక మార్పులు తేగలదని పేమెంట్ సిస్టమ్ విజన్ 2021 పత్రంలో ఆర్‌బీఐ పేర్కొంది. ప్రస్తుతం రూ. 2 లక్షల దాకా నగదు బదిలీ లావాదేవీలకు నెఫ్ట్, అంతకు మించిన మొత్తానికి రియల్ టైమ్ గ్రాస్ సెటిల్మెంట్ సిస్టం (ఆర్‌టీజీఎస్) విధానాన్ని ఉపయోగిస్తున్నారు. రెండో, నాలుగో శనివారం మినహా ప్రస్తుతం నెఫ్ట్ సర్వీసులు ఉదయం 8 గం.ల నుంచి సాయంత్రం 7 గం.ల దాకా మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. డిజిటల్ లావాదేవీలను మరింతగా ప్రోత్సహించే దిశగా రిజర్వ్ బ్యాంక్ ఇప్పటికే ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ విధానాల్లో నగదు బదిలీలపై తాను విధించే చార్జీలను ఎత్తివేసింది. మరోవైపు, ఏటీఎం చార్జీలు, ఫీజులన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేసేందుకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) సీఈవో సారథ్యంలో ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసింది.




**కన్జ్యూమర్ రుణాలపై తగ్గనున్న వడ్డీ రేట్లు**

అన్‌సెక్యూర్డ్ కన్జ్యూమర్ రుణాలపై వడ్డీ రేట్లు తగ్గే దిశగా ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. క్రెడిట్ కార్డులు మినహా అన్ని రకాల కన్జ్యూమర్ రుణాలపై (పర్సనల్ లోన్స్ సైతం) రిస్క్ వెయిటేజీని ప్రస్తుతమున్న 125% నుంచి 100%కి తగ్గించింది.

**ఐసీఏపై నియంత్రణ సంస్థలతో చర్చలు**

అంతర్–రుణదాతల ఒప్పంద (ఐసీఏ) ప్రక్రియలో బీమా సంస్థలు, అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలను (ఏఎంసీ) కూడా చేర్చే క్రమంలో ఆయా రంగాల నియంత్రణ సంస్థలైన సెబీ, ఐఆర్‌డీఏఐతో చర్చలు జరుపుతున్నట్లు గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. మొండిబాకీల పరిష్కార ప్రక్రియలో ఐసీఏని తప్పనిసరి చేస్తూ జూన్ 7న సర్క్యులర్ ఇచ్చినట్లు ఆయన వివరించారు.

### ఎన్‌బీఎఫ్‌సీకి చేయూత

ఎన్‌బీఎఫ్‌సీ రంగానికి చేయూతనిచ్చే పలు చర్యలను తాజా సమీక్షలో ఎంపీసీ తీసుకుంది. ప్రాధాన్య రంగాలకు రుణాలను ఎన్‌బీఎఫ్‌సీల ద్వారా వితరణ చేసేందుకు అనుమతించింది. ''రిజిస్టర్డ్ ఎన్‌బీఎఫ్‌సీలకు బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు అనుమతించాలని నిర్ణయించాం. అవి వ్యవసాయ రంగానికి రూ.10 లక్షల వరకు, ఎంఎస్‌ఎంఈలకు రూ.20 లక్షల వరకు, హౌసింగ్ ఫైనాన్స్‌కు రూ.20 లక్షల వరకు (ఒక్కో రుణగ్రహీత వారీగా) థర్డ్‌పార్టీ లెండింగ్ ఇవ్వడాన్ని ప్రాధాన్య రంగ రుణ వితరణగా గుర్తిస్తాం'' అని ఎంపీసీ తెలిపింది. ఒక్కో ఎన్‌బీఎఫ్‌సీ సంస్థకు బ్యాంకులు తమ టైర్ 1 క్యాపిటల్‌లో 15 శాతం వరకు నిధులు సమకూర్చే అవకాశం ప్రస్తుతం ఉండగా, దీన్ని 20 శాతానికి ఆర్‌బీఐ పెంచింది.

**ఒక్క ఎన్‌బీఎఫ్‌సీనీ కూలిపోనివ్వం**


బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో పెద్దదైన, వ్యవస్థాపరంగా ముఖ్యమైన ఏ ఒక్క సంస్థా కుప్పకూలిపోకుండా ఆర్‌బీఐ చూస్తుందని దాస్ భరోసా ఇచ్చారు. పెద్దవైన ఎన్‌బీఎఫ్‌సీలు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలు (హెచ్‌ఎఫ్‌సీలు) నిధుల పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ఆయన ఈ ప్రకటన చేయడం గమనార్హం.

# ఎస్‌బీఐ బోణీ.. వడ్డీరేట్ల కోత

ఆర్‌బీఐ రెపో తగ్గింపు నేపథ్యంలో– బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తన రుణ రేటు (నిధుల సమీకరణ వ్యయ ఆధారిత– ఎంసీఎల్‌ఆర్)ను 15 బేసిస్ పాయింట్ల (100 బేసిస్ పాయింట్లు 1%) వరకూ తగ్గించింది. అన్ని కాలపరిమితులపై 0.15 శాతం రేటు తగ్గినట్లు బ్యాంక్ ఒక ప్రకటనలో పేర్కొంది. వాహన, గృహ, వ్యక్తిగత రుణాలకు ప్రామాణికంగా ఉన్న ఏడాది కాలవ్యవధి రుణ రేటు తాజా తగ్గింపుతో 8.40 నుంచి 8.25 శాతానికి పడింది. కొత్త రేట్లు ఆగస్టు 10వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని ఎస్‌బీఐ ప్రకటన తెలిపింది.




2019–20 ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకూ తమ క్యాష్ క్రెడిట్, ఓవర్‌డ్రాఫ్ట్ కస్టమర్లకు తమ రుణ రేటు 85 బేసిస్ పాయింట్ల వరకూ తగ్గినట్లు ఎస్‌బీఐ పేర్కొంది. అయితే గడచిన 4 ద్వైమాసిక సమావేశాల్లో ఆర్‌బీఐ రెపోరేటు 1.1% తగ్గింది.




# ఆదుకోండి మహాప్రభో!!

- ఉద్దీపన ప్యాకేజీ ఇవ్వండి
- వాహనాలపై జీఎస్‌టీ తగ్గించండి
- కేంద్రానికి వాహన పరిశ్రమ విజ్ఞప్తి

**న్యూఢిల్లీ:** అమ్మకాలు లేకపోవడంతో పాటు పలు సవాళ్లతో సతమతమవుతున్న ఆటోమొబైల్ సంస్థలు ఆపన్న హస్తం అందించాలంటూ కేంద్రానికి విజ్ఞప్తి చేశాయి. పరిశ్రమను ఆదుకునేందుకు ఉద్దీపన ప్యాకేజీ ఇవ్వాలని, వాహనాలపై వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) తగ్గించాలని కోరాయి. బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన పరిశ్రమ దిగ్గజాలు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మారుతీ సుజుకీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ, ఎంఅండ్‌ఎం ప్రెసిడెంట్ (ఆటోమోటివ్ విభాగం).. ఆటోమొబైల్ తయారీ సంస్థల సమాఖ్య సియామ్ ప్రెసిడెంట్ కూడా అయిన రాజన్ వధేరాతో పాటు ఆటో పరికరాల తయారీ సంస్థల సమాఖ్య ఏసీఎంఏ, డీలర్ల సమాఖ్య ఎఫ్ఏడీఏ ప్రతినిధులు ఈ భేటీలో పాల్గొన్నారు. 'ఆటో పరిశ్రమకు ఊతమిచ్చేలా చర్యలు తీసుకోవాలంటూ మేం కోరాము. డిమాండ్‌ను పెంచే దిశగా వాహనాలపై జీఎస్‌టీ రేటును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించాలని విజ్ఞప్తి చేశాము. ప్రభుత్వానికి కూడా కొన్ని ఆలోచనలు ఉన్నాయి. ఆటో రంగానికి త్వరలో ఉద్దీపన ప్యాకేజీ లభించగలదని ఆశిస్తున్నాను' అని భేటీ అనంతరం రాజన్ వధేరా చెప్పారు. ఆటోమొబైల్ రంగ సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రం తప్పక చర్యలు తీసుకుంటుందని భారీ పరిశ్రమల శాఖ మంత్రి అరవింద్ సావంత్ తెలిపారు. 'చర్చల ప్రక్రియలో భాగంగానే ఈ సమావేశం జరిగింది. వారు చెప్పిన విషయాలన్నింటినీ పరిశీలిస్తాం. తాజాగా రిజర్వ్ బ్యాంక్ కీలక వడ్డీ రేట్లను తగ్గించడం సానుకూలాంశం. ఇక ఆ ప్రయోజనాలను కస్టమర్లకు బదలాయించాల్సిన బాధ్యత బ్యాంకులపై ఉంది' అని కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి రాజీవ్ కుమార్ చెప్పారు.



ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో వాహన కంపెనీల ప్రతినిధుల సమావేశం

దాదాపు ఏడాదికాలంగా అమ్మకాలు క్షీణించి వాహన సంస్థలు సతమతమవుతున్న సంగతి తెలిసిందే. సియామ్ గణాంకాల ప్రకారం ఏప్రిల్–జూన్ మధ్య కాలంలో 60,85,406 యూనిట్లే అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే వ్యవధిలో నమోదైన 69,47,742 వాహన విక్రయాలతో పోలిస్తే ఇది 12.35 శాతం తగ్గుదల. మందగమనం కారణంగా గడిచిన మూడు నెలల్లో దాదాపు రెండు లక్షల పైచిలుకు ఉద్యోగాల్లో కోత విధించాల్సి వచ్చిందని ఎఫ్ఏడీఏ ప్రకటించింది.

**రిజిస్ట్రేషన్ ఫీజు పెంపు ఇప్పుడే వద్దు..**

రుణ లభ్యత, అధిక వడ్డీ రేట్లపరమైన సమస్యలు, వాహనాల కొనుగోలు ఖర్చులు పెరిగిపోతుండటం, వాణిజ్య వాహనాల యాక్సి లోడ్ సామర్థ్యంలో మార్పులు చేయడం తదితర అంశాలు డిమాండ్‌ను దెబ్బతీశాయని వివరించినట్లు వధేరా చెప్పారు. ఇప్పటికే పలు సవాళ్లతో సతమతమవుతున్న నేపథ్యంలో వాహనాల రిజిస్ట్రేషన్ ఫీజు పెంపు ప్రతిపాదనలను సత్వరం అమల్లోకి తెస్తే మరిన్ని సమస్యలు ఎదురవుతాయని పరిశ్రమ వర్గాలు మంత్రికి వివరించాయి.

**రుణ లభ్యత పెరిగేలా చూడాలి..**

'తక్కువ వడ్డీ రేట్లపై రుణాలు లభించేలా చూసేందుకు సత్వరం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఆర్‌బీఐ వడ్డీ రేట్ల కోత ప్రయోజనాలను కస్టమర్లకు వెంటనే బదలాయించేలా బ్యాంకులను కేంద్రం ఆదేశించాలంటూ కోరాము' అని వధేరా చెప్పారు. పాత, కాలుష్యకారకంగా మారుతున్న వాహనాలను రీప్లేస్ చేసేందుకు ప్రోత్సాహకాలతో కూడిన స్క్రాపేజీ పాలసీని ప్రవేశపెడితే కొత్త వాహనాలకు డిమాండ్ పెరగగలదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వధేరా చెప్పారు.

# బంగారం... జిగేల్

- ఒకేరోజు 35 డాలర్లకుపైగా లాభం
- 1,500 డాలర్లపైకి పరుగు
- దేశీయంగానూ రికార్డుల పరంపర

**న్యూఢిల్లీ/న్యూయార్క్:** అమెరికా–చైనా వాణిజ్య యుద్ధం తీవ్రత నేపథ్యంలో అంతర్జాతీయంగా పలు దేశాల కరెన్సీలు డాలర్ మారకంలో పతనం కావడం పసిడి ధరను పరుగులు పెట్టిస్తున్నాయి. అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్.. న్యూయార్క్ మర్కంటైల్ ఎక్స్ఛేంజ్‌లో ఔన్స్ (31.1గ్రా) ధర బుధవారం భారీగా పెరిగింది. ఒకదశలో 1,522.35 డాలర్ల గరిష్టాన్ని తాకింది. గడచిన ఆరేళ్లలో పసిడి ఈ స్థాయిని చూడ్డం ఇదే తొలిసారి. వాణిజ్య యుద్ధం, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో పసిడిని పెట్టుబడులకు సురక్షితమైనదిగా ఇన్వెస్టర్లు భావిస్తున్నారు.

**దేశీయంగా రూ.38 వేల చేరువకు...**

అంతర్జాతీయంగా పరుగుకు తోడు, డాలర్ మారకంలో రూపాయి విలువ పతనం చెందడంతో దేశంలోనూ బంగారం ధర భారీగా పెరుగుతూ, రికార్డులు సృష్టిస్తోంది. ఢిల్లీలో బుధవారం ధర 10 గ్రాములకు (99.9 ప్యూరిటీ) రూ.1,113 పెరిగి రూ.37,920కి చేరింది. 99.5 ప్యూరిటీ ధర కూడా రూ.1,115 ఎగసి రూ.37,750కి చేరింది. వెండి ధర కూడా కేజీకి రూ.650 పెరిగింది. రూ.43,670కి చేరింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో బుధవారం రాత్రి 10 గ్రాముల పసిడి ధర క్రితం ఒక దశలో రూ.38,488ను కూడా తాకింది. వెండి ధర రూ.1,137 లాభంతో రూ.43,624 వద్ద ట్రేడవుతోంది. ఇదే రీతిన ట్రేడింగ్ ముగిస్తే, గురువారం దేశీయ స్పాట్ మార్కెట్‌లో పసిడి ధరలు మరింత పరుగు పెట్టే అవకాశం ఉంది.



## ప్రాఫిట్ ప్లస్ డైలీ




### ఇండియన్ బ్యాంక్‌తో ఆదిత్య బిర్లా లైఫ్ జట్టు

చెన్నై: ప్రైవేట్ రంగ బీమా సంస్థ ఆదిత్య బిర్లా లైఫ్ సన్ లైఫ్ ఇన్సూరెన్స్‌కి ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ కార్పొరేట్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. ఇండియన్ బ్యాంక్ ఎండీ పద్మజ చుండూరు, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ అజయ్ శ్రీనివాసన్ ఇందుకు సంబంధించిన ఒప్పందంపై సంతకాలు చేశారు. దీని ప్రకారం ఆదిత్య బిర్లా సన్ లైఫ్‌కు చెందిన జీవిత బీమా పథకాలను ఇండియన్ బ్యాంక్ తమ ఖాతాదారులకు విక్రయించనుంది. 2,900 పైచిలుకు శాఖల్లో ఇవి అందుబాటులో ఉంటాయని ఇండియన్ బ్యాంక్ తెలిపింది. అర్బన్, సెమీ–అర్బన్ ప్రాంతాల వారికి మరింత చేరువ కావడానికి ఈ డీల్ తోడ్పడగలదని ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్ పేర్కొంది.

# వృద్ధి అంచనాల కోతతో నష్టాలు

- ఆర్‌బీఐ పాలసీ ఎఫెక్ట్...
- అంచనాలను మించిన రేట్ల కోత
- ఫలితమివ్వని తగ్గింపు
- 10,900 పాయింట్ల దిగువకు నిఫ్టీ
- 93 పాయింట్ల నష్టంతో 10,855 వద్ద ముగింపు
- 286 పాయింట్లు పతనమై 36,690కు సెన్సెక్స్



అంచనాలను మించి రేట్ల కోత ఉన్నప్పటికీ, వృద్ధి అంచనాల్లో కూడా ఆర్‌బీఐ కోత విధించడంతో బుధవారం స్టాక్ మార్కెట్ నష్టపోయింది. వడ్డీ రేట్ల ప్రభావిత బ్యాంక్, వాహన, రియల్టీ షేర్లతో పాటు లోహ షేర్లు కూడా పడిపోయాయి. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 10,900 పాయింట్ల దిగువకు పడిపోయింది. 93 పాయింట్లు పతనమై 10,855 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక రోజంతా 494 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరకు 286 పాయింట్లు నష్టపోయి 36,690 పాయింట్ల వద్దకు చేరింది.

**బ్యాంక్, వాహన షేర్లు బేర్...**

ఆర్‌బీఐ అనూహ్యంగా రెపో రేటును 35 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో రెపో రేటు తొమ్మిదేళ్ల కనిష్టానికి, 5.40 శాతానికి తగ్గింది. ఐదేళ్ల కనిష్టానికి పడిపోయిన వృద్ధికి జోష్ ఇచ్చే ప్రయత్నంలో భాగంగా ఆర్‌బీఐ ఈ ఏడాది వరుసగా నాలుగోసారి రెపో రేటును తగ్గించింది. కీలక రేట్లనే కాకుండా వృద్ధి రేటు అంచనాలను కూడా ఆర్‌బీఐ తగ్గించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 7 శాతంగా ఉండగలదన్న జూన్ అంచనాలను తాజాగా 6.9 శాతానికి తగ్గించింది. ఇది మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపించింది. వడ్డీ రేట్ల ప్రభావిత షేర్లు నష్టపోయాయి. ఆర్‌బీఎల్ బ్యాంక్ 8 శాతం, ఎస్‌బీఐ 3.7 శాతం, యాక్సిస్ బ్యాంక్ 2.7 శాతం, ఫెడరల్ బ్యాంక్ 1.5 శాతం, కోటక్ మహీంద్రా బ్యాంక్ 0.5 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.4 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.1 శాతం చొప్పున నష్టపోయాయి. ఇక వాహన షేర్ల విషయానికొస్తే, టాటా మోటార్స్ 4.2 శాతం, అశోక్ లేలాండ్ 3.7 శాతం, టీవీఎస్ మోటార్ 2.6 శాతం, మారుతీ సుజుకీ 1 శాతం, బజాజ్ ఆటో 0.2 శాతం చొప్పున పతనమయ్యాయి.

**494 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్**

సెన్సెక్స్ ఒక దశలో 128 పాయింట్లు లాభపడగా, మరో దశలో 366 పాయింట్లు పతనమైంది. మొత్తం మీద రోజంతా 494 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఇక నిఫ్టీ ఒక దశలో 27 పాయింట్ల పెరగ్గా, మరో దశలో 112 పాయింట్లు పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 2 పైసలు తగ్గి 70.84కు చేరింది.

**స్టాక్ మార్కెట్ డేటా**

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్‌ఈ | 2,346 |
| ఎన్‌ఎస్‌ఈ | 34,186 |
| ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్) | 15,34,441 |
| ఎఫ్‌ఐఐ | -384 |
| డీఐఐ | 532 |

- ఈ క్యూ1లో రూ.118 కోట్ల నికర లాభం రావడంతో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్ 15 శాతం లాభంతో రూ.20 వద్ద ముగిసింది.
- ప్రమోటర్ దమానీ 1% వాటాను తగ్గించుకోనుండటంతో డీ మార్ట్ 3.7% నష్టంతో రూ.1,453 వద్దకు చేరింది.
- 200కు పైగా షేర్లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. ఐటీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, టాటా స్టీల్, బ్రిటానియా ఇండస్ట్రీస్, అశోక్ లేలాండ్ తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.
- ఈ క్యూ1లో నికర లాభం 24 శాతం తగ్గడంతో ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ షేర్ 13 శాతం పతనమై రూ.446 వద్ద ముగిసింది.

## అరబిందో లాభం 40 శాతం జంప్




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జూన్ త్రైమాసికంలో అరబిందో ఫార్మా ఉత్తమ ఫలితాలను నమోదు చేసింది. ఈ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 40 శాతం వృద్ధి చెంది రూ.636 కోట్లు సాధించింది. టర్నోవర్ 28 శాతం అధికమై రూ.5,444 కోట్లుగా ఉంది. ఫార్ములేషన్స్ వ్యాపారం యూఎస్‌లో 42.3 శాతం పెరిగి రూ.2,688 కోట్లు, ఈయూ మార్కెట్లో 16.1 శాతం వృద్ధితో రూ.1,391 కోట్లు నమోదైంది. ఉత్తమ పనితీరుతో తొలి త్రైమాసికం ప్రారంభమైందని ఈ సందర్భంగా అరబిందో ఎండీ ఎన్.గోవిందరాజన్ తెలిపారు. 'ఈ క్వార్టరులో యూగియాస్ తయారీ కేంద్రం ప్రారంభించాం. ఆంకాలజీ, హార్మోనల్ విభాగంలో అయిదు ఉత్పత్తులను యూఎస్ మార్కెట్లో ప్రవేశపెట్టాం. తొలి బయోసిమిలర్ ఔషధ పరీక్షలు ప్రారంభించే పనిలో ఉన్నాం' అన్నారు.

## సగం తగ్గిన మహీంద్రా లాభం



ముంబై: మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో సగం తగ్గింది. గత క్యూ1లో.1,885 కోట్లుగా ఉన్న నికర లాభం(కన్సాలిడేటెడ్) ఈ క్యూ1లో 53 శాతం తగ్గి రూ.894 కోట్లకు చేరిందని మహీంద్రా అండ్ మహీంద్రా తెలిపింది. వాహన విక్రయాలు క్షీణించడంతో నికర లాభం సగానికి పైగా తగ్గిందని పేర్కొంది. మొత్తం ఆదాయం రూ.26,261 కోట్ల నుంచి రూ.26,289 కోట్లకు పెరిగిందని వివరించింది. నిర్వహణ లాభం 15 శాతం తగ్గి రూ.1,794 కోట్లకు తగ్గిందని పేర్కొంది. ఇక మార్జిన్ 2 శాతం తగ్గి 14 శాతానికి పరిమితమైందని తెలిపింది. గత క్యూ1లో మొత్తం 1.30 లక్షల వాహనాలు విక్రయించగా, ఈ క్యూ1లో వాహన విక్రయాలు 5 శాతం క్షీణించి 1.24 లక్షలకు తగ్గాయని మహీంద్రా కంపెనీ తెలిపింది. నికర లాభం సగానికి పైగా తగ్గడం, అమ్మకాలు కూడా క్షీణించడంతో మహీంద్రా అండ్ మహీంద్రా షేర్ భారీగా పతనమైంది. ఇంట్రాడేలో ఏడాది కనిష్ట స్థాయి, రూ.515కు పడిపోయిన ఈ షేర్ చివరకు 5.6 శాతం నష్టంతో రూ.518 వద్ద ముగిసింది. ఏడాది కాలంలో ఈ షేర్ 40 శాతం వరకూ నష్టపోయింది.

## బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,910 | ▲ 1,210 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,100 | ▲ 1,150 |
| వెండి (కిలో) | 46,800 | ▲ 1,100 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,240 | ▲ 770 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,470 | ▲ 740 |
| వెండి (కిలో) | 46,800 | ▲ 1,100 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,240 | ▲ 770 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,470 | ▲ 740 |
| వెండి (కిలో) | 46,800 | ▲ 1,100 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,000 | |
| బంగారం (22 క్యారెట్లు) | 33,610 | |
| వెండి (కిలో) | 42,500 | |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,400 | ▲ 910 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,710 | ▲ 840 |
| వెండి (కిలో) | 43,700 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,400 | ▲ 850 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,470 | ▲ 740 |
| వెండి (కిలో) | 46,800 | ▲ 1,100 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## హైదరాబాద్‌లో నోబ్రోకర్.కామ్ సేవలు



అఖిల్ గుప్తా, సౌరభ్ గర్గ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రియల్ ఎస్టేట్ పోర్టల్ నోబ్రోకర్.కామ్ హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. కస్టమర్ నుంచి కస్టమర్‌కు సేవలందిస్తున్న ఈ కంపెనీ ఇప్పటికే అయిదు నగరాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. అద్దె, కొనుగోలు, విక్రయానికి ఉన్న రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాపర్టీస్‌ను ఈ పోర్టల్‌లో నమోదు చేయవచ్చు. రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో ఎటువంటి బ్రోకరేజ్ వసూలు చేయబోమని కంపెనీ ఫౌండర్, సీఈవో సౌరభ్ గర్గ్ తెలిపారు. ఫౌండర్, సీటీవో అఖిల్ గుప్తాతో కలిసి బుధవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. 'ఒక్క భాగ్యనగరిలో బ్రోకరేజ్ వ్యాపారం ఏటా రూ.4,100 కోట్లుంది. ఈ నగరంలో నోబ్రోకర్.కామ్‌లో 15,000పైచిలుకు లిస్టింగ్స్ జరిగాయి. 33,000లకుపైగా కస్టమర్లు సేవలను వినియోగించుకున్నారు. దేశవ్యాప్తంగా సంస్థకు 65 లక్షల వినియోగదార్లున్నారు. 5 లక్షల లావాదేవీలు పూర్తి అయ్యాయి' అని వివరించారు.

# భాగ్యనగర్‌లో కటేరా ప్లాంటు

**రూ.700 కోట్లతో నిర్మాణం**

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డిజైన్, టెక్నాలజీని ఆసరాగా చేసుకుని నిర్మాణ రంగంలో ఉన్న యూఎస్ కంపెనీ కటేరా హైదరాబాద్ వద్ద ప్లాంటును నెలకొల్పుతోంది. శంషాబాద్ సమీపంలో 50 ఎకరాల విస్తీర్ణంలో రానున్న ఈ కేంద్రానికి కంపెనీ సుమారు రూ.700 కోట్లు వెచ్చిస్తోంది. నవంబరు నుంచి ఈ ఫ్యాక్టరీలో ఉత్పత్తుల తయారీ ప్రారంభం అవుతుందని కటేరా ఆసియా ప్రెసిడెంట్ ఆశ్ భరద్వాజ్ వెల్లడించారు. డిజైన్, బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ నజీబ్ ఖాన్‌తో కలిసి బుధవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. 2020 మార్చిలో ప్లాంటు నిర్మాణం పూర్తి అవుతుందని చెప్పారు. 1,000 మందికి ప్రత్యక్షంగా, 7,000 మందికి పరోక్షంగా ఉపాధి లభించనుందన్నారు. రోబోటిక్ అసెంబ్లీ విధానంలో ఏటా 80 లక్షల చదరపు అడుగుల భవన నిర్మాణ ఉత్పత్తులను తయారు చేయగల సామర్థ్యం ఈ ప్లాంటుకు ఉంది.

**వ్యయం 30 శాతం తక్కువ..**

కంపెనీ మల్టీ ఫ్యామిలీ హోమ్స్, కమర్షియల్ బిల్డింగ్స్, హోటళ్లు, మాల్స్, ఆసుపత్రులు, స్కూళ్ల నిర్మాణం చేపడుతోంది. 700 ప్రాజెక్టులు పూర్తి చేసింది. 'గోడలు, సీలింగ్, ఫ్లోరింగ్ వంటివన్నీ కూడా మా ఫ్యాక్టరీలో తయారవుతాయి. వీటిని నిర్మాణ స్థలంలో సులువుగా బిగించడమే. తలుపులు, కిటికీలు కూడా తయారు చేస్తున్నాం. కట్టడాలు 100 ఏళ్లపాటు మన్నికగా ఉంటాయి. అతి తక్కువ సమయంలో నిర్మాణం పూర్తి కావడమేగాక, వ్యయం 30 శాతం తక్కువ అవుతుంది. ఒక కోటి చదరపు అడుగుల విస్తీర్ణంలో పలు ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. బెంగళూరు సమీపంలో 45 ఎకరాల్లో ప్లాంటు ఉంది. భారత్‌లో కంపెనీ ఉద్యోగుల సంఖ్య 3,000లపైమాటే' అని ఆశ్ భరద్వాజ్ వివరించారు.



భూమి పూజ సందర్భంగా మాట్లాడుతున్న తెలంగాణ పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్


## 49 శాతం పెరిగిన లుపిన్ లాభం



న్యూఢిల్లీ: ఔషధ దిగ్గజం లుపిన్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ క్వార్టర్‌లో 49 శాతం పెరిగింది. గత క్యూ1లో రూ.203 కోట్లుగా ఉన్న నికర లాభం(కన్సాలిడేటెడ్) ఈ క్యూ1లో రూ.303 కోట్లకు పెరిగిందని లుపిన్ తెలిపింది. అమ్మకాలు రూ.3,775 కోట్ల నుంచి రూ.4,356 కోట్లకు పెరిగాయని లుపిన్ ఎమ్‌డీ నీలేశ్ గుప్తా తెలిపారు. ఈ క్యూ1లో కీలక మార్కెట్లలో అన్ని విభాగాల్లో మంచి పనితీరు సాధించామని నీలేశ్ గుప్తా తెలిపారు. ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరం శుభారంభాన్నిచ్చిందని పేర్కొన్నారు.

**ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో లుపిన్ షేర్ 4.1 శాతం లాభంతో రూ.781 వద్ద ముగిసింది.**

## ఓల్టాస్ ఆదాయం రూ.2,697 కోట్లు




న్యూఢిల్లీ: టాటా గ్రూప్‌నకు చెందిన ఓల్టాస్ కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో 11 శాతం తగ్గింది. గత క్యూ1లో రూ.187 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.166 కోట్లకు తగ్గిందని ఓల్టాస్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.2,176 కోట్ల నుంచి రూ.2,697 కోట్లకు పెరిగిందని పేర్కొంది. రూమ్ ఏసీ వ్యాపార విభాగం ఆదాయం 47 శాతం పెరిగి రూ. 1,749 కోట్లకు చేరిందని తెలిపింది. కమర్షియల్ రిఫ్రిజిరేషన్ ఉత్పత్తులు, ఎయిర్ కూలర్ల అమ్మకాలు కూడా జోరుగా ఉన్నాయని పేర్కొంది. ఇంజినీరింగ్ ఉత్పత్తులు, సర్వీసుల సెగ్మెంట్ ఆదాయం రూ.77 కోట్ల నుంచి రూ.74 కోట్లకు తగ్గిందని తెలిపింది.

**ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో ఓల్టాస్ షేర్ 2 శాతం నష్టంతో రూ.606 వద్ద ముగిసింది.**

## ఉత్పత్తి నాణ్యతకే ప్రథమ ప్రాధాన్యం

- నచ్చకపోతే తిప్పి పంపేయడమే
- దేశంలో ఆన్‌లైన్ షాపర్ల ధోరణి
- యూపీఎస్ పల్స్ అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ: ఆకర్షణీయంగా కనిపించే వెబ్‌సైట్, ఆధునికతను ఒలకబోసే మొబైల్ యాప్... ఆన్‌లైన్ షాపర్లను ఆకర్షించేవి ఇవి కావట. ఫీజుల విషయంలో పారదర్శకత, డెలివరీపై నియంత్రణ, స్పష్టతతో కూడిన రిటర్న్ పాలసీ, లాయల్టీ రివార్డులు వీటికి ఆన్‌లైన్ షాపర్లు ప్రాధాన్యం ఇస్తున్నట్టు యూపీఎస్ సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ షాపర్స్ పల్స్ అధ్యయనంలో తెలిసింది. ఆన్‌లైన్ రిటైలర్లకు తదుపరి హద్దులు ఇవేనని ఈ సంస్థ వ్యాఖ్యానించింది. అమెరికా, యూరోప్, కెనడాతోపాటు మొదటిసారి భారత్‌లోనూ ఆన్‌లైన్ షాపర్ల ప్రాధాన్యతలు, కొత్త ధోరణులు, వారి అంచనాలను తెలుసుకునేందుకు యూపీఎస్ ఈ సర్వే నిర్వహించింది. మన దేశంలో నాణ్యతకు ఆన్‌లైన్ షాపర్లు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిసింది. అలాగే, ఉత్పత్తులను తిరిగి పంపడంలోనూ, వాయిస్ ఫిర్యాదులు విషయంలోనూ చురుగ్గా ఉంటున్నారు. నాణ్యత దృష్ట్యానే మన దేశంలో 66 శాతం మంది అంతర్జాతీయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. దీని తర్వాత డెలివరీ కాస్ట్‌ను చూసే వారు 41 శాతం మంది ఉన్నారు.

## విభిన్న ఉత్పాదనలతో పోటీ


హీట్‌బోట్‌తో పరాగ్ కులకర్ణి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాటర్ హీటర్ల తయారీలో ఉన్న యూఎస్ దిగ్గజం ఏ.ఓ.స్మిత్ తాజాగా హీట్‌బోట్ పేరుతో ఎనిమిది నూతన మోడల్స్‌ను బుధవారమిక్కడ విడుదల చేసింది. రిమోట్‌తో పనిచేసే ఈ హీటర్‌లో ఉష్ణోగ్రతలను నియంత్రించవచ్చు. ఏ సమయానికి వేడి నీళ్లు కావాలో టైమర్‌తో నిర్దేశించవచ్చు. ధరల శ్రేణి రూ.10–15 వేలుంది. అలాగే ఎక్స్–7 ప్లస్ పేరుతో ఆర్‌వో వాటర్ ప్యూరిఫయర్‌ను సైతం ప్రవేశపెట్టింది. టీడీఎస్ స్థాయి 3,000 వరకు ఉన్న నీటిని కూడా ఇది శుద్ధిచేస్తుందని ఏ.ఓ.స్మిత్ ఇండియా వాటర్ ప్రొడక్ట్స్ ఎండీ పరాగ్ కులకర్ణి ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. 'ఇతర ఆర్‌వోలతో పోలిస్తే నీటి వృధా గణనీయంగా తగ్గిస్తుంది. ధర రూ.18,000గా నిర్ణయించాం' అని వివరించారు.

## టాటా స్టీల్ లాభం 64 శాతం డౌన్

న్యూఢిల్లీ: టాటా స్టీల్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో 64 శాతం తగ్గింది. గత క్యూ1లో రూ.1,934 కోట్లుగా ఉన్న నికర లాభం(కన్సాలిడేటెడ్) ఈ క్యూ1లో రూ.702 కోట్లకు తగ్గిందని టాటా స్టీల్ తెలిపింది. డిమాండ్ బలహీనంగా ఉండటం, ఉత్పత్తి వ్యయాలు పెరగడంతో నికర లాభం ఈ స్థాయిలో తగ్గిందని టాటా స్టీల్ సీఈఓ, ఎమ్‌డీ, టీవీ నరేంద్రన్ తెలిపారు. మొత్తం ఆదాయం మాత్రం రూ.35,847 కోట్ల నుంచి రూ.36,198 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. ఉక్కు రంగం చెప్పుకోదగిన స్థాయిలో సమస్యలను ఎదుర్కొంటోందని, ఇది మొత్తం లాభదాయకతపై ప్రభావం చూపుతోందని నరేంద్రన్ పేర్కొన్నారు.

**ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో టాటా స్టీల్ షేర్ ధర 4.7 శాతం నష్టంతో రూ.382 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేర్ ఏడాది కనిష్ట స్థాయి, రూ.378ను తాకింది.**

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 08-08-2019

| | |
|---|---|
| విశాఖ | 352–00 |
| చిత్తూరు | 368–00 |
| వరంగల్ | 331–00 |
| చెన్నై | 375–00 |
| ముంబై | 381–00 |
| విజయవాడ | 339–00 |
| నమక్కల్ | 370–00 |
| గోదావరి | 334–00 |
| **07–08–2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 328–00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 3.90 |

## హైదరాబాద్‌లో బ్రిటన్ టెక్నాలజీ హబ్

చెన్నై: భారతీయ కంపెనీలతో భాగస్వామ్యాలు కుదుర్చుకునేందుకు, ఇరు దేశాల్లోను పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు భారత్‌లో బ్రిటన్ హై కమిషనర్ సర్ డొమినిక్ ఆస్కిత్ తెలిపారు. ఇందులో భాగంగా త్వరలో నాలుగు భారతీయ నగరాల్లో టెక్ హబ్‌లు (టెక్నాలజీ హబ్) ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. హైదరాబాద్‌తో పాటు న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాల్లో వీటిని నెలకొల్పనున్నట్లు చెప్పారు. రెండు దేశాల్లోని టెక్నాలజీ పరిశ్రమల సామర్థ్యాలు .. అవసరాలను మదింపు చేసి, ఇరు దేశాల కంపెనీలు కలిసి పనిచేయగలిగే అంశాలపై ఈ టెక్ హబ్‌లు కసరత్తు చేస్తాయని డొమినిక్ వివరించారు.

**ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు**

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ADANI PORT | 372.25 | 376.95 |
| ASIAN PAINT | 1559.2 | 1565.85 |
| AXIS BANK L | 659.95 | 679 |
| BAJAJ AUTO | 2605.1 | 2609.8 |
| BAJAJ FINSE | 7152.45 | 7096.35 |
| BAJAJ FINAN | 3265.8 | 3272.25 |
| BHARTI AIRT | 366.1 | 368.45 |
| BHARAT PETR | 331.1 | 345.3 |
| BRITANNIA I | 2540.55 | 2550.55 |
| CIPLA LTD | 518.3 | 500.15 |
| COAL INDIA | 206.1 | 205.1 |
| EICHER MOTO | 16456.65 | 17010.75 |
| GAIL (INDIA | 121.7 | 123.35 |
| GRASIM INDU | 737.95 | 761.5 |
| HCL TECHNOL | 1022.65 | 1024.2 |
| HDFC LTD | 2175.2 | 2189.9 |
| HDFC BANK L | 2184 | 2189.1 |
| HERO MOTOCO | 2505.25 | 2468.55 |
| HINDALCO I | 176.4 | 180.7 |
| HINDUSTAN Uni | 1777.25 | 1744.1 |
| INDIABULLS | 445.4 | 514.05 |
| ICICI BANK | 408.4 | 410.25 |
| INDUSIND BA | 1426.35 | 1417.1 |
| BHARTI INFR | 245.55 | 246.1 |
| INFOSYS LIM | 776.1 | 774.45 |
| INDIAN OIL | 129 | 132.4 |
| ITC LTD | 253.65 | 258.9 |
| JSW STEEL L | 212.25 | 217.55 |
| KOTAK MAHIN | 1476.3 | 1485.3 |
| LARSEN & TO | 1360.05 | 1377.5 |
| MAHINDRA & | 518.3 | 549.45 |
| MARUTI SUZU | 5775 | 5833.3 |
| NTPC LTD | 123.05 | 123.35 |
| OIL AND NAT | 130.5 | 131.45 |
| POWER GRID | 198.85 | 198.1 |
| RELIANCE IN | 1109.4 | 1128.3 |
| STATE BANK | 289.9 | 301.4 |
| SUN PHARMAC | 421.05 | 418.2 |
| TATA MOTORS | 117.4 | 122.5 |
| TATA STEEL | 381.9 | 401.6 |
| TATA CONSUL | 2213.45 | 2214.9 |
| TECH MAHIND | 674.45 | 670.6 |
| TITAN COMPA | 1028.45 | 1046.7 |
| ULTRATECH C | 4341.65 | 4357 |
| UPL LIMITED | 532.8 | 549.35 |
| VEDANTA LIM | 136.65 | 140.8 |
| WIPRO LTD | 262.55 | 258.9 |
| YES BANK LI | 86.85 | 85.35 |
| ZEE ENTERTA | 327.9 | 312.45 |

**నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ**

| | | |
|---|---|---|
| ABB INDIA L | 1390.55 | 1384.55 |
| ACC LIMITED | 1557.05 | 1549.05 |
| AMBUJA CEME | 204.9 | 201.85 |
| ASHOK LEYLA | 61.15 | 63.45 |
| BAJAJ HOLDI | 3488.75 | 3447.4 |
| BANDHAN BAN | 477.25 | 482.15 |
| BANK OF BAR | 97.6 | 104.2 |
| BHEL | 57.5 | 57.3 |
| BIOCON LIMI | 224.95 | 225.3 |
| BOSCH LIMIT | 13976.4 | 14499.6 |
| CADILA HEAL | 227.6 | 226.25 |
| COLGATE PAL | 1201.3 | 1207.25 |
| CONTAINER C | 483.4 | 497.65 |
| DABUR INDIA | 430.65 | 433.5 |
| DLF LIMITED | 165.9 | 168.25 |
| AVENUE SUPE | 1434.3 | 1490.45 |
| GENERAL INS | 196.75 | 192 |
| GODREJ CONS | 634.85 | 622.45 |
| HAVELLS IND | 644.55 | 646.85 |
| HDFC AMC LI | 2122.35 | 2077.55 |
| HDFC LIFE I | 518.1 | 512.1 |
| HINDUSTAN Pet | 244.45 | 253.55 |
| HINDUSTAN Zinc | 208.3 | 205.25 |
| ICICI LOMBA | 1168.45 | 1165.15 |
| ICICI PRU L | 397.35 | 394.95 |
| VODAFONE ID | 5.35 | 5.65 |
| INTERGLOBE | 1498.95 | 1492.5 |
| L&T FINANCE | 96.15 | 98.8 |
| LUPIN LIMIT | 781.9 | 750.85 |
| MARICO LIMI | 378.6 | 377.7 |
| UNITED SPIR | 599.1 | 592.55 |
| MOTHERSON S | 97.45 | 102.45 |
| MRF LTD | 53998.5 | 53871.15 |
| NHPC LTD | 22.35 | 21.9 |
| THE NEW IND | 121.1 | 121.7 |
| NMDC LTD. | 101.6 | 104.7 |
| ORACLE FIN | 3259.85 | 3288.3 |
| PAGE INDUST | 18402.45 | 18592.8 |
| PIRAMAL ENT | 1673.7 | 1718.8 |
| PETRONET LN | 235.55 | 231.9 |
| P&G HYGIENE | 10437.85 | 10498.7 |
| PIDILITE IN | 1289.9 | 1308.7 |
| STEEL AUTHO | 39.05 | 40.55 |
| SBI LIFE IN | 786.55 | 787.2 |
| SHREE CEMEN | 20180.85 | 20206.45 |
| SIEMENS LTD | 1101.45 | 1131.15 |
| SHRIRAM TRA | 997.85 | 983.2 |
| UNITED BREW | 1392.65 | 1399.7 |




Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

epaper.sakshi.com


LOVED IN 70 COUNTRIES
BAJAJ
THE WORLD'S FAVOURITE INDIAN
BAJAJ
అధిక ధరల నుండి స్వేచ్ఛ
సగర్వంగా మీ సవారీని తీసుకెళ్ళండి కేవలం ₹999/-* లకే.
డౌన్ పేమెంట్
₹999/-*
CT
డౌన్ పేమెంట్
₹1 199/-*
PLATINA
డౌన్ పేమెంట్
₹4 999/-*
pulsar
లో డౌన్ పేమెంట్ సౌకర్యం Discover మరియు Avenger బైకుల పైన కూడా ఉంది.
స్కీము 2019 ఆగస్టు 31 వరకు అమలులో ఉంటుంది.
Call 7219821111 | For Institutional / Bulk orders, please send an e-mail to corporatesales@bajajauto.co.in
*నియమ నిబంధనలు వర్తిస్తాయి. వివరాల కోసం సందర్శించండి www.bajajauto.com/999offer. ఎంపిక చేసిన ప్రదేశములలో మాత్రమే బజాజ్ ఆటో ఫైనాన్స్ ద్వారా CT, Platina, Pulsar 150, Discover మరియు Avenger మోడళ్ళ పైన ఈ స్కీము చెల్లుతుంది. సూచించిన మొత్తాలు వరుసగా CT, Platina మరియు Pulsar బైకులకు చెందిన కనీస డౌన్ పేమెంట్లు. ప్రొసెసింగ్ ఫీజు అదనం. ఫైనాన్స్ విషయంలో తుది నిర్ణయం ఫైనాన్సరుదే. ముందస్తు నోటీసు లేకుండా ఏదైనా ఆఫరును లేదా అన్ని ఆఫరులను సవరించడానికి లేదా ఉపసంహరించుకోవడానికి సర్వ హక్కులు బజాజ్ ఆటోకి చెంది ఉంటాయి.
BAJAJ FINANCE LTD - AF
Authorised Dealers For Bajaj Auto Ltd.: Vijayawada VARUN BAJAJ 0866-6610501,9966383555 • Gudiwada VARUN BAJAJ 0866- 247285, 9885180311. Authorised Service Centre: : I TOWN 9885180278, GANDHI NAGAR 9885002241, NUNN 9885706839, KANURU 8297265444, BHAVANIPURAM 9885180307, MACHAVARAM 8297215333, AUTO NAGAR 8297544427, NANDIGAMA 9885180284, KANCHIKACHERLA 9885001463, IBRAHIMPATNAM 9885180274, MYLAVARAM 9052421177, TIRUVURU 9885180306, 9885810692, GAMPALAGUDEM 8297225444, NUZIVIDU 9885180296, VISSANNAPET 9703637459, 9951657262, JAGGAYYAPET 9885180279, AGIRIPALLI 8297913888, MACHILIPATNAM 9885110333, KAIKALURU 9885180281, KALIDINDI 8297066111, CHALLAPALLI 9885114445, AVANIGADDA 9703219996, VUYYURU 08676-236263, 9885107476, KANKIPADU 9885163222, GANNAVARAM 9885180263, HANUMAN JUNCTION 8297181666.